అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

మంగళవారం 7-2-2023 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 | సంచిక : 37 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 12 పేజీలు | వెల : 6.50




భూప్రకోపం

టర్కీ..సిరియా విలవిల

- భారీ భూకంపాల తాకిడికి... 2308 మందికిపైగా మృతి

వివరాలు 2లో






ఇది ప్రగతి పద్దు


రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం అడ్డుపడుతోంది

- ఆర్థిక క్రమశిక్షణ, పటిష్ట కార్యాచరణతో ముందుకు
- సాగునీటిరంగంలో దేశాన్ని మించిన వృద్ధి
- సంక్షేమ పథకాలు ఉచితాలు కాదు
- చేనేతపై ఐదు శాతం జీఎస్టీ సరికాదు
- మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యం
- విద్యారంగం మరింత బలోపేతం
- వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు
- ఏప్రిల్ నుంచి కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసు క్రమబద్ధీకరణ : అసెంబ్లీ బడ్జెట్ ప్రసంగంలో మంత్రి హరీశ్‌రావు
- 1.44 గంటలు కొనసాగిన ప్రసంగం
- శాసనమండలిలో పద్దును ప్రవేశపెట్టిన మంత్రి వేముల

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్రం సమ్మిళిత అభివృద్ధితో ప్రగతిపథంలోకి దూసుకుపోతున్నదని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి టి. హరీశ్‌రావు అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా పెడుతున్న ఆంక్షలు, తీసుకుంటున్న నిర్ణయాలు రాష్ట్రాల హక్కులను కాలరాస్తున్నాయని అభిప్రాయపడ్డారు. సాగునీటి ప్రాజెక్టులను సత్వరం పూర్తి చేయడం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎఫ్ఆర్‌బీఎం పరిధికిలోబడి బడ్జెటేతర రుణాలు సమీకరించిందని చెప్పారు. సోమవారం స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాల మూడో రోజున 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక బడ్జెట్‌ను మంత్రి శాసనసభలో నాలుగోసారి ప్రవేశపెట్టారు. దీనికి రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు హాజరయ్యారు. అలాగే అధికారుల గ్యాలరీలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారి, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి కె. రామకృష్ణారావు సైతం ఉన్నారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు బడ్జెట్ ప్రసంగాన్ని కొనసాగిస్తూ రూ.2,90,396 కోట్లతో రాష్ట్ర బడ్జెట్‌ను సభలో ప్రతిపాదించారు. రెవెన్యూ వ్యయం రూ.2,11,685 కోట్లుకాగా, పెట్టుబడి వ్యయం రూ.37,525 కోట్లుగా పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి మనకున్న ఆర్థిక సామర్థ్యం మేరకు రుణ పరిమితిని రూ.53,970 కోట్లుగా బడ్జెట్‌లో పొందుపరిచి సభలో ఆమోదించుకున్నామన్నారు. కానీ కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా రూ.15,033 కోట్లు కోత పెట్టి ఈ పరిమితిని రూ.38,937 కోట్లకు తగ్గించినట్టు చెప్పారు. పన్నుల వాటాలో తెలంగాణకు 2019-20 సంవత్సరంలో ఇచ్చిన మొత్తానికి తగ్గకుండా రూ.723 కోట్లు స్పెషల్ గ్రాంట్ ఇవ్వాలనీ, పోషకాహార కార్యక్రమాల కోసం రూ.171 కోట్లు గ్రాంటు ఇవ్వాలని 15వ ఆర్థిక సంఘం చెప్పినప్పటికీ కేంద్రం ఇవ్వకుండా మొండి చేయి చూపిందన్నారు. 2021-22 సంవత్సరాలకు గానూ 15వ ఆర్థిక సంఘం తెలంగాణ రాష్ట్రానికి రూ.5,374 కోట్లు ...5లో





2023-24 రాష్ట్ర బడ్జెట్ రూ.2.90 లక్షల కోట్లు

వివరాలు (రూ.కోట్లలో)

రెవెన్యూ వ్యయం 2,11,685

పెట్టుబడి వ్యయం 37,525

కేంద్రం ఒక్కపైసా ఇవ్వలేదు..

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 94(2) ప్రకారం వెనుకబడిన జిల్లాల అభివృద్ధి కోసం కేంద్రం నిధులు కేటాయించాలి. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం ఏడాదికి రూ.450 కోట్లు చొప్పున తెలంగాణకు ఇవ్వాల్సి ఉండగా.. మూడు సంవత్సరాలకు గానూ రూ.1,350 కోట్లు ఇవ్వనేలేదు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన మిషన్ భగీరథ పథకానికి రూ.19,205 కోట్లు, మిషన్ కాకతీయ పథకానికి రూ.5,000 కోట్లు ఇవ్వాలని నిటి ఆయోగ్ కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. కానీ కేంద్ర సర్కారు ఒక్కపైసా కూడా ఇవ్వలేదు.

కేటాయింపులే కాదు.. ఖర్చు కూడా చేయాలి

బడ్జెట్‌పై సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్ర బడ్జెట్‌లో ఆయా రంగాలకు నిధుల కేటాయింపులే కాకుండా వాటిని పూర్తిస్థాయిలో ఖర్చు చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ అభిప్రాయపడింది. ఈ రెండింటి మధ్య భారీ వ్యత్యాసం కనిపిస్తున్నదని విశ్లేషించింది. సీపీఐ(ఎం) ...5లో

మ్యానిఫెస్టో హామీలు అమలు చేయాలి : సీపీఐ



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రతిపాదించిన బడ్జెట్ కేటాయింపులన్నీ పూర్తిగా అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. ఈ మేరకు సోమవారంనాడొక పత్రికా ప్రకటన విడుదల చేశారు. నిరుపేదలకు ఇండ్ల స్థలాలు, ...6లో

బడ్జెట్‌లో భారీ అంకెలు

సీఎల్పీ నేత భట్టి విక్రమార్క



ఎన్నికల సంవత్సరం ప్రజల కోసం ఏదో చేస్తున్నాం అన్నట్టు బడ్జెట్ ఉంది తప్ప అందులో ఏమీ లేదు. ప్రజలను మభ్యపెడుతున్నారు. అమలు చేయాలని చిత్తశుద్ధి ఉంటే గత కేటాయింపుల విషయంలో ఎంత ఖర్చు చేశారో చెప్పాలి. ఇండ్ల స్థలాలు, రుణమాఫీ, డబుల్ బెడ్ రూం ఇండ్లపై బడ్జెట్‌లో ప్రస్తావన లేదు. 24 గంటల ఉచిత విద్యుత్ అని గొప్పలు చెపుతున్నారు కానీ ఎక్కడా 5గంటలు కూడా రావడం లేదు. రైతులు ఇబ్బందులు ...6లో

భారీగా పెరిగిన 71మంది ఎంపీల ఆస్తులు



2009నాటితో పోల్చితే పెరుగుదల 286 శాతం

- మొదటి..రెండు స్థానాల్లో బీజేపీ ఎంపీలు : ఏడీఆర్ నివేదిక

న్యూఢిల్లీ : 2009 తర్వాత ఎంపీగా గెలిచినవారిలో 71 మంది ఆస్తులు, సంపదను పెద్ద మొత్తంలో పోగేసుకున్నారని 'అసోసియేషన్ ఫర్ డెమొక్రాటిక్ రిఫార్మ్స్' (ఏడీఆర్) నివేదిక వెల్లడించింది. ఆస్తుల్లో సగటు పెరుగుదల 286శాతముందని నివేదిక పేర్కొంది. ఆస్తులు భారీ ఎత్తున పెంచుకున్న వారిలో బీజేపీ ఎంపీలు రమేశ్ చందప్ప, పి.సి.మోహన్ మొదటి, రెండు స్థానాల్లో ఉన్నారని నివేదిక పేర్కొంది. దీనికి సంబంధించి మరిన్ని వివరాలు ఈ విధంగా ఉన్నాయి. రమేశ్ చందప్ప ఆస్తులు 2009లో రూ.1.18కోట్లు. 2014నాటికి రూ.8.94 కోట్లు కాగా, 2019నాటికి తన ఆస్తులు రూ.50.14కోట్లకు చేరుకున్నాయని కేంద్ర ఎన్నికల సంఘానికి ...5లో

ఏ శ్రమనైనా గౌరవించండి



- ఉద్యోగాల వెంట పరుగెత్తడం ఆపండి
- దేశంలో నిరుద్యోగ సమస్య ఉండదు : ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ : భారత్‌లో నిరుద్యోగ సమస్యపై ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్ ఆశ్చర్యకరమైన వ్యాఖ్యలు చేశారు. బాసాన్లు కడిగే పని అయినా.. బీటెక్ చదివిన వ్యక్తి ఆనందంగా చేయటం మొదలు పెడితే దేశంలో నిరుద్యోగ సమస్యే ఉండదని అన్నారు. ఏ శ్రమనైనా గౌరవించకనే.. దేశంలో నిరుద్యోగ సమస్య పెరుగుతున్నదని చెప్పారు. పని స్వభావంతో సంబంధం లేకుండా అన్ని రకాల ...6లో

అదానీకి మరో షాక్!

- స్మార్ట్‌మీటర్ల బిడ్‌ను రద్దు చేసిన యూపీ డిస్కమ్
- బిడ్ విలువ రూ.5400కోట్లు





న్యూఢిల్లీ : ప్రధాని మోడీకి అత్యంత సన్నిహితుడు, బడా కార్పొరేట్ గౌతం అదానీకి మరో షాక్ తగిలింది. స్మార్ట్‌మీటర్ల తయారీకి ఉద్దేశించి గౌతం అదానీ గ్రూప్ దాఖలు చేసిన బిడ్‌ను ఉత్తరప్రదేశ్ విద్యుత్ పంపిణీ సంస్థ రద్దు చేసింది. 75లక్షల స్మార్ట్ మీటర్లను అందించేందుకు అదానీ కంపెనీ రూ.5400 కోట్లకు టెండర్ దాఖలు ...5లో

మేడారంలో వేసిన ఈ అడుగు..

కేసీఆర్ ప్రభుత్వాన్ని పాతాళానికి తొక్కడానికే..



టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి

- ప్రారంభమైన 'హాత్ సే హాత్' పాదయాత్ర
- పేదలకు బతుకుదెరువు ఇచ్చిన పార్టీ కాంగ్రెస్ : ఎమ్మెల్యే సీతక్క

నవతెలంగాణ- తాడ్వాయి/ములుగు

మేడారంలో వేసిన ఈ అడుగు కేసీఆర్ ప్రభుత్వాన్ని పాతాళానికి తొక్కడానికే అని టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో పాదయాత్రకు కొనసాగింపుగా టీపీసీసీ చేపడుతున్న 'హాత్ సే హాత్' జోడో పాదయాత్రలో సోమవారం ములుగు నియోజకవర్గం నుంచి ప్రారంభించారు. ములుగు చేరుకున్న రేవంత్ రెడ్డి ముందుగా ములుగు గట్టమ్మ తల్లి దేవాలయంలో పూజలు చేశారు. సమ్మక్క-సారలమ్మల ఆశ్వీరాదం కోసం వచ్చే భక్తులంతా తొలుత ఇక్కడ పూజలు చేసి మేడారం వెళ్లడం అనవాయితీ. అనంతరం మేడారంలో సమ్మక్క-సారలమ్మలకు ప్రత్యేక పూజలు చేసి వనదేవతల ఆశీర్వాదం తీసుకొని అక్కడే నుంచే హాత్ సే హాత్ జోడో పాదయాత్రను లాంఛనంగా ప్రారంభించారు. మేడారం నుంచి మొదలైన పాదయాత్ర ప్రాజెక్టు నగర్ వరకు సాగింది. అక్కడ కొంతసేపు విరామం తీసుకున్న అనంతరం ప్రాజెక్టు నగర్ నుంచి పస్రా గ్రామానికి పాదయాత్ర చేరుకుంది. మార్గమధ్యలో పుట్టాపూర్ గ్రామానికి చెందిన మహిళా వ్యవసాయ కూలీలు రేవంత్ రెడ్డిని కలిశారు. వారి సమస్యలను అడిగి తెలిసుకున్నారు రేవంత్ రెడ్డి. పస్రా కార్నర్ మీటింగ్ తర్వాత పాదయాత్ర రామప్ప గ్రామం వరకు కొనసాగింది. రాత్రి ఆ గ్రామంలోనే బస చేయనున్నారు. పస్రా గ్రామంలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ములుగు నుంచి ...5లో

భూప్రకోపం

వివిధ నగరాల్లో వేలాది భవనాలు నేలమట్టం

- మృతులు, గాయపడ్డవారితో నిండిపోయిన హాస్పిటల్స్
- ప్రకృతి ప్రళయంతో...కట్టుబట్టలతో గడ్డకట్టే చలిలో పౌరులు
- మొదటి భూకంపం తర్వాత 20మార్లు కంపించిన భూమి
- సైప్రస్, లెబనాన్, ఇజ్రాయెల్ దేశాల్లోనూ భూకంప ప్రభావం





ఇస్తాంబుల్: సోమవారం తెల్లవారుజామున సంభవిం చిన భూకంప తాకిడికి టర్కీ, సిరియా దేశాలు విలవిల్లాడి పోయాయి. భూకంపం అంటే ఇలా ఉంటుందా? అని ప్రపంచం యావత్తు భీతిల్లిపోయింది. తెల్లవారు జామున 4.17 గంటలకు, ఉదయం 10.30 గంటలకు టర్కీ, సిరియా సరిహద్దు ప్రాంతంలో రెండు భీకరమైన భూ కంపాలు ఏర్పడ్డాయి. దీంతో ఒక్కసారిగా భవనాలు పేక మేడల్లా కూలిపోయాయి. అందులో చిక్కుకున్న వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. ఇరు దేశాల నుంచి వెలువడిన అధికారిక సమాచారం ప్రకారం మృతుల సంఖ్య 2308 దాటింది. టర్కీ ఆగ్నేయ ప్రాంతంలో, ఉత్తర సిరియాలోని పలు నగరాల్లో పౌరులు పెద్ద సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారు. మొదటి భూకంపం తర్వాత భూమి 20సార్లకుపైగా కంపించింది. ఉదయం 10.30 గంటలకు 7.5 తీవ్రతతో రెండోసారి భూకంపం సంభవించింది.

దీంతో ప్రజలు పెద్ద సంఖ్యలో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని సురక్షిత ప్రాంతాలకు తరలివెళు న్నారు. వృద్ధులు, చిన్నారులతో కట్టుబట్టలతో బయటకు వచ్చామని, మరోవైపు ఆరు బయట మంచు పెద్ద ఎత్తున కురుస్తోందని పౌరులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టర్కీలోని పలు నగరాల్లో ఉష్ణోగ్రతలు 3 నుంచి 4 డిగ్రీల సెల్సీయస్‌కు పడిపోయాయి.

సాయమందించండి : వివిధ దేశాల నేతలు పిలుపు

భూకంప ఘటనలపై ప్రపంచ దేశాల నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. టర్కీ, సిరియాలకు ఎన్డీఆర్ఎఫ్, వైద్య బృందాలను, సహాయక సామగ్రిని పంపాలని ప్రధాని మోడీ అధికారులను ఆదేశించారు. ప్రపంచ దేశాలు టర్కీ, సిరియాకు మానవతా సాయం అందించాలని భారత ప్రధాని సహా వివిధ దేశాల నేతలు కోరారు. ప్రస్తుతానికి టర్కీలో భూకంప ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితి ఆందోళన కర స్థాయిలో ఉంది.

గాయపడ్డవారితో, మృతులతో హాస్పిటల్స్ అన్నీ నిండిపోయాయి. టర్కీలోని గజియాన్‌టెప్, కహ్రమాన్‌మరస్, హటాయ్, ఒస్మానియె, అడియమన్, మలట్య, అడన, కిలిస్ తదితర నగరాలపై ప్రభావం ఎక్కువగా ఉందని అధికారులు వెల్లడించారు. సోమవారం నాటి భూకంపాలు లెబనాన్, సైప్రస్, ఇజ్రాయెల్ దేశాల్ని తాకాయి.

పెరుగుతున్న మృతుల సంఖ్య

భూకంపం ధాటికి ఇప్పటివరకు రెండు దేశాల్లో 1700 మందికిపైగా దుర్మరణం చెందారని, గాయపడ్డవారి సంఖ్య లక్షల్లో ఉందని వార్తలు వెలువడుతున్నాయి. టర్కీ కాలమానం ప్రకారం, తెల్లవారుజామున 4.17 గంటలకు ఆ దేశ ఆగ్నేయ ప్రాంతంలో ఉన్న గాజియాన్‌తెప్ ప్రాంతానికి సమీపంలో 7.8 తీవ్రతతో భూకంపం సంభవించింది. అక్కడికి 33 కి.మీ దూరం, 18 కి.మీ లోతులో భూకంప కేంద్రం ఉన్నట్టు అమెరికా జియోలాజికల్ సర్వే వెల్లడిం చింది. మొదటి భూకంపం తాకిడికి దక్షిణ టర్కీ, ఉత్తర సిరియాలోని పలు ప్రాంతాల్లో తీవ్ర ప్రభావం చూపింది. టర్కీలోని దియర్‌బకీర్, సిరియాలోని అలెప్పో, హమా నగరాల్లో వందలాది భవనాలు పేకమేడల్లా కూలి పోయాయి. తొలి భూకంపం సంభవించిన మరికొద్ది గంటలకు (సుమారుగా ఉదయం 10.30 గంటలకు) మరో శక్తివంతమైన (7.5 తీవ్రత) భూకంపం ఏర్పడింది. దాదాపు 20 సార్లు శక్తివంతమైన భూకంపాలు చోటుచేసుకున్నాయని శాస్త్రవేత్తలు గుర్తించారు. దీంతో ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉన్నట్టు అధికారులు తెలిపారు.

గాఢనిద్రలో ఉండగా..

తెల్లవారుజామున ప్రజలంతా గాఢ నిద్రలో ఉన్న సమయంలో ఈ విలయం చోటుచేసుకోవడంతో మృతుల సంఖ్య భారీగా పెరిగింది. టర్కీలో మొత్తం 10 ప్రావిన్సుల్లో భూకంపం ప్రభావం ఎక్కువగా ఉంది. ఇప్పటివరకు 1498 మంది మరణించారని ఆ దేశ అధ్యక్షుడు ఎర్డోగన్ వెల్లడించారు. 5300 మందికిపైగా గాయపడినట్టు చెప్పారు. భూకంపం తాకిడికి టర్కీలో దాదాపు 3వేల భవనాలు ధ్వంసమయ్యాయి. ఇక సిరియాలోని ప్రభుత్వ నియంత్రణ ఉన్న ప్రాంతాల్లో 810 మంది మరణించినట్టు సిరియా ఆరోగ్య మంత్రిత్వశాఖ వెల్లడించింది. మరో 639 మంది గాయపడినట్టు తెలిపింది. కాగా రెబల్స్ ఆధీనంలో ఉన్న ప్రాంతాల్లో కనీసం 400 మందికి పైగా మరణించినట్టు తెలుస్తోంది. భవనాల శిథిలాల కింద అనేక మంది చిక్కుకుపోయారు. దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముంది.

బడ్జెట్‌లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలకు పెద్దపీట

రూ.44,026 కోట్లు కేటాయించడం ఆనందకరం : మంత్రి ఎర్రబెల్లి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బడ్జెట్‌లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలకు పెద్దపీట వేసిన సీఎం కేసీఆర్‌కు, ఆర్థిక మంత్రి హరీశ్‌రావుకు ఆ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కృతజ్ఞతలు తెలిపారు. తన శాఖలకు మొత్తంగా రూ.44,026 కోట్లు కేటాయించడం ఆనందకరంగా ఉందని పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

ఈ బడ్జెట్ పల్లెకు పట్టం కట్టిందని తెలిపారు. ఈ బడ్జెట్‌లో సింహభాగంగా పంచాయతీరాజ్ శాఖకు రూ. 31,426 కోట్ల రూపాయలు కేటాయించడం మంచి పరిణామం అని పేర్కొన్నారు. ఆసరా పింఛన్లకు రూ.12 వేల కోట్లు, మిషన్ భగీరథకు 600 కోట్ల రూపాయలు కేటాయించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. దేశానికి తెలంగాణ పల్లెలు రోల్ మోడల్‌గా మారాయనీ, అభివృద్ధిలో అందరితో పోటీ పడి మొదటి స్థానంలో నిలుస్తున్నాయని పేర్కొన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్‌లో 13 జాతీయ అవార్డులొచ్చాయని గుర్తుచేశారు. ప్రతి గ్రామంలోనూ నేడు ట్రాక్టర్, ట్యాంకర్, ట్రాలీ పెట్టి పారిశుధ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. హరిత హారంలో భాగంగా 710 కోట్ల రూపాయలు ఖర్చు చేసి నర్సరీలు ఏర్పాటు చేశామని వివరించారు. పల్లెప్రకృతివనాలు, శ్మశానవాటికలు, డంపింగ్‌యార్డులు ఏర్పాటు చేశామని తెలిపారు. దెబ్బతిన్న పంచాయతీరాజ్ పాత రోడ్ల మరమ్మతులు, నిర్వహణ కోసం బడ్జెట్లో 2 వేల కోట్లు ప్రతిపాదించడం పట్ల ధన్యవాదాలు తెలిపారు.

చేనేతకు చేయూత ఏది?

- బడ్జెట్‌లో పెరగని నిధులు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం చేనేత రంగానికి చేయూత ఇవ్వలేదు. వారి అభివృద్ధి కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతున్నట్టు ప్రకటనలిస్తున్నది. కానీ బడ్జెట్‌లో మాత్రం గతేడాది కేటాయించిన నిధులనే..ఈ ఏడాది బడ్జెట్‌లో చూపింది. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం చేనేత రంగంపై జీఎస్టీ మోపి, నడ్డివిరిచింది. దానికి వ్యతిరేకంగా పోరాడుతున్న రాష్ట్ర ప్రభుత్వం...బడ్జెట్‌లో నిధులను పెంచలేదు. గతేడాది చేనేతకు రూ.455 కేటాయించిన ప్రభుత్వం...ఈసారి కూడా అదే అంకెలను పొందుపరిచింది. బతుకమ్మ చీరెల కోసం కూడా గతేడాది కేటాయించిన రూ 400 కోట్లను మరోసారి చూపింది. పవర్‌లూమ్ ప్రమోషన్ చేయాలనే లక్ష్యాన్ని కూడా నిధులను తగ్గించింది.

చేనేత వస్త్రాలు వారంలో ఒక రోజు ధరించేలా చర్యలు తీసుకుంటామని చెప్పినప్పటికీ అది ఆచరణలో సాధ్యం కాలేదు. చేనేత వస్త్రాలను విరివిగా ఉపయోగించేలా ఆ కార్మికులకు సబ్సిడీలు ఇచ్చే వారిని ప్రోత్సహించేలా చర్యలు తీసుకోలేదు. అందుకు సరిపడిన నిధులను కేటాయించకపోవడంతో ఆ రంగం మరింత కుదేలు అయ్యే పరిస్థితి ఉన్నది. చేనేతకు బడ్జెట్‌లో కొత్తగా ఏమీ ఇవ్వలేదని డాక్టర్ దొంతి నర్సింహరెడ్డి తెలిపారు. గతంలో ప్రవేశ పెట్టిన పథకాలనే తిరిగి పెట్టారని చెప్పారు. చేనేత కార్మికుల కుటుంబాల ఆదాయం పెంచే మార్గాలను అన్వేషించాలని కోరారు.

సామాన్యుడిని విస్మరించిన బడ్జెట్

పట్నం, సీఐటీయూ సెమినార్‌లో శ్రీకాంత్ మిశ్రా



హైదరాబాద్ : ఈ నెల ఒకటిన కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ సామాన్యులను విస్మరించిందని పట్నం, సీఐటీయూ సంయుక్తంగా సోమవారం నిర్వహించిన సెమినార్‌లో వక్తలు తీవ్రంగా విమర్శించారు. వ్యవసాయరంగం, ఆహార సబ్సిడీ, గ్రామీణ ఉపాధి హామీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, కార్మికవర్గానికి కేంద్ర బడ్జెట్‌లో కోతలు పెట్టటం దారుణమని సెమినార్‌లో పాల్గొన్న ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ మిశ్రా తెలిపారు. దేశం ప్రస్తుతం ఎదుర్కొంటున్న ధరల పెరుగుదల, నిరుద్యోగం, ఆర్థిక సంక్షోభం వంటి సమస్యలకు పరిష్కారం చూపలేదనీ అన్నారు. ఇది కార్పొరేట్ శక్తులకు అనుకూలమైన బడ్జెట్ అని మిశ్రా తెలిపారు. ప్రజల కొనుగోలు శక్తిపెంచే ఎలాంటి చర్యలూ చేపట్టలేదని విమర్శించారు. ప్రముఖ ఆర్థిక, రాజకీయ విశ్లేషకులు డి పాపారావు మాట్లాడుతూ.. సామాన్య ప్రజల అభివృద్ధికి, వ్యవసాయ రంగానికి ఇచ్చే మొత్తం సబ్సిడీలు రూ.1.59 లక్షల కోట్లు కుదించి తన కార్పొరేట్ పక్షపాతాన్ని ప్రదర్శించిందనీ, ఇది ఆర్థిక అసమానతలను మరింత పెంచే బడ్జెట్ అన్నారు. ద్రవ్యలోటు దృష్టిలో పెట్టుకొని చేయటంవల్ల డిమాండ్ పెరగటానికి, ఆర్థికాభివృద్ధికి ఆటంకంగా ఈ బడ్జెట్ ఉందని స్పష్టంచేశారు. ఈ సెమినార్‌కు డిజి నర్సింహారావు, పాలడుగు భాస్కర్ అధ్యక్షవర్గంగా వ్యవహరించారు.

సీఎం కేసీఆర్‌కు, మంత్రి హరీశ్ రావుకు కృతజ్ఞతలు

- డాక్టర్ మార్త రమేశ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రతి సామాన్యునికి వైద్యం చేరువయ్యేలా సంకల్పించి, ఆరోగ్య తెలంగాణే లక్ష్యంగా బడ్జెట్ లో వైద్యానికి పెద్ద పీట వేసిన నేపథ్యంలో సీఎం కేసీఆర్‌కు, వైద్యారోగ్యశాఖ మంత్రి టి.హరీశ్ రావుకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని తెలంగాణ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు, నిమ్స్ అనుసంధానాధికారి డాక్టర్ మార్త రమేశ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పేదల ఆరోగ్య ప్రదాయినిగా ఉన్న ఆ సంస్థ రూ.290 కోట్లు కేటాయించడం చారిత్రక నిర్ణయంగా అభివర్ణించారు. దీంతో నిమ్స్ మరింత పురోగమిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



ఎస్‌బీఐ నూతన ప్రాంగణం ప్రారంభం

హైదరాబాద్: గచ్చిబౌలిలో ఎస్‌బీఐకు చెందిన సైబరాబాద్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయం (ఏఓ) ప్రారంభం జరిగింది. దీనిని ఎస్‌బీఐ చైర్మెన్ దినేశ్ ఖరా ప్రారంభించారు. సైబరాబాద్ ఏఓ డీజీఎం శ్రీరామ్ సింగ్, సిబ్బందికి దినేశ్ ఖరా ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. వినియోగదారులకు అత్యుత్తమ సేవలు అందించాలని ఈ కార్యక్రమంలో దినేశ్ ఖరా చెప్పారు. బ్రాంచ్‌లలో ఉన్న సిబ్బంది.. బ్యాంకు అంబాసిడర్లు అని ఆయన నొక్కి చెప్పారు. 36 మంది కూర్చోగలిగే స్కూల్ బస్సును దినేశ్ ఖరా.. సాయి సేవా సంఘ్‌కు, రోహిణీ ఫౌండేషన్‌కు మొబైల్ డెంటల్ కేర్ వ్యాన్‌ను డొనేట్ చేశారు. ఈ కార్యక్రమంలో అశ్విని కుమార్ తివారీ, ఓమ్ ప్రకాశ్ మిశ్రా, అమిత్ ఝింగ్రాన్, మంజు శర్మ, దేవాశిష్ మిత్ర, నవీన్ కుమార్ ఝా, జితేంద్ర కుమార్ శర్మ ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యకు నిధులు సరిపోవు

- సర్కారు బడుల్లో ప్రీప్రైమరీని ప్రారంభించాలి
- పీహెచ్‌సీలను అభివృద్ధి చేస్తేనే ప్రజలకు మెరుగైన వైద్యం
- ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2023-24 బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయించిన రూ.19,051 (6.56 శాతం) కోట్ల నిధులు ఏమాత్రం సరిపోవని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి చెప్పారు. సోమవారం శాసనమండలిలోని మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ తాను ఎమ్మెల్సీ అయ్యాక ఇది నాలుగో బడ్జెట్‌అనీ, అన్నీ ఒకే తరహాలో ఉన్నాయని అన్నారు. ఇది వినూత్నంగా ఏమీ లేదన్నారు. గురుకులాలు, మెడికల్ విద్య, వ్యవసాయ విద్యకు కలిపినా పది శాతానికి మించి కేటాయించలేదని చెప్పారు. కొఠారి కమిషన్ సిఫారసుల ప్రకారం విద్యకు రాష్ట్ర బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయించాలని సూచించారు. 24 శాతం నిధులు కేటాయించాలంటూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని వివరించారు. కానీ 6.56 శాతం నిధులే కేటాయించిందని అన్నారు. విశ్వవిద్యాలయాల్లో మౌలిక వసతుల అభివృద్ధి కోసం రూ.500 కోట్లు ప్రభుత్వం ప్రతిపాదించిందని వివరించారు. ఓయూలో కొన్ని హాస్టళ్లు కూలిపోయే దశలో ఉన్నాయని చెప్పారు. ఈ నిధులు ఏమాత్రం సరిపోవని అన్నారు. గత బడ్జెట్ కన్నా అదనంగా 50 శాతం నిధులు కేటాయించాలని కోరారు. మన



ఊరు మనబడి పథకానికి నిధుల కొరత ఉన్నందు వల్లే పనులు చురుగ్గా సాగటం లేదన్నారు. మొదటి విడతలో 3,123 స్కూళ్లు రూ.3,497 కోట్లతో ప్రారంభించినా ఇప్పటి వరకు 1,210 పాఠశాలల్లోనే పనులు పూర్తయ్యాయని వివరించారు. మిగతా వాటికి బడ్జెట్ విడుదల చేసి త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కొత్తగా 21 జిల్లాలు ఏర్పడినా డీఈవో పోస్టులు, 151 మండలాల్లో ఎంఈవో పోస్టులను మంజూరు చేయలేదన్నారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రీప్రైమరీని ప్రారంభించాలని డిమాండ్ చేశారు. వైద్య ఆరోగ్య రంగానికి 12 శాతం నిధులు కేటాయించాలని కోరితే 4.1 శాతం ప్రతిపాదించిందని వివరించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్‌సీ)ను అభివృద్ధి చేసి 24 గంటలు పనిచేసేలా చర్యలు తీసుకుంటేనే పేదలకు మెరుగైన వైద్యం అందుతుందని చెప్పారు. డీఈవో, ఎంఈవో పోస్టులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సర్కారు బడుల్లో ప్రీప్రైమరీ తరగతులను ప్రారంభించాలని సూచించారు.

రైతాంగాన్ని ఓట్లడిగే నైతిక హక్కు బీఆర్ఎస్‌కు లేదు : జీవన్‌రెడ్డి

రాష్ట్రంలో రూ.లక్షలోపు పంట రుణాలను మాఫీ చేస్తామంటూ బీఆర్ఎస్ ప్రభుత్వం హామీనిచ్చిందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి చెప్పారు. విడతల వారీగా అమలు చేస్తామంటూ ప్రకటించిందన్నారు. ఇది చివరి బడ్జెట్ అనీ, రూ.లక్షలోపు రుణమాఫీ చేస్తారంటూ రైతులంతా ఎదురుచూస్తున్నారని అన్నారు. ఇందులో ఆ ప్రస్తావన లేనందున రైతాంగాన్ని ఓట్లడిగే నైతిక హక్కు బీఆర్ఎస్‌కు లేదన్నారు. గిరిజన బంధు మాయమైందని చెప్పారు. పోడు భూముల పట్టాల గురించి ప్రస్తావన లేదన్నారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి చర్యలు చేపట్టాలని సూచించారు. బీసీలకు ఆత్మగౌరవ భవనాలు కాదనీ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. 80 వేల ఉద్యోగాలు భర్తీ చేస్తామంటూ ప్రభుత్వం ప్రకటించిందనీ, అందులో ఒక్క ఉద్యోగం ఇవ్వలేదని చెప్పారు. కొన్ని నోటిఫికేషన్ల దశలో ఉన్నాయని వివరించారు. పాఠశాల విద్యలో 20 వేల ఉపాధ్యాయ ఖాళీలున్నాయని అన్నారు. నిరుద్యోగ భృతి రూ.3,016 ఈ బడ్జెట్‌లోనూ కేటాయించలేదని విమర్శించారు.

వ్యవసాయానికి పెద్దపీట : పల్లా

రాష్ట్ర ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి పెద్దపీట వేసిందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. సాగునీటి రంగం, విద్యుత్‌కు అధికంగా నిధులు కేటాయించిందని వివరించారు. అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధిని కాంక్షించేలా ఈ బడ్జెట్ ఉందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ భానుప్రసాదరావు చెప్పారు.

కలలు సాకారం
మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ ప్రజల కలలు సాకారం చేసేలా ఉందని మంత్రి ఏ ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. రూ.1050 కోట్లతో కొత్త కోర్టుల భవన నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. వ్యవసాయంతో పాటు సంక్షేమానికి పెద్ద పీట వేశారని చెప్పారు. తన శాఖలకు బడ్జెట్ కేటాయింపులు చేసినందుకు ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్ రావుకు కతజ్ఞతలు తెలిపారు. అటవీ శాఖకు రూ. 1,471 కోట్లు, దేవాదాయ శాఖకు రూ. 368 కోట్లు కేటాయించినట్టు తెలిపారు.

అటకెక్కిన 'నిరుద్యోగ భృతి'

- చివరి బడ్జెట్‌లోనూ నిధులు కేటాయించని సర్కారు
- యువత ఆశలు ఆవిరి
- అమలుకాని ఎన్నికల హామీ



నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

'ఒక్కొక్కరికీ నెలకు రూ.3,016 చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తాం.'అంటూ 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ఇచ్చారు. అందుకనుగుణంగా బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలోనూ పొందుపరిచింది. ఈ ప్రభుత్వానికి 2023-24 బడ్జెట్ చివరిది. ఇందులోనూ నిరుద్యోగ భృతి ఊసేలేదు. దీంతో అది అటకెక్కినట్టేనని నిరుద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే 'నిరుద్యోగ భృతి హామీ అమలుపై ఏం చేయాలో ఆలోచిస్తున్నాం. కరోనా వల్ల ఉద్యోగులకు జీతాలే ఇవ్వలేకపోయాం. నిరుద్యోగ భృతి ఇవ్వడానికి ఏం చేయాలో అది చేస్తాం. నిరుద్యోగులంటే ఎవరు?అన్నది ముందు తేల్చాలి. దానికి ప్రాతిపదిక ఏంటన్నది ఆలోచిస్తున్నాం.'అని అసెంబ్లీలో 2021, మార్చి 17న ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు ప్రకటించారు. 'నిరుద్యోగులకు తీపికబురు. అతిత్వరలోనే నిరుద్యోగ భృతి అమలవుతుంది. ముఖ్యమంత్రి కేసీఆర్ దీనిపై ప్రకటిస్తారు'అని మంత్రి కేటీఆర్ అదే ఏడాది జనవరిలో చెప్పారు. అయితే ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికలు రాబోతున్నాయి. దీంతో ఈ బడ్జెట్‌లో కచ్చితంగా నిరుద్యోగ భృతిని ప్రభుత్వం ప్రకటిస్తుందంటూ యువతీ, యువకులు ఎంతో ఆశగా ఉన్నారు. కానీ 2023-24 బడ్జెట్‌లోనూ నిరుద్యోగ భృతి ప్రస్తావన లేకపోవడంతో వారి ఆశలు ఆవిరయ్యాయి. అయితే ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, ఇవ్వని హామీలు కూడా అమలు చేశామంటూ రాష్ట్ర ప్రభుత్వం గొప్పలు చెప్తున్నది. ఇచ్చిన మాట ప్రకారం ఏప్రిల్ నుంచి కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసుల క్రమబద్ధీకరణ, సెర్ప్ ఉద్యోగుల పేస్కేల్ సవరణను చేయబోతున్నట్టు బడ్జెట్‌లో ప్రకటించింది. కానీ నిరుద్యోగ భృతి గురించి ప్రస్తావించకపోవడం గమనార్హం. దీంతో నిరుద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి ఉన్నది. అయితే గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3, గ్రూప్-3, పోలీసు కానిస్టేబుల్, ఎస్ఐ వంటి పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్లు విడుదల చేయడం యువతకు కొంత ఉపశమనంగా ఉన్నది. దరఖాస్తు చేసిన వారందరికీ ఉద్యోగాలు రావన్నది తెలిసిందే. దీంతో మిగిలిన వారంతా నిరుద్యోగ భృతి కోసం ఎదురుచూసే పరిస్థితి ఉన్నది. రాబోయే ఎన్నికల్లో యువతను ఆకర్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి వ్యూహం అనుసరిస్తుందో వేచిచూడాల్సిందే.

మోడీ సర్కార్ పారిపోతుంది
విలువైన సమయం వృథా

- బీఆర్ఎస్ ఎంపీలు కేశవరావు, నామా నాగేశ్వరరావు

న్యూఢిల్లీ : ఆదానీ అంశంపై చర్చించకుండా మోడీ సర్కార్ పారిపోతున్నదని బీఆర్ఎస్ ఎంపీలు కె. కేశవరావు, నామా నాగేశ్వరరావు విమర్శించారు. సోమవారం నాడిక్కడ ఎంపీ కె.కేశవరావు మాట్లాడుతూ మూడు రోజుల విలువైన సమయం వృథా అయిందని, కేంద్ర మంత్రులు మాత్రం ప్రతిపక్షాలు చర్చించకుండా పారిపోతున్నాయని ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. పార్లమెంటులో చర్చ జరగకుండా చేయడమంటే ప్రజాస్వామ్యానికి వెన్నుపోటు పొడవడమేనని విమర్శించారు. రాజ్యసభ చైర్మెన్ చర్చ జరపడానికి ఇచ్చిన నోటీసులను అకారణంగా తిరస్కరిస్తున్నారని విమర్శించారు. తన పార్లమెంట్ జీవితంలో మొదటిసారి రాజ్యసభ చైర్మెన్ ఈ విధంగా వ్యవహరించడం చూస్తున్నానని అన్నారు. ప్రతిపక్షాలు చర్చ జరపాలని కోరుకుంటున్నాయనీ తెలిపారు. ఎంపీ నామా నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రం చిత్తశుద్ధితో ఉంటే అదానీ అంశంపై ప్రతిపక్షాల కంటే ముందు, కేంద్రం చర్చకు రావాలని సూచించారు. సభ నుంచి పారిపోయే ప్రయత్నం చేయొద్దని హితవు పలికారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి సహకరించకపోయినా, రాష్ట్రం తనకున్న వనరులతో అభివృద్ధి దిశగా ముందుకు వెళ్తుందని అన్నారు.

సెర్ఫ్ ఉద్యోగుల పే స్కేలు ప్రకటించడం హర్షనీయం : జేఏసీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సెర్ప్ ఉద్యోగులకు ఏప్రిల్ నుంచి పే స్కేల్ వర్తింపజేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం పట్ల సెర్ప్ ఉద్యోగ సంఘాల రాష్ట్ర జేఏసీ నాయకులు కుంట గంగాధర్ రెడ్డి, నరసయ్య, సుదర్శన్, మహేందర్ రెడ్డి, సుభాష్, వెంకట్, సురేఖ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. 23 ఏండ్ల నుంచి చాలీచాలని వేతనాలతో గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల అమలులో అత్యంత కీలకపాత్ర పోషిస్తున్న తమకు ఎట్టకేలకు గుర్తింపు దక్కటం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఈ పేస్కేలు ద్వారా సెర్ప్ సంస్థలో పనిచేస్తున్న 3974 మంది ఉద్యోగులకు లబ్ది చేకూరుతుందని తెలిపారు. ప్రస్తుతం వేతనాలకు ఏటా రు. 192 కోట్ల బడ్జెట్ ఉండగా దీనికి మరో 42 కోట్లు అదనంగా కేటాయిస్తే సరిపోతుందని పేర్కొన్నారు. మంగళవారం రాష్ట్ర మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, హరీశ్‌రావు, కేటీఆర్ లను కలిసి తమ ఉద్యోగుల తరపున ధన్యవాదాలు తెలుపుతామని వెల్లడించారు.

సంపాదకీయం

సారాయే కాదు.. సీసా కూడా పాతదే...

'కొత్త సీసాలో పాత సారా...' బడ్జెట్ల సందర్భంలో ప్రభుత్వాన్ని విమర్శిస్తూ ప్రతిపక్షాలు చేసే కామెంట్ ఇది. కానీ బీఆర్‌ఎస్ సర్కారు అసెంబ్లీ ఎన్నికలకు ముందు చివరి సారిగా ప్రతిపాదించిన పద్దులో... అందునా విత్త మంత్రి హరీశ్‌రావు నాలుగోసారి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో 'సారాయే కాదు... సీసా కూడా పాతదే...' అయ్యింది. 89 పేజీల ప్రసంగ పాఠంలో అత్యధిక భాగం పాత విషయాలే. గత బడ్జెట్లతోపాటు అనేక

> అలాంటప్పుడు దీర్ఘకాలంలో ప్రజల్లో బీఆర్‌ఎస్ సర్కారు విశ్వసనీయతను కోల్పోయే ప్రమాదముంది. బీజేపీకి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఒక ప్రత్యామ్నాయాన్ని రూపొందిస్తున్నామంటూ ఆ పార్టీ అధినేత చెబుతున్న క్రమంలో వాస్తవాలకు అనుగుణంగా బడ్జెట్‌ను సవరించి... ప్రజల అవసరాలు, ప్రాధాన్యతలకు అనుగుణంగా నిధులను కేటాయించటం ద్వారా తెలంగాణలోనే కాదు, దేశవ్యాప్తంగానూ నమ్మకాన్ని ప్రోది చేసుకుంటారని ఆశిద్దాం.

వేదికల మీది చెప్పిన అంశాలే మరోసారి నొక్కి వక్కాణించటం గమనార్హం. గతంలో ప్రతిష్టాత్మకంగా చెప్పుకున్న దళితులకు మూడెకరాల భూమి, డబుల్ బెడ్ రూం ఇండ్లు, నిరుద్యోగ భృతి, కేజీ టూ పీజీ తదితరాంశాలకు బడ్జెట్‌లో పెద్ద పీట వేస్తారని భావించిన వారి ఆశలు... ఈ పద్దుతో అడియాశలయ్యాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్పులు, ఆరోగ్యశ్రీ తదితరాంశాలకు కూడా నామమాత్రంగా నిధులను విదిలించారు తప్ప వాటి అవసరాన్ని గుర్తించలేదు. ఇక రైతు రుణమాఫీ గోస ఈ బడ్జెట్‌లోనూ తీరలేదు. రైతుబంధు, రైతుబీమా లాంటి పథకాలు అన్నదాతలకు చేయూతనిస్తున్నా... రుణమాఫీ చేయకపోవటంతో వారు మళ్లీ అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. లక్ష రూపాయల రుణానికి ఏడాదికి రూ.14వేల మేర వడ్డీ అవుతోందంటూ బ్యాంకు వర్గాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో ఒక ఎకరా ఉన్న రైతుకు లక్ష రూపాయల రుణం ఉంటే... ఆయనకు రైతు బంధు కింద రెండు పంటలకు కలిపి వచ్చే ఆర్థిక సాయం (ఒక పంటకు రూ.5 వేల చొప్పున, రెండు పంటలకు కలిపి రూ.పది వేలు) కంటే వడ్డీయే రూ.నాలుగు వేలు అధికంగా ఉంటుదన్నమాట. ఈ క్రమంలో రైతుబంధు, రైతుబీమా లాంటి పథకాలు అన్నదాతలను కష్టాల కడలి నుంచి గట్టెక్కించలేక పోతున్నాయి. అయినా సర్కారు ఈ అంశానికి పెద్దగా ప్రాధాన్యత నివ్వలేదు. రుణమాఫీ కోసం సుమారు రూ.19 వేల కోట్లకు పైగా అవసరమవుతుండగా... బడ్జెట్‌లో కేవలం రూ.6,385 కోట్లే కేటాయించటం శోచనీయం. ప్రజలకు దీర్ఘకాలంలో ఉపయోగపడే ఇలాంటి వ్యవస్థీకృత అంశాలకు పెద్ద మొత్తంలో నిధులు కేటాయించకపోతే బంగారు తెలంగాణ ఎలా సాధ్యమనేది ఇప్పుడు జవాబే లేని శేష ప్రశ్నగా మిగిలింది.



మరోవైపు తెలంగాణ వచ్చినప్పటి నుంచి ఇప్పటిదాకా ఏదైతే అతి అంచనాలకు పోయారో... ఇప్పుడు కూడా అదే రీతిన 'రాని ఆదాయాన్ని...' వస్తుందంటూ పద్దులో పేర్కొనటం గమనార్హం. భూముల అమ్మకాల ద్వారా రూ.13 వేల కోట్లను ఆర్జిస్తామంటూ ప్రభుత్వం పద్దులో ప్రకటించింది. గత ఎనిమిదేండ్ల అనుభవం ప్రకారం... ఈ రూపంలో వచ్చింది వందల కోట్లల్లో కూడా లేదు. ఇప్పుడు మరోసారి పద్దులో అదే పాట పాడటంతో ఆర్థిక నిపుణులు విస్తుబోతున్నారు. కేంద్రం నుంచి మనకు న్యాయంగా, వాటా ప్రకారం రావాల్సిన నిధులు, గ్రాంట్లే రావటం లేదు. అలాంటిది 2023-24 ఆర్థిక సంవత్సరానికి కేంద్రం నుంచి మిషన్ భగీరథకు రూ.19 వేల కోట్లు, మిషన్ కాకతీయ (చెరువుల పునరుద్ధరణ)కు రూ.5 వేల కోట్లు వస్తాయంటూ అంచనా వేసుకోవటం అత్యాశే అవుతుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి విభజన అంశాల ఆధారంగా రూ.17 వేల కోట్లు వస్తాయని బడ్జెట్‌లో చెప్పటం కూడా అతి అంచనాయే అవుతుందని ఆర్థిక శాఖ వర్గాలు చెబుతున్నాయి. ఇవి మొత్తం కలిపి రూ.54 వేల కోట్లు అవుతున్నాయి. అంటే మొత్తం రూ.2,90,396 కోట్ల బడ్జెట్‌లో ఇప్పటికే రాని ఆదాయం రూ.54 వేల కోట్లుగా తేలిపోయిందన్నమాట. అలాంటప్పుడు ఈ లోటనేది పలు రంగాలు, శాఖలపై ప్రభావం చూపుతుందనటంలో ఎలాంటి సందేహమూ లేదు. అయితే ఎన్నికల సంవత్సరం కాబట్టి... ఏయే రంగాలకు కోతలు పెడతారనేది వేచి చూడాలి. మొత్తం మీద హరీశ్‌రావు వరసగా నాలుగోసారి ప్రతిపాదించిన పద్దులోనూ అతి అంచనా లేసుకుంటూ.. ప్రజల్లో ఆశలు రేపుతూ ముందుకు సాగారే తప్ప వాస్తవాలకు అనుగుణంగా బడ్జెట్ ప్రవేశపెట్టలేదనడం సత్యదూరమేమీ కాదు. అలాంటప్పుడు దీర్ఘకాలంలో ప్రజల్లో బీఆర్‌ఎస్ సర్కారు విశ్వసనీయతను కోల్పోయే ప్రమాదముంది. బీజేపీకి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఒక ప్రత్యామ్నాయాన్ని రూపొందిస్తున్నామంటూ ఆ పార్టీ అధినేత చెబుతున్న క్రమంలో వాస్తవాలకు అనుగుణంగా బడ్జెట్‌ను సవరించి... ప్రజల అవసరాలు, ప్రాధాన్యతలకు అనుగుణంగా నిధులను కేటాయించటం ద్వారా తెలంగాణలోనే కాదు, దేశవ్యాప్తంగానూ నమ్మకాన్ని ప్రోది చేసుకుంటారని ఆశిద్దాం.

మౌలిక సమస్యను విస్మరించిన 2023-24 కేంద్ర బడ్జెట్


ప్రభాత్ పట్నాయక్

ప్రస్తుతం భారత ఆర్థిక వ్యవస్థలో కొట్టవచ్చినట్టు కనిపించే లక్షణం వాస్తవ వినిమయంలో పెరుగుదల అత్యంత హీన స్థాయిలో ఉండడమే. 2019-20 నుండి 2022-23 మధ్య కాలంలో తలసరి వాస్తవ వినిమయంలో పెరుగుదల 5శాతం కన్నా తక్కువగానే ఉంది. ఇది జీడీపీ వృద్ధి రేటు కన్నా తక్కువ. కరోనా మహమ్మారి దెబ్బ నుండి కోలుకున్న తర్వాత వాస్తవ వినిమయంలో కొద్దిపాటి పెరుగుదల కనిపించింది. అయితే అది ప్రధానంగా పెట్టుబడులు పెట్టడం ఫలితంగా వచ్చిన పెరుగుదల తప్ప వినిమయదారుల నుండి వచ్చినది కాదు. ఇటువంటి పెరుగుదల ఎక్కువకాలం పాటు నిలిచేది కాదు. ఉత్పత్తి సామర్థ్యాన్ని పూర్తిగా ఉపయోగించుకోవడం కాని, మౌలిక వసతులను సంపూర్ణంగా ఉపయోగించుకోగలగడం కాని జరగదు (కారణం: వస్తు వినియోగం పెరగకపోతే అదనంగా ఉత్పత్తి చేయవలసిన అవసరం రాదు. అప్పుడు పూర్తి స్థాపక సామర్థ్యాన్ని ఉపయోగించడం వీలుకాదు.) దీని ఫలితంగా బ్యాంకులకు రుణాలు సకాలంలో తిరిగిరావు. పారుబకాయిలు పెరుగుతాయి. దాని ఫలితంగా ఆర్థికవ్యవస్థ కోలుకోవడం నిలిచిపోతుంది. పైగా దేశ ఆర్థిక వ్యవస్థ మనుగడ కూడా ప్రమాదంలో పడిపోతుంది. ఇక రెండవ అంశం: ఆర్థిక వృద్ధి అనేదే మౌలికంగా సామాన్య ప్రజానీకపు జీవన ప్రమాణాలు మెరుగుపడడం కోసం. ఆ ప్రజల కొనుగోలుశక్తి పెరగనప్పుడు ఈ ఆర్థికవృద్ధిలక్ష్యానికే అర్థం లేకుండా పోతుంది.

అందువలన 2023-24 బడ్జెట్ ముందు ప్రధానంగా ఉండదగిన లక్ష్యం ఆర్థిక వ్యవస్థలో వినిమయాన్ని పెంపొందించడం. అది జరగాలంటే ప్రజా సంక్షేమ రంగాల్లో కేటాయింపులను పెంచాలి. ఉదాహరణకు: ఒకపక్కన దేశంలో ఎఫ్‌సిఐ వద్ద ఆహారధాన్యాల నిల్వలు అలాగే పడివున్నాయి, కాని దేశంలో పేద ప్రజానీకం ఆకలితో కొట్టుమిట్టాడుతున్నారు. వాళ్ళ దగ్గర కొనుగోలుశక్తి లేకపోవడమే దీనికి కారణం. అప్పటికే వాళ్ళు ఆరోగ్య సంరక్షణకి, గృహవసతికి, బిడ్డల చదువులకు తమవద్దనున్న కొనుగోలుశక్తిని ఖర్చు చేసివున్నారు. అందుచేత వారి కొనుగోలుశక్తిని పెంచాలి. అంటే సంక్షేమానికి కేటాయింపులు పెంచాలి. కాని ఈ బడ్జెట్ ఆ పని చేయలేదు సరికదా, సంక్షేమ రంగాలకు గతంలో ఉండిన కేటాయింపులకు సైతం కోతలు పెట్టింది. ఆ విధంగా మిగిల్చిన ధనాన్ని పెట్టుబడి వ్యయాన్ని పెంచడానికి అందుబాటులోకి తెచ్చింది. ఉపాధి హామీ పథకానికి కేటాయింపులను రూ.60,000 కోట్లకు తగ్గించడం దిగ్భ్రాంతికి గురిచేస్తోంది. ఒక దశాబ్దం క్రితం నాటి కేటాయింపు స్థాయికి ఆ పథకాన్ని తీసుకొచ్చింది. 2021-22లో ఆ పథకానికి కేటాయించినది రూ.1,12,000 కోట్లు! పైగా కొత్త నిబంధనల ప్రకారం ఉపాధి హామీ పనులు జరిగినట్టు దాఖలాలను ఇంటర్నెట్ ద్వారా రికార్డు చేయాల్సివుంది. గ్రామీణ భారతంలో అత్యధిక ప్రాంతాల్లో ఆ ఇంటర్నెట్ సౌకర్యం లేదు. దీనిని బట్టి ఈ పథకాన్నే మొత్తంగా ఎత్తేయాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం వ్యవహరిస్తోందని స్పష్టం అవుతోంది.

దేశంలో 81 కోట్లమందికి నెలకు 5కిలోల చొప్పున ఆహారధాన్యాలను ఉచితంగా అందిస్తున్నట్లు ప్రభుత్వం చాలా గొప్పగా ప్రచారం చేసుకుంటోంది. కాని 2022-23 బడ్జెట్‌తో పోల్చితే ఈ సారి ఆహార సబ్సిడీకి కేటాయింపుల్లో 31శాతం తగ్గించారు. అలా తగ్గించినదాంట్లో 5కిలోల ఉచిత ఆహారధాన్యాలను అందించడం అంటే తక్కిన పేదలకు అందాల్సి ఆహార సబ్సిడీలో మరింత ఎక్కువగా కోత పెట్టడమే. కొందరు పేదల కడుపులు కొట్టి తక్కిన పేదలకు పెట్టడమే. గ్రామీణాభివృద్ధి రంగానికీ కేటాయింపులు తగ్గించారు. విద్య. వైద్యం రంగాలకు కేటాయింపుల్లో నామమాత్రపు పెరుగుదల చూపించారు. కాని పెరుగుతున్న ద్రవ్యోల్బణం ఫలితంగా ఈ రంగాలు వాస్తవంగా గతం కన్నా తక్కువ కేటాయింపులనే పొందనున్నాయి.

ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో వినిమయాన్ని పెంచడానికి వ్యతిరేకతను ప్రదర్శించింది. అంటే పేదలపట్ల వ్యతిరేకతను ప్రదర్శించింది. ఈ బడ్జెట్‌లో ప్రభుత్వ వ్యయం పెరుగుదల రేటు జీడీపీలో వృద్ధిరేటు కన్నా తక్కువగా ఉండబోతోంది. ప్రభుత్వ వ్యయం అంటే అందులో రాష్ట్రాలకు చేసే కేటాయింపులు కూడా కలిసేవుంటాయి. 2022-23లో ప్రభుత్వ వ్యయం (సవరించిన అంచనాల ప్రకారం) 15.3శాతం. అదే 2023-24లో 14.9శాతం మాత్రమే ఉండబోతున్నది. దాదాపు అదే మోతాదులో ద్రవ్యలోటు కూడా 6.4శాతం నుండి 5.9శాతానికి తగ్గనుంది.

వినిమయాన్ని పెంచడానికి ఈ ప్రభుత్వం ఎంత విముఖంగా ఉందో అది రాష్ట్రాలకు చేసే వనరుల బదలాయింపులో కూడా కనిపిస్తోంది. 2021-22లో రూ.4,60,575 కోట్లు రాష్ట్రాలకు బదలాయించారు. అదే 2022-23లో రూ.3,67,204 కోట్లు మాత్రమే కేటాయించారు. కాని సవరించిన అంచనాలు చూస్తే వాస్తవంగా బదలాయించినది రు.3,07,204 కోట్లు మాత్రమే. ఈ ఏడాది తగ్గిన మొత్తాన్ని కూడా కలిపి 2023-24లో అదనంగా కేటాయించవలసివుండగా, వాస్తవంగా రూ.3,59,470 కోట్లు మాత్రమే కేటాయించారు. (ఇక ఇందులో వాస్తవంగా ఎంత బదలాయిస్తారో మరి?)

> 2023-24 బడ్జెట్ ముందు ప్రధానంగా ఉండదగిన లక్ష్యం ఆర్థిక వ్యవస్థలో వినిమయాన్ని పెంపొందించడం. అది జరగాలంటే ప్రజా సంక్షేమ రంగాల్లో కేటాయింపులను పెంచాలి.కాని ఈ బడ్జెట్ ఆ పని చేయలేదు సరికదా, సంక్షేమ రంగాలకు గతంలో ఉండిన కేటాయింపులకు సైతం కోతలు పెట్టింది. ఆ విధంగా మిగిల్చిన ధనాన్ని పెట్టుబడి వ్యయాన్ని పెంచడానికి అందుబాటులోకి తెచ్చింది. ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో వినిమయాన్ని పెంచడానికి వ్యతిరేకతను ప్రదర్శించింది. అంటే పేదలపట్ల వ్యతిరేకతను ప్రదర్శించింది.

రాష్ట్ర ప్రభుత్వాలు ప్రధానంగా ప్రజాసంక్షేమ కార్యక్రమాలకు బాధ్యత వహిస్తాయి. ఎప్పుడైతే వాటికి కేటాయింపుల్లో కోత పడిందో, ఆ రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ప్రజాసంక్షేమం విషయంలో వెనకాడతాయి. ఆర్థిక వనరులను ఈ విధంగా కావాలనే కేంద్రం చేతుల్లో మరింత ఎక్కువగా ఉంచుకోవడం ద్వారా ఫెడరల్ వ్యవస్థను కేంద్ర బడ్జెట్ మరింత బలహీన పరుస్తోంది.

కేంద్ర ప్రభుత్వ వ్యయాన్ని జీడీపీతో పోల్చినప్పుడు తగ్గించిన ఈ బడ్జెట్ పెట్టుబడివ్యయంలో బాగా పెంపును చూపించింది. ఈ బడ్జెట్‌లో పెట్టుబడి వ్యయం రూ.7.5 లక్షల కోట్లనుండి రూ.10 లక్షల కోట్లకు పెరిగింది. ఆ విధంగా చేయడం వలన దేశాన్ని పీడిస్తున్న నిరుద్యోగసమస్యకు పరిష్కారం దొరుకుతుందని సమర్థించుకున్నారు. కాని ఆర్థికమంత్రి ఈ సందర్భంలో నాలుగు మౌలికాంశాలను మరిచిపోయినట్టున్నారు. మొదటిది: అదే మొత్తాన్ని ప్రజాసంక్షేమానికి ఖర్చు చేసినా దానివలన దాదాపు అదేస్థాయిలో ఉపాధి కల్పన జరుగుతుంది. రెండవది: ఆ విధంగా ప్రజాసంక్షేమానికి ఖర్చు చేయడం వలన నేరుగా శ్రామిక ప్రజలు లబ్ధి పొందుతారు. బడ్జెట్‌కు ముందురోజే పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే శ్రామికుల వేతనాలు వాస్తవంగా తగ్గిపోయాయని అంగీకరించింది. సంక్షేమానికి ఖర్చు పెంచితే ఆ లోపాన్ని సరిచేయగలుగుతారు. మూడవది: ప్రజాసంక్షేమానికి చేసేఖర్చు ఆర్థిక వ్యవస్థమీద చేసిన



ఖర్చుకి మించి కొన్ని రెట్లు ఎక్కువ ప్రభావాన్ని చూపిస్తుంది. అదే పెట్టుబడివ్యయం మీద ఖర్చు చేస్తే ఆ విధమైన ప్రభావం ఉండదు. అంటే పెట్టుబడివ్యయం మీద ఖర్చు పెంచడం కన్నా సంక్షేమం మీద ఖర్చు పెంచితే (ప్రస్తుత పరిస్థితుల్లో) ప్రత్యక్షంగా కాని, పరోక్షంగా కాని ఎక్కువ ఉపాధి కల్పన జరుగుతుంది. నాలుగవది: పెట్టుబడివ్యయం కోసం కేటాయించిన దాంట్లో ఎక్కువభాగం యంత్రాల, టెక్నాలజీల కొనుగోళ్ళకోసం విదేశాలకు తరలిపోతుంది. ఆ మేరకు ఉపాధికల్పన జరగకుండా ఉంటుంది.

ప్రస్తుత నయా ఉదారవాద శకంలో దిగుమతులమీద ఆధారపడడం బాగా పెరిగిపోయింది. దానివలన మనదేశంలో యంత్రాల తయారీ, టెక్నాలజీ అభివృద్ధి స్తంభించిపోయాయి. అందుచేత పెట్టుబడివ్యయాన్ని పెంచినంతమాత్రాన దేశంలో ఉపాధి కల్పన జరిగిపోతుందని భ్రమపడకూడదు. దేశీయంగా ఆ పెట్టుబడి వ్యయాన్ని వినియోగించగలిగిన పరిస్థితి ఉంటే మనదేశంలో ఉపాధి కల్పన పెరుగుతుంది. అంతేకాని విదేశీ దిగుమతులకోసం పెట్టుబడివ్యయాన్ని ఎక్కువ కేటాయిస్తే ఉపాధి అదనంగా పెరిగేది చాలా స్వల్పమే. నిజంగా ఉపాధికల్పనను పెంచాలని అనుకుంటే ఆర్థికమంత్రి విదేశీదిగుమతులనుండి దేశీయ ఉత్పత్తులకు మరింత ఎక్కువ రక్షణ కల్పించి వుండాల్సింది. కాని దానికి పూర్తి విరుద్ధంగా ఆమె దిగుమతి సుంకాలను చాలా వాటి మీద తగ్గించారు. ఇంతా చేసి ఇదంతా

> వినిమయాన్ని పెంచడానికి ఈ ప్రభుత్వం ఎంత విముఖంగా ఉందో అది రాష్ట్రాలకు చేసే వనరుల బదలాయింపులో కూడా కనిపిస్తోంది. 2021-22లో రూ.4,60,575 కోట్లు రాష్ట్రాలకు బదలాయించారు. అదే 2022-23లో రూ.3,67,204 కోట్లు మాత్రమే కేటాయించారు. కాని సవరించిన అంచనాలు చూస్తే వాస్తవంగా బదలాయించినది రు.3,07,204 కోట్లు మాత్రమే. ఈ ఏడాది తగ్గిన మొత్తాన్ని కూడా కలిపి 2023-24లో అదనంగా కేటాయించవలసివుండగా, వాస్తవంగా రూ.3,59,470 కోట్లు మాత్రమే కేటాయించారు.

ఉద్యోగాల కల్పన కోసమేనని సమర్థించుకోవడం కేవలం మోసకారితనం మాత్రమే.

ఇప్పుడు బడ్జెట్‌లో పెట్టుబడివ్యయాన్ని బాగా పెంచినందువలన దిగుమతులు పెరుగుతాయి. దాని ఫలితంగా విదేశీ చెల్లింపుల ఖాతాలో లోటు మరింత పెరుగుతుంది. మన రూపాయి విలువను ఎంత తగ్గించినా, ప్రపంచ వ్యాప్త ఆర్థిక మాంద్యం కారణంగా ఎగుమతులలో వృద్ధి లేదు. గత మూడు మాసాల కాలానికి లెక్క వేస్తే మన విదేశీ చెల్లింపులలో లోటు జీడీపీలో 4శాతాన్ని మించిపోయింది. ఈ పరిస్థితుల్లో ప్రజాసంక్షేమానికి కేటాయింపులను గనుక బాగా పెంచివుంటే ఒకే దెబ్బకు మూడు పిట్టలను ఈ ప్రభుత్వం కొట్టగలిగివుండేది. ఒకటి: ప్రజల కొనుగోలుశక్తిని పెంచివుండేది. రెండు: ఉపాధికల్పన పెరిగివుండేది. మూడు: విదేశీ చెల్లింపులలోటును అదుపులో ఉంచ గలిగేది. కాని ఆ మార్గాన్ని ఈ ప్రభుత్వం ఎంచుకోలేదు.

ఇంకొక విషయాన్ని కూడా ఇక్కడ చెప్పాలి. దేశంలో ఆదాయాల్లో. సంపదలో అసమానతలు బాగా పెరిగిపోయాయి. అందువలన సంపన్నులు కట్టే పన్నులు బాగా పెరుగుతాయి. జీడీపీతో పోల్చితే పన్నులద్వారా వచ్చే ఆదాయంలో పెరుగుదల ఉండాలి. ఒకవేళ సంపద పన్ను విధించివుంటే ఈ పెరుగుదల ఇంకా ఎక్కువగా ఉంటుంది. ఆ విధంగా చేయకపోయినప్పటికీ, పన్నురాబడి గణనీయంగా పెరగాలి. కాని, ఈ బడ్జెట్‌లో ఆదాయాన్ని పెంచే చర్యలను వేటినీ ప్రతిపాదించలేదు.

కొన్ని వేతన తరగతుల వారికి ఆదాయపు పన్నులో రాయితీలను ఈ బడ్జెట్‌లో ప్రకటించారు. కొంత ఆదాయాలు పొందుతున్నవారికి రాయితీలను ప్రకటించిన ఈ ప్రభుత్వం అంతకన్నా తక్కువ స్థాయి ఆదాయాలు వస్తున్న పేదలకు సంక్షేమంలో కోతలు పెట్టడాన్ని ఏమని అర్థం చేసుకోవాలి? ఇది ప్రభుత్వ వక్రదృష్టికి అద్దం పడుతోంది.

మౌలికవసతుల కల్పన కోసం చేసే ఖర్చు నేరుగా ఆశ్రిత పెట్టుబడిదారులకు లబ్ధి చేకూర్చుతుంది. అందుకే ఆ క్రోనీలకు మౌలిక వసతుల కల్పన అంటే అంత ఆసక్తి. ఈప్రభుత్వం దేశ ఆర్థిక వ్యవస్థను మొత్తంగా ముందుకు తీసుకుపోయే ఆలోచనతో లేదు. కార్మికవర్గ ప్రయోజనాలు అసలే దాని దృష్టిలో లేవు. ఆశ్రిత పెట్టుబడిదారుల ప్రయోజనాలకే పెద్ద పీట వేసింది. దానికే ఈ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోంది.

(సరళానువాదం)



నేనొక పూలచెట్టునవుతాను

నా దేహం ఇంకా బూడిదవ్వలేదు
నా సజీవ ఆశమీద నిప్పంటించినోళ్ళు
వున్న చోట ఆర్పేసేవాళ్ళొచ్చే వరకు
నాలో దేశమంతా వొక ఉడుకుతున్న
పాట నెత్తుకొని తిరుగుతుంటుంది.

నన్నేమీ అనకండి
నన్ను నేనే వెతుక్కుంటున్నా తరుణమిది.
తుంపలు తుంపలుగా రాలుతున్న
ఊపిరిని పోగుచేస్తుకుంటూ
నాలో నేనే తల దాచుకుంటున్న.

నన్నేమి అడగకండి
నేను నాలాగే వున్న
మసక మసక చీకట్లో
వెలుగుతున్న నన్ను
ఎవరో ఆన్ ఆఫ్ చేస్తూ
స్విచ్ఛాఫ్ చేస్తున్నారు.

నన్ను నమ్మండి
నేను మనిషివైపే నిలబడ్డాను
నాలో మనుషులే
కనుగుడ్లను వణుకుతూ
కింద పడేస్తూ, నెత్తిమీదకి జరుపుకుంటున్నారు.
ఇది కల కాదు భయాలపారమీద
పంటిగాయాల వాస్తవం.
మనుషుల్ని కాలుతున్నఇనుపసువ్వలు
మింగాలని చూస్తున్న కాలం.

నన్నేమీ అనకండీ
నేను నిలబడే వున్నాను
నాతో నిలబడేవారే
సీసాలదేహాల్లోకి జారీ మూతులు,
మూతల్ని బిగించుకుంటున్నారు.
పగిలిపోకుండా వుంటారా?

నేను ఇంకా కూలిపోలేదు
నన్ను ఎత్తుకొని మరేవరినో పాడేంత కాలం
నేను నాలా కనిపించకపోవొచ్చు
నన్ను నమ్మండి ఈ దుఃఖపుపారమీద
ఉడుకుతున్న పాటని
రేపొక పూలచెట్టునవుతాను
నాలోఎన్ని వాస్తవాలు పూస్తాయో చూడు.

- పేర్ల రాము, 9642570294

బట్టబయలైన అదానీ అవినీతి సామ్రాజ్యం

> ఏండ్ల తరబడి, గౌతమ్ అదానీ తన సామ్రాజ్యాన్ని నిర్మించుకున్న తీరుపై అనేక తీవ్రమైన ప్రశ్నలు, ఆరోపణలు వచ్చాయి. బొగ్గు దిగుమతులకు అధిక మొత్తాలు చెల్లించినట్లు చూపించడం, తన కంపెనీలకు విదేశాల్లో నిధులు అందడంపై పారదర్శకత పాటించకపోవడం, పర్యావరణ నిబంధనలను ఘోరంగా ఉల్లంఘించడం, నియమ నిబంధనలను తనకు అనుకూలంగా మలచుకుంటూ ప్రాజెక్టులను పొందిన తీరుపై మీడియాలో, వాణిజ్య విశ్లేషకులు ప్రశ్నలు లేవనెత్తుతూనే వచ్చారు. కానీ, వీటిల్లో ఏ అంశంపైనా సెబి కానీ, ఆర్‌బిఐ కానీ, ఇడి వంటి ప్రభుత్వ నియంత్రణా సంస్థలు కానీ స్పందించిన దాఖలాలు లేవు.

అమెరికాకు చెందిన అతి చిన్న మదుపరుల సంస్థ భారతదేశంలోని అతి పెద్ద, శక్తివంతమైన అదానీ గ్రూప్‌ను సవాలు చేసి, దాని పునాదులనే కదిలించేసింది. హిండెన్‌బర్గ్ రీసెర్చి అనే ఈ షార్ట్ సెల్లింగ్ సంస్థ అదానీ గ్రూపుపై 129 పేజీలతో నివేదిక వెలువరించింది. అదానీ గ్రూపునకు చెందిన ఏడు కంపెనీలతో సంబంధమున్న 578 అనుబంధ సంస్థల, షెల్ కంపెనీల నిధుల సేకరణ కార్యకలాపాలు, దేశం వెలుపల సాగించే కార్యకలాపాల గురించి అనేక ఆధారాలను అందులో పొందుపరిచింది. ఇది 'కార్పొరేట్ చరిత్రలోనే అతిపెద్ద మోసం'గా హిండెన్ బర్గ్ నివేదిక పేర్కొంది.

నిధులు, బూటకపు కంపెనీల సంక్లిష్టమైన నెట్‌వర్క్‌ను ఈ నివేదిక బయటపెట్టింది. ఈ షెల్ కంపెనీల్లో కొన్ని మారిషస్‌లో, సైప్రస్‌లో, యుఎఇలో ఉన్నాయి. లిస్టెడ్ కంపెనీల షేర్ల ధరలను తారుమారు చేయడానికి తెలివిగా ఈ డొల్ల కంపెనీలను ఉపయోగించారు. అధిక రుణాలు, అంతంత మాత్రం ఆస్తులు మాత్రమే ఉన్న ఈ సంస్థల ఆర్థిక పరిస్థితి ఆరోగ్యకరంగానే ఉందని, రుణాలను చెల్లించగలిగే సామర్థ్యం వాటికి ఉందని చెప్పుకునేందుకు లిస్టెడ్ కంపెనీల ఆస్తి అప్పుల పట్టీ (బ్యాలన్స్ షీట్)లను చూపించారు. వాటికి డబ్బును మళ్లించడానికి ఈ డొల్ల కంపెనీలను వాడుకున్నారు. అదానీ కంపెనీల విలువను వాస్తవిక రేటు కన్నా దాదాపు 85శాతం ఎక్కువ చేసి చూపారని ఆ నివేదిక అంచనా వేసింది. స్టాక్ మార్కెట్‌లో దారుణమైన అవకతవకలకూ అకౌంటింగ్‌లో పెద్దయెత్తున అక్రమాలకూ పాల్పడుతూ ఇదంతా అదానీ గ్రూపు ఒక పక్కా పథకం ప్రకారం చేసిన చర్యగా హిండెన్‌బర్గ్ నివేదిక ఆరోపించింది.

హిండెన్‌బర్గ్ నివేదికను 'భారత్‌పై ఒక పథకం ప్రకారం జరిగిన దాడి' అంటూ అదానీ గ్రూపు ఈ ఆరోపణలను కొట్టిపారేసింది. అయితే, తన వాదనను సమర్థించుకోవడానికి అది ఎలాంటి ఆధారాలను చూపలేకపోయింది. జాతీయవాదం ముసుగులో తన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు అది ప్రయత్నించింది. "భారతదేశ సంస్థల స్వతంత్రత, సమగ్రత, నాణ్యత, వృద్ధి కథనం, వడివడిగా అడుగులు వేయాలన్న భారత్ ఆకాంక్షను చూసి సహించలేకనే ఈ రకమైన దాడి" చేస్తున్నారని గావు కేకలు పెడుతోంది.


> ఆర్థిక, వ్యాపార కార్యకలాపాలన్నింటిపైనా నియంత్రణా సంస్థలు, లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సంస్థలు దర్యాప్తు జరిపేలా చూసేందుకు కృతనిశ్చయంతో పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అదానీ గ్రూపుపై హిండెన్‌బర్గ్ రీసెర్చి సంస్థ చేసిన ఆరోపణలపై దర్యాప్తు జరిపేందుకు ఉన్నత స్థాయి దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలి. ఈ విచారణను సుప్రీం కోర్టు పర్యవేక్షించాలి.

హిండెన్‌బర్గ్ నివేదిక ప్రభావం వెంటనే కనిపించింది. నివేదిక వచ్చిన తరువాత వారంలోనే అదానీ గ్రూపు 6,700 కోట్ల డాలర్లను లేదా స్టాక్ మార్కెట్‌లో దాదాపు రూ.5.6 లక్షల కోట్ల మార్కెట్ పెట్టుబడులను నష్టపోయింది. గౌతమ్ అదానీ తన సంపదలో 5వేలకోట్ల డాలర్ల మేరకు నష్టపోయారు. ప్రపంచంలోనే అత్యంత సంపన్నుల్లో మూడవ వ్యక్తిగా ఉన్న అదానీ ఒక్కసారిగా 15వ స్థానానికి పడిపోయారు.

అదానీ గ్రూపు సంపదలో చాలా వరకు దేశ సహజ వనరులను అనేక ఏండ్లుగా లూటీ చేస్తూ, ప్రభుత్వ నిధులను కొల్లగొట్టడం ద్వారా సమకూర్చుకున్నదే. అందువల్లే అదానీ గ్రూపు మోసపూరిత లావాదేవీలపై ప్రజలు ఇంతగా ఆందోళన చెందుతున్నారు. అదానీ గ్రూపు ఓడరేవులు, విమానాశ్రయాలకు సంబంధించి అతిపెద్ద ప్రయివేట్ ఆపరేటర్‌గా అవతరించింది. ఆహార ధాన్యాల గిడ్డంగుల్లో అతిపెద్దదిగా ఉంది. విద్యుత్ ట్రాన్స్‌మిషన్‌లో అయిదోవంతు భాగాన్ని కలిగి ఉంది, సిమెంట్ పరిశ్రమను శాసిస్తుంది. బొగ్గు తవ్వకాల్లో అతిపెద్ద వాటా కలిగి దేశంలోనే అతిపెద్ద థర్మల్ విద్యుత్ ప్రయివేటు ఉత్పత్తిదారుగా అదానీ గ్రూపు ఉంది. మోడీ ప్రభుత్వ చలవతోనే అదానీ ఇంత వేగంగా ఎదిగాడనేది నిర్వివాదాంశం.

జాతీయ బ్యాంకుల నుండి రుణాలు పొందడం, జీవిత బీమా సంస్థ వంటి సంస్థల నుండి వచ్చిన పెట్టుబడుల ద్వారా ఆస్తులు, కొనుగోళ్ళలో ఎక్కువ భాగాన్ని సమకూర్చుకోగలిగింది. అదానీ కంపెనీల్లో ఎల్‌ఐసి పెట్టుబడుల ద్వారానే దాదాపు రూ.80వేల కోట్ల నిధులు వచ్చాయి. బ్యాంకుల నుండి ఈ గ్రూపు తీసుకున్న అన్ని రుణాల్లో 40శాతం వరకు ఎస్‌బిఐ నుండే వచ్చాయి. ఇటువంటి పరిస్థితుల్లో అదానీ గ్రూపు కంపెనీల షేర్ల ధరలు కుప్పకూలడం వల్ల ప్రజల పొదుపు మొత్తాలకు, ప్రభుత్వ నిధులకు ముప్పు వాటిల్లుతోంది.

రూ.20వేల కోట్లను సమీకరించేందుకు అదానీ, బహిరంగంగా షేర్ల అమ్మకాలను ప్రారంభిస్తున్న సమయంలో సరిగ్గా హిండెన్‌బర్గ్ నివేదిక వెలువడింది. అదానీ గ్రూపు కంపెనీల షేర్ల ధరలు కుప్పకూలినప్పటికీ, అంతిమంగా ఆ ఆఫర్ పూర్తిగా సబ్‌స్క్రైబ్ అయింది. దేశంలోని బడా



పారిశ్రామికవేత్తలు కొందరు తమ సంస్థల తరపున కాకుండా వ్యక్తులుగా ఈ షేర్లను అధిక మొత్తంలో కొనుగోలు చేయడం వల్లే అవి పూర్తిగా సబ్‌స్క్రైబ్ అయ్యాయి. పెట్టుబడిదారుల మధ్య వర్గ సంఘీభావం ఎలా ఉంటుందో తెలుసుకోవడానికి ఈ ఉదంతం ఒక చక్కటి ఉదాహరణ. ముకేష్ అంబానీ, సజ్జన్ జిందాల్, సునీల్ మిట్టల్, పంకజ్ పటేల్ వంటి బడా వ్యాపారవేత్తలు అదానీ కంపెనీ షేర్లను పెద్ద మొత్తంలో కొన్నట్లు తెలుస్తోంది. అయితే, ఆ మరుసటి రోజునే, అదానీ కంపెనీలు షేర్ల జారీని రద్దు చేస్తున్నట్లు ప్రకటించాయి. పెట్టుబడిదారులందరికీ ఆ మొత్తాలను తిరిగి ఇచ్చేస్తామని కూడా చెప్పాయి. రెండు అదానీ ఫ్రంట్ కంపెనీలు మలి విడత పబ్లిక్ ఆఫర్‌లో పెట్టుబడులు పెట్టాయన్న ఆరోపణలు రావడంతో అకస్మాత్తుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు కనిపిస్తోంది.

అదానీ గ్రూపు అకస్మాత్తుగా, అందరి దృష్టిని ఆకర్షించేలా ఎదిగిన తీరు, చాలా వేగంగా విస్తరించిన వైనాన్ని ప్రశ్నించే స్థితే లేకుండా చేశారు. ఏండ్ల తరబడి, గౌతమ్ అదానీ తన సామ్రాజ్యాన్ని నిర్మించుకున్న తీరుపై అనేక తీవ్రమైన ప్రశ్నలు, ఆరోపణలు వచ్చాయి. బొగ్గు దిగుమతులకు అధిక మొత్తాలు చెల్లించినట్లు చూపించడం, తన కంపెనీలకు విదేశాల్లో నిధులు అందడంపై పారదర్శకత పాటించకపోవడం, పర్యావరణ నిబంధనలను ఘోరంగా ఉల్లంఘించడం, నియమ నిబంధనలను తనకు అనుకూలంగా మలచుకుంటూ ప్రాజెక్టులను పొందిన తీరుపై మీడియాలో, వాణిజ్య విశ్లేషకులు ప్రశ్నలు లేవనెత్తుతూనే వచ్చారు. కానీ, వీటిల్లో ఏ అంశంపైనా సెబి కానీ, ఆర్‌బిఐ కానీ, ఇడి వంటి ప్రభుత్వ నియంత్రణా సంస్థలు కానీ స్పందించిన దాఖలాలు లేవు.

తమ మోసపూరిత లావాదేవీలను ప్రశ్నించే జర్నలిస్టులను బెదిరించడానికి, అణచివేయడానికి అదానీలు తమ ధన, రాజకీయ బలాన్ని ఉపయోగించారు. అదానీల ఒప్పందాలను ప్రశ్నించేలా కథనాలు రాసినా, ప్రసారం చేసినా సహించలేని స్థితి. ఆ కథనాలను ప్రచురించిన, లేదా ప్రసారం చేసిన వార్తా సంస్థలు, చానెళ్లపై పరువు నష్టం దావాలను ఒక అస్త్రంగా ప్రయోగించారు. ఉదాహరణకు, అదానీ ఎల్‌ఎన్‌జి టెర్మినల్‌లో ఇండియన్ ఆయిల్ కంపెనీ, గెయిల్ ఇండియాలు పెట్టుబడులు ఎందుకు పెట్టాయని ప్రశ్నిస్తూ ఒక వార్తా కథనాన్ని ప్రచురించినందుకు 2017 నవంబరులో 'ది వైర్' పత్రికపై వంద కోట్లకు పరువు నష్టం దావా వేశారు. ఇటువంటి పరువు నష్టం కేసులను ఎదుర్కొంటున్న ఇతర జర్నలిస్టుల్లో పరంజరు గుహ థకుర్తా (ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ), రవి నాయర్ తదితరులున్నారు. ఈ విధంగా కేసులు పెట్టి మీడియా గొంతు నొక్కాలని అదానీ గ్రూపు ప్రయత్నించింది.

స్టాక్‌ల తారుమారు, మనీ లాండరింగ్, అకౌంటింగ్ మోసాలు, భారతదేశ అత్యున్నత పారిశ్రామికవేత్త పేరు ప్రతిష్టకు భంగం కలిగించే కుట్రగా చూపించే యత్నాలు, ఆరోపణలు, ప్రత్యారోపణల నడుమ అదానీ-హిండెన్‌బర్గ్ అధ్యాయం నుంచి తీసుకోవాల్సిన అసలు పాఠం మరుగున పడకూడదు. నరేంద్ర మోడీ ప్రభుత్వం ఇచ్చిన దన్నుతోనే అదానీ భారతదేశంలోనే అత్యంత సంపన్నుడిగా ఎదిగిన వైనాన్ని చూడకపోతే అదానీ కథ అసంపూర్ణమే అవుతుంది. 2002లో మోడీ గుజరాత్ ముఖ్యమంత్రి అయినపుడు అదానీ, మోడీ మధ్య సంబంధాలు మొదలయ్యాయి. అప్పటి నుండి అదానీ అదృష్టాలన్నీ మోడీ రాజకీయ పంథాతో పెనవేసుకుని సాగాయి. 2014లో మోడీ ప్రధాని అయ్యారు. ఆ సంవత్సరంలో రూ.50.4 వేల కోట్లుగా ఉన్న అదానీ సంపద, 2022 నాటికి వచ్చేసరికి అమాంతంగా రూ.10.30లక్షల కోట్లకు పెరిగిపోయింది. మోడీకి అత్యంత ప్రీతిపాత్రుడైన పారిశ్రామికవేత్త అదానీకి ఇక పట్ట పగ్గాల్లేవు. ఏ ప్రభుత్వ నియంత్రణా సంస్థ కానీ, అధికారి కానీ ఆయనను ప్రశ్నించే సాహసం కానీ, అడ్డుకునే యత్నం కానీ చేయలేని స్థితి. ప్రభుత్వ అండ చూసుకునే అదానీ గ్రూపు తన వ్యాపార సామ్రాజ్యాన్ని అంతగా విస్తరించుకోగలిగింది. ఇటీవలి కాలంలో ఆశ్రిత పెట్టుబడిదారీ విధానానికి ఇదొక అత్యంత దారుణమైన ఉదాహరణ. మోడీ-అదానీ బంధం ఈనాడు దేశాన్ని పాలిస్తున్న హిందూత్వ-కార్పొరేట్ శక్తుల పొత్తును నగ్నంగా బయటపెట్టింది. మోడీ ప్రభుత్వ మద్దతుతో తాను ఈ తుపానును ఎదుర్కోగలనని అదానీ చాలా ధీమాగా ఉన్నారు. కానీ, ప్రజాస్వామ్యాన్ని నాశనం చేయడాన్ని, మతోన్మాద-కార్పొరేట్ శక్తులు కుమ్మక్కయి తమ జీవనోపాధిని దెబ్బ తీయడాన్ని స్వయంగా చూస్తున్న ఈ దేశ పౌరులకు మాత్రం ఈ దోపిడీ, అక్రమ సంపాదనలకు గాను అదానీలను జవాబుదారీ చేయడమనేది అత్యంత ముఖ్యమైన అంశంగా ఉన్నది.

అందువల్ల, అదానీ గ్రూపునకు సంబంధించిన మొత్తం ఆర్థిక, వ్యాపార కార్యకలాపాలన్నింటిపైనా నియంత్రణా సంస్థలు, లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సంస్థలు దర్యాప్తు జరిపేలా చూసేందుకు కృతనిశ్చయంతో పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అదానీ గ్రూపుపై హిండెన్‌బర్గ్ రీసెర్చి సంస్థ చేసిన ఆరోపణలపై దర్యాప్తు జరిపేందుకు ఉన్నత స్థాయి దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలి. ఈ విచారణను సుప్రీం కోర్టు పర్యవేక్షించాలి.

(పీపుల్స్ డెమోక్రసీ సంపాదకీయం)

'బోలె రే పపి హర' అంటూ తన గానంతో ఉత్తర భారత దేశంలో గుర్తింపు తెచ్చుకున్నారు. 'ఎన్నెన్నో జన్మల బంధం నీది నాది' అంటూ రొమాంటిక్ పాటతో యువత మనసులో మర్చిపోలేని మధుర జ్ఞాపకాలను తట్టిలేపిన వాణి జయరాం గొంతు మూగ పోయింది. అయినా తన పాటలతో శ్రోతల మనసుల్లో శాశ్వతంగా నిలిచిపోయిన సుస్వర 'వాణి' పరిచయం నేటి మానవిలో...

సుస్వర 'వాణి'





వాణి జయరాం అసలు పేరు కలై వాణి. 30, నవంబరు 1945లో వెల్లూరులో జన్మించారు. ఈమె తల్లి తండ్రులు పద్మావతి, దురైస్వామి అయ్యంగార్. వీరికి ఆరుగురు ఆడపిల్లలు, ముగ్గురు కొడుకులు. వాణి జయరాం ఐదవ సంతానం. శాస్త్రీయ సంగీత విద్వాంసుల కుటుంబం వారిది. చిన్నప్పటి నుంచి వాణి రేడియోకి అతుక్కుపోయి హిందీ పాటలు ఎక్కువగా వింటూ ఉండేవారు.

సంగీతంలో శిక్షణ

కూతురి ఆసక్తిని గమనించి సంగీతంలో శిక్షణ ఇప్పించేందుకు రంగ రామానుజ అయ్యంగార్ వద్ద చేర్పించారు. అక్కడ ముత్తుస్వామి దీక్షితార్ కృతులు నేర్చుకున్నారు. తర్వాత ఆమె కడలూర్ శ్రీనివాస్ అయ్యంగార్, టి.ఆర్.బాలసుబ్రహ్మణ్యన్, ఆర్.యెస్ మణి గార్ల వద్ద మెరుగైన సంగీత శిక్షణ తీసుకున్నారు. ఒక వైపు సంగీతం నేర్చుకుంటూనే చదువు కొనసాగించారు. చెన్నైలోని క్వీన్ మేరీ కళాశాల నుండి పట్టభద్రురాలు అయ్యారు. చదువు పూర్తి అవ్వగానే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, మద్రాస్‌లో ఉద్యోగం రావడంతో చేరిపోయారు.

ఉద్యోగం వదిలేసి

1969లో జయరాంతో వివాహం అయిన తర్వాత తన ఉద్యోగాన్ని ముంబయికి బదిలీ చేయించుకుని అక్కడ తన వైవాహిక జీవితాన్ని ప్రారంభించారు. వాణి గాన నైపుణ్యాన్ని తెలుసుకున్న జయరాం ఆమె అభిష్టాన్నీ గ్రహించి



హిందూస్థాని సంగీతంలో శిక్షణ పొందేందుకు ఉస్తాద్ అబ్దుల్ రెహ్మాన్ దగ్గర చేర్పించారు. ఆయన దగ్గర శిక్షణ తీసుకుంటూ బ్యాంక్ ఉద్యోగానికి స్వస్తి పలికారు. సంగీతాన్నే తన వృత్తిగా మలచుకున్నారు. ఖాన్ శిక్షణలో భజన, గజల్, తు మి రీ వంటి వివిధ స్వర రూపాలలో నైపుణ్యాన్ని సంపాదించారు. 1969లో తన మొదటి బహిరంగ కచేరి ఇచ్చారు. అదే సంవత్సరం వసంత దేశాయ్‌తో పరిచయం అయ్యింది. ఆమె స్వరానికి ముగ్ధుడైన దేశాయ్ తన ఆల్బమ్‌లో పాటకు ఆమెను ఎంచుకున్నారు. ఈ ఆల్బమ్ మరాఠీ ప్రేక్షకులలో ఎంతో ప్రజాదరణ పొందింది.

జాతీయ పురస్కారం

బాలీవుడ్‌లో ఆమెకు ప్రజాదరణ రోజు రోజుకు పెరగసాగింది. దక్షిణ భారత దేశం నుండి అవకాశాలు రాసాగాయి. 1973లో మొదటిసారి తమిళ పాటను రికార్డ్ చేశారు. అయితే ఆ చిత్రం ఇప్పటివరకు విడుదల కాలేదు. ఆమె పాడిన పాటలలో మొదట విడుదల అయినది 1973లోనే టి.ఎం.సౌందర్ రాజన్‌తో కలిసి పాడిన యుగళ గీతం "ఓరు ఇదం ఉన్ని దం". ఇది విడుదలైన అతి తక్కువ కాలంలోనే బాలచందర్, కె. విశ్వనాథన్ తమ చిత్రంలో సోలో పాటకు ఆమెను నియమించుకున్నారు. 'అపూర్వ రాగాంగల్' చిత్రంలో ఆమె అందించిన పాటలకు ఉత్తమ నేపథ్య గాయనిగా మొదటి జాతీయ చలన చిత్ర అవార్డును అందుకున్నారు. అప్పటి నుండి ఆమె వెనుతిరిగి చూసుకోలేదు. పురస్కారాలు వెల్లువలా వచ్చి పడసాగాయి. తమిళనాడు రాష్ట్రం ఉత్తమ మహిళా నేపథ్య గాయనిగా గుర్తించి పురస్కారాన్ని అందించింది.

తెలుగులో అవకాశాలు

ఇక తెలుగులో కూడా ఆమెకు అవకాశాలు రాసాగాయి. తెలుగులో తొలిసారిగా 'అభిమానవంతులు' చిత్రం కోసం పాడారు. 1975లో వచ్చిన 'పూజ' చిత్రంలోని పాటలు ఆమెను తెలుగు చిత్ర సీమలో సుస్థిర స్థానాన్ని ఏర్పరచాయి. కె.విశ్వనాథ్ దర్శకత్వంలో వచ్చిన శంకరాభరణం చిత్రంలో ఐదు పాటలు పాడి విశేష ప్రజాదరణ పొంది రెండవ జాతీయ చలన చిత్ర పుర స్కారాన్ని అందుకున్నారు. ఆ చిత్రంలోని పాటలకే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుండి ఉత్తమ నేపథ్య గాయనిగా నంది పురస్కారాన్ని అందుకున్నారు.

కవిత్వం కూడా రాశారు

మలయాళ, కన్నడ భాషాలలోనే కాక దాదాపు 16 భాషలలో పాటలు పాడి ప్రజాదరణ పొందారు. ఇన్ని పాటలు పాడిన వాణి జయరాం సంగీత ప్రపంచంలో ఎన్నో ఒడిదుకులను ఎదుర్కొన్నారు. కొన్ని సమస్యల వల్ల అనుకున్న సమయంలో పాటలన్ని ఆగిపోయాయి. అయిన ఆమె నిరాశ పడలేదు. ఆమెకు కవితలు రాయడం అంటే ఏంతో ఇష్టం. హిందీ భాషలో అనేక కవితలు రాసారు. రోజుకు 48 గంటలు ఉన్నా తనకు సరిపోవని అప్పుడప్పుడు ఆమె అంటుండేవారు. అంత బిజీగా గడిపేవారు.


పద్మభూషణ్ తీసుకోకుండానే...



ఈ సంవత్సరం 74వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని వాణి జయరాంకు కేంద్ర ప్రభుత్వం కిందటి నెలలో పద్మభూషణ్ పురస్కారం ప్రకటించింది. ఈ పురస్కారాన్ని స్వీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం పిలుపు కోసం ఎదురుచూస్తున్న సమయంలో ఆ పురస్కారాన్ని స్వీకరించ కుండానే ఆవిడ మరణించడం ఎంతో బాధాకరం. భర్త జయరాం ఐదు సంవత్సరా కిందట కన్నుమూశారు. ప్రజల మనసుల్లో తన గానంతో చెరగని ముద్ర వేసిన వాణి జయరాం మన మనసుల్లో ఎప్పటికీ నిలిచిపోతారు.

- పాలపర్తి సంధ్యారాణి

చర్మానికి మేలు చేస్తుంది



ఖర్జూరం పండు తినడం వల్ల అనేక ప్రయోజనాలకు కలుగుతాయి. అందుకు ఖర్జూరంలో ఉండే ఐరన్, మినరల్స్, కాల్షియం, అమినో యాసిడ్స్, ఫాస్పరస్ కారణం. చలికాలం అంటేనే సీజనల్ వ్యాధులు, ఆరోగ్య సమస్యలతో పోరాటం. ఈ కాలంలో వచ్చే సమస్యల బారిన పడకుండా ఉండాలంటే పోషకాలతో కూడిన సమతుల్య ఆహారాన్ని తీసుకోవడమే మార్గమని వైద్య, ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. అంతేకాక జీవనశైలిలో మార్పులు, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వంటివి కూడా ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో ఉపకరిస్తాయని అంటున్నారు. అందుకే వర్క్అవుట్స్ చేసేవారు, క్రీడాకారులు ఖర్జూరాలను ఎక్కువగా తీసుకుంటారు. ఒక ఖర్జూరంలో 23 కేలరీలు ఉంటాయి. ఖర్జూరం తక్షణ శక్తిని కూడా అందిస్తుంది. ఇంకా ఖర్జూరం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి మనం ఇప్పుడు తెలుసుకుందాం..

ఎముకల పటిష్టత: ఖర్జూరం ఎముకలని పటిష్టం చేయడంలో ఎఫెక్టివ్‌గా పనిచేస్తుంది. ఇందులో ఉండే లవణాలు ఎముకలను ధృఢపరిచేందుకు పని చేస్తాయి. ఖర్జూరాలలో పుష్కలంగా ఉండే క్యాల్షియం, సెలీనియం, మాంగనీస్, కాపర్ వంటి పోషకాలు ఎముకలను బలోపేతం చేస్తాయి.

రోగనిరోధక శక్తి: ఖర్జూరంలో గ్లూకోజ్, ఫ్రక్టోజ్ వంటివి పుష్కలంగా ఉండడం వల్ల మీ శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది.

చర్మానికి మేలు: ఖర్జూరం చర్మానికి చాలా మేలు చేస్తుంది. దీనిని తినడం వల్ల ముఖం కాంతివంతంగా మారుతుంది. మంచి గ్లో కూడా వస్తుంది.

బరువు: మీరు తక్కువ బరువు ఉన్నట్లయితే ఖర్జూరం తీసుకోవడం వల్ల మేలు జరుగుతుంది. ఇది బరువును పెంచడానికి పని చేసే అనేక ముఖ్యమైన ప్రోటీన్లను కలిగి ఉంటుంది. మీరు చాలా సన్నగా ఉన్నట్లయితే రోజూ నాలుగైదు ఖర్జూరాలు తింటే మంచిది. కొన్ని రోజుల్లో ఫలితాలను చూస్తారు.

తక్షణ శక్తి: ఖర్జూరంలో తగినంత మొత్తంలో గ్లూకోజ్, ఫ్రక్టోజ్, సుక్రోజ్ ఉంటాయి. ఇది తక్షణ శక్తిని అందిస్తుంది. దీన్ని తిన్న వెంటనే శక్తి లభిస్తుంది.

ఇట్ల చేద్దాం



గుప్పెడు బాదం గింజల్ని మెత్తగా రుబ్బి కాస్త నిమ్మరసం, పావుకప్పు బొప్పాయి గుజ్జు, నాలుగు చెంచాల బ్రౌన్‌షుగర్ కలపండి. ఆ మిశ్రమాన్ని ఒంటికి పట్టించి నలుగు పెట్టండి. ఇలా పది నిమిషాలు చేశాక గోరువెచ్చటి నీళ్లతో స్నానం చేయండి. మృతకణాలు తొలగి, చర్మం మృదువుగా మారుతుంది.

బోలెడు ప్రయోజనాలు

ప్రపంచాన్ని వణికిస్తున్న వ్యాధులలో గుండెపోటు తర్వాత క్యాన్సర్ రెండో స్థానంలో ఉంది. ఈ క్యాన్సర్ బారిన పడకుండా ఉండాలంటే గ్రీన్ టీ తాగాలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అయితే ఈ గ్రీన్ టీలో కొన్ని ప్రత్యేకమైన వాటిని జోడిస్తే దీని ప్రయోజనాలు రెట్టింపు స్థాయిలో పెరుగుతాయి. మరి ఆ ప్రయోజనాలేమిటో మనం ఇప్పుడు తెలుసుకుందాం..

అల్లంతో: వంటకాల్లో మసాలా దినుసుగా ఉపయోగించే అల్లం ఆహారం రుచిని పెంచుతుంది. గ్రీన్ టీలో ఈ అల్లం కలిస్తే ఎన్నో రకాల ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని అధ్యయనాలు తెలియజేస్తున్నాయి. గ్రీన్ టీలో అల్లం కలిపి తీసుకోవడం వల్ల శరీర రోగనిరోధక వ్యవస్థ



బలోపేతం అవుతుంది. అంతేకాక క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చు.

పుదీనా ఆకులు, దాల్చిన చెక్కతో: కొంతమంది గ్రీన్ టీలో పుదీనా ఆకులు, దాల్చిన చెక్కను కలుపుకుని తాగుతారు. ఎందుకంటే ఇది శరీర ఇమ్యూనిటీ పెంచడమే కాకుండా జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఇది తాగిన తర్వాత చాలాసేపు వరకు ఆకలి వేయదు. తద్వారా ఈ టీ తాగిన వారు బరువు కూడా తగ్గుతారు.

నిమ్మకాయతో: నిమ్మకాయను గ్రీన్ టీలో కలిపి తీసుకుంటే రుచి కొద్దిగా మారుతుంది. ఈ రెండింటి కాంబినేషన్ మీ శరీరానికి మేలు చేస్తుంది. యాంటీఆక్సిడెంట్లను పెంచడంలో ఇది అద్భుతంగా పనిచేస్తుంది. ఇంకా శరీర రోగనిరోధక శక్తిని పెంచుతుంది.

స్టీవియా ఆకులు: స్టీవియాను తెలుగులో 'మధుపత్రి' అని అంటారు. ఇది గ్రీన్ టీతో కలిపితే తీపి యాడ్ అవుతుంది. దీన్ని రెగ్యులర్‌గా తీసుకుంటే క్యాలరీలు తగ్గడమే కాకుండా రక్తంలో చక్కెర స్థాయి కూడా తగ్గుతుంది. ఇది డయాబెటిక్ పేషెంట్లుకు చాలా బాగా ఉపయోగపడుతుంది.

కేటాయింపులే కాదు.. ఖర్చు కూడా చేయాలి

(మొదటిపేజి తరువాయి)

రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశం సోమవారంనాడిక్కడి పార్టీ రాష్ట్ర కార్యాలయం ఎంబీ భవన్‌లో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య అధ్యక్షతన జరిగింది. ప్రభుత్వం శాసనసభలో ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌పై చర్చించినట్టు ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఓ ప్రకటనలో తెలిపారు. "2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.2,90,296 కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టారు. వడ్డీ మాఫీ క్రింద రు.22,407 కోట్లు, అప్పు చెల్లింపుల క్రింద రూ.28,480 కోట్లు (మొత్తం బడ్జెట్‌లో 18 శాతం) చెల్లింపులు ఉన్నాయి. గృహ నిర్మాణానికి కేటాయించినట్టు ప్రకటించిన రూ.12వేల కోట్లు బడ్జెట్‌లో చూపలేదు. కార్పొరేషన్ ద్వారా తెచ్చిన రుణాల ద్వారా నిర్మాణాలు చేస్తామని బడ్జెట్ తర్వాత ఆర్థిక మంత్రి వివరణ ఇచ్చారు. బడ్జెట్‌లో చూపిన అప్పులు 2024 మార్చి నాటికి రూ.3,57,059 కోట్లుగా (రాష్ట్ర స్థూల ఆదాయంలో 23.8 శాతం) చూపారు. వాస్తవానికి కార్పొరేట్ అప్పులతో సహా లెక్కిస్తే రాష్ట్ర అప్పులు రు.4.5 లక్షల కోట్లకు చేరుకుంటాయి. వడ్డిరేటు 7.8 శాతంగా ప్రకటించారు. గత ఏడేండ్ల సగటు వడ్డిరేటు 12.6 శాతంగా ఉంది. తలసరి ఆదాయం జాతీయ ఆదాయం కన్నా 86 శాతం ఎక్కువ ఉన్నట్లు 2022-23లో రూ.3,17,115 ఉన్నట్టు ప్రకటించారు. ఓ వైపు తలసరి ఆదాయం పెరుగుతుంటే, మరోవైపు రాష్ట్రంలో దరిద్రుల సంఖ్య కూడా పెరుగుతూనే ఉంది. 37 శాతం మంది ప్రజలు దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి" అని పేర్కొన్నారు.

"అక్షరాస్యత అత్యంత కీలకం. విద్యారంగానికి రూ.19 వేల కోట్లు మాత్రమే కేటాయించారు. కేరళ, బెంగాల్, త్రిపురలో వామపక్ష ప్రభుత్వాలు పరిపాలన ప్రారంభించిన ఐదేండ్లలోనే 90శాతం అక్షరాస్యతను సాధించాయి. ఆరోగ్య రంగానికి రూ.11,525 కోట్లు చూపినప్పటికీ అనేక మంది నేటికీ వైద్య సేవలకు దూరంగానే ఉన్నారు. దళిత, గిరిజన, వెనుకబడిన వర్గాలు కరోనా అనంతరం నేటికీ ఆరోగ్య వసతికి నోచుకోలేదు. ప్రతి జిల్లాలో మెడికల్ కాలేజీలకు అనుబంధంగా దవాఖానాలు ఏర్పాటు కాలేదు. హోంశాఖకు రూ.9,598 కోట్లు కేటాయించినా శాంతిభద్రతల సమస్య మెరుగుపడలేదు. మహిళల కిడ్నాపులు, అఘాయిత్యాలు, నేరాలు పెరుగుతున్నట్టు పోలీస్‌శాఖ నివేదికలు చెప్తున్నాయి. కుల దురహంకార హత్యలు కొనసాగుతూనే ఉన్నాయి. వ్యవసాయ రంగానికి కేటాయింపులు రూ.26,831 కోట్లు కేటాయించారు. దీనిలో 75శాతం రుణమాఫీ, రైతుబంధు, రైతుబీమా కోసమే నిధులు ఖర్చు చేస్తున్నారు. సాగునీటి ప్రాజెక్టులకు రూ.26,885 కోట్లు కేటాయించినా, కాలయాపన వల్ల వాటి అంచనాలు పెరుగుతూనే ఉన్నాయి" అని తెలిపారు. "ఎనిమిదేండ్లుగా ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు సరిగా ఖర్చుచేయకుండా ప్రక్కదారి పడుతున్నాయి. దళితులకు మూడెకరాల భూమి ఊసే లేదు. నిరుద్యోగభృతి, గిరిజనబంధుకు కేటాయింపులు లేవు. బడ్జెట్‌లో ఏటా 20 శాతం నిధులు రావట్లేదు. దళిత, గిరిజన, వెనుకబడిన, మైనారిటీల కేటాయింపులు తగ్గిస్తున్నారు. ఇలాంటి తగ్గింపులు లేకుండా దారిద్ర్యరేఖ నుంచి ఎగువకు తీసుకురావడానికి, విద్యా-వైద్యానికి అదనపు నిధులు కేటాయించాలనీ, వాటిని పూర్తిగా అభివృద్ధికోసం ఖర్చుచేయాలి" అని డిమాండ్ చేశారు.

భారీగా పెరిగిన 71మంది ఎంపీల ఆస్తులు

(మొదటిపేజి తరువాయి)

సమర్పించిన అఫిడవిట్‌లో ఆయన పేర్కొన్నారు. ఈ గణాంకాల ప్రకారం ఆయన ఆస్తుల్లో పెరుగుదల 4189శాతముందని నివేదిక విశ్లేషించింది. కర్నాటకలోని బీజాపూర్ నియోజికవర్గం నుంచి ఎన్నికైన చందప్ప 2016-19 మధ్యకాలంలో కేంద్ర సహాయమంత్రిగా ఉన్నారు. ఆస్తుల్లో భారీ పెరుగుదల ఉన్న టాప్-10 ఎంపీల్లో కర్నాటకకు చెందిన మరో ఎంపీ పి.సి.మోహన్ రెండోస్థానంలో ఉన్నారు. బెంగుళూర్ సెంట్రల్ స్థానం నుంచి గెలుపొందిన ఆయన తనకు రూ.5.37 కోట్ల ఆస్తులున్నాయని 2009లో ప్రకటించారు. ఎన్నికల అఫిడవిట్ ప్రకారం, 10ఏండ్లలో ఆస్తుల విలువ రూ.75.55కోట్లకు చేరుకుంది. ఆస్తులు, సంపద పెరుగుదల 1306శాతముందని నివేదిక అభిప్రాయపడింది. అలాగే బీజేపీ ఎంపీ వరుణ్ గాంధీ ఆస్తులు రూ.4.92 కోట్ల నుంచి రూ.60.32 కోట్లకు పెరిగింది. శిరోమణి అకాలీదళ్ ఎంపీ హరిసిమ్రత్ కౌర్ బాదల్ ఆస్తులు రూ.60.31 కోట్ల నుంచి రూ.218 కోట్లకు చేరుకుంది. ఎన్సీపీ నాయకురాలు సుప్రియాసూలే ఆస్తులు రూ.51 కోట్ల నుంచి రూ.140కోట్లకు పెరిగింది. ఇలా 71మంది ఎంపీల ఆస్తుల్లో సగటు పెరుగుదల 286శాతముందని ఏడీఆర్ విశ్లేషించింది.

ఇది ప్రగతి పద్దు

(మొదటిపేజి తరువాయి)

గ్రాంటుగా ఇవ్వాలని సిఫారసు చేస్తే ఇవి కూడా ఇవ్వకుండా కేంద్రం తెలంగాణకు తీవ్రమైన అన్యాయం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ చరిత్రలో ఏ ప్రభుత్వమూ ఈ విధంగా ఆర్థిక సంఘం సిఫార్సులను బేఖాతరు చేయలేదు' అని మంత్రి వ్యాఖ్యానించారు. ప్రసంగం ఆయన మాటల్లోనే...

కేంద్రం కాలయాపనతో రాష్ట్రానికి అన్యాయం

రాష్ట్రంలో కాజీపేట్ రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం స్టీల్ ప్లాంట్, గిరిజన యూనివర్సిటీని స్థాపించాలని పునర్వ్యవస్థీకరణ చట్టం స్పష్టంగా పేర్కొంది. ఎనిమిదిన్నరేండ్లయినా ఈ హామీలు నెరవేరలేదు. పైగా మంజూరైన ఐటీఐఆర్ ప్రాజెక్టును రాష్ట్రానికి రాకుండా చేసింది. నదీజలాల చట్టం సెక్షన్ 3ను అనుసరించి నూతన రాష్ట్రమైన తెలంగాణకు రావాల్సిన కష్ణా జలాల వాటాను నిర్ణయించాలని బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌కు కేంద్రం సూచించాల్సి ఉంది. కానీ కేంద్రం చేస్తున్న అనవసర కాలయాపనతో రాష్ట్ర ప్రయోజనాలకు తీవ్ర విఘాతం కలుగుతున్నది. ముఖ్యంగా తెలంగాణ ప్రభుత్వం కష్ణా నదిపై తలపెట్టిన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, డిండి వంటి ప్రాజెక్టుల నిర్మాణానికి ఆటంకం కలుగుతున్నది. 2022 ఆగస్టులో కేంద్ర విద్యుత్ శాఖ బకాయిల చెల్లింపు పేరిట ఇచ్చిన ఉత్తర్వులు రాష్ట్రం పట్ల కేంద్రం వివక్షకు మరో నిదర్శనం. విద్యుత్తు సరఫరాకు సంబంధించి రూ.3,441.78 కోట్లను అసలు కింద, రూ.3,315.14 కోట్లను వడ్డీ కింద లెక్క వేసి మొత్తంగా రూ.6,756.92 కోట్లను తెలంగాణ డిస్కంలు ఏపీజెన్‌కోకు 30 రోజుల్లోగా చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర విద్యుత్తు శాఖ ఆదేశాలిచ్చింది.

తెలంగాణ విజ్ఞప్తులను కేంద్రం పెడచెవిన పెడుతోంది..

2014-15 రాష్ట్రం ఏర్పడిన కొత్తలో కేంద్ర పథకాల కింద ఇవ్వాల్సిన రూ.495 కోట్లను కేంద్ర మంత్రిత్వ శాఖలు బాధ్యతా రాహిత్యంగా ఆంధ్రప్రదేశ్‌కు బదిలీ చేశాయి. ఉద్దేశపూర్వకంగానో లేక పొరపాటునో జరిగిన ఈ అన్యాయాన్ని సవరించమని తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న విజ్ఞప్తులను కేంద్రం పెడచెవిన పెడుతోంది.

సాగునీటిరంగంలో స్వర్ణయుగం

ప్రాజెక్టులతో అనుసంధానం చేయడంతో వేసవిలో సైతం చెరువులు జలకళను సంతరించుకుంటున్నాయి. భూగర్భ జల మట్టం పెరిగింది. 15 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ పొందింది. పెండింగ్ ప్రాజెక్టులను త్వరలోనే పూర్తిచేస్తామన్నారు.

పాలమూరు - రంగారెడ్డి 60 శాతం పూర్తి

ఉమ్మడి పాలమూరు, రంగారెడ్డి జిల్లాను సంపూర్ణంగా సస్యశ్యామలం చేసేలా ప్రభుత్వం పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును నిర్మిస్తున్నది. ఈ ప్రాజెక్టు నిర్మాణం దాదాపు 60 శాతం పూర్తయింది. త్వరలోనే పర్యావరణ అనుమతులను సాధించి శరవేగంగా ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయడానికి ప్రభుత్వం కంకణబద్ధమై ఉన్నది.ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేసే సీతారామ ప్రాజెక్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రాష్ట్రంలో మొత్తంగా 73 లక్షల 33 వేల ఎకరాలకు సాగునీటి వసతి ఏర్పడింది. రానున్న రెండు,మూడేండ్లల్లో మరో 50 లక్షల 24 వేల ఎకరాలకు సాగునీరు అందునుంది. నీటిపారుదల రంగానికి బడ్జెట్‌లో రూ.26,885 కోట్లు కేటాయించాం.

ఏప్రిల్ నుంచి కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ

రాష్ట్రంలోని కాంట్రాక్ట్ ఉద్యోగులకు శుభవార్త వినిపించారు. ఇచ్చిన మాట ప్రకారం ఏప్రిల్ నెల నుంచి కాంట్రాక్ట్ ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరణ చేస్తాం.సెర్ప్ ఉద్యోగులకు పే స్కేల్ సవరణ చేయబోతున్నాం. కేంద్ర ప్రభుత్వం నిధులలో కోతలు పెడుతూ, అనేక ఆర్థిక ఆంక్షలు పెడుతున్నది. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల విజ్ఞప్తుల మేరకు కొత్త ఈహెచ్ఎస్ విధానాన్ని తీసుకురాబోతున్నాం. ఎంప్లాయిస్ హెల్త్ కేర్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి ఇందులో ప్రభుత్వ ప్రతినిధులతో పాటు ఉద్యోగ, ఉపాధ్యాయ, రిటైర్డ్ ఉద్యోగుల ప్రతినిధులను భాగస్వాములుగా చేస్తాం. దీని విధివిధానాలను త్వరలోనే ప్రకటిస్తాం. రాష్ట్ర ప్రభుత్వం కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు గత బడ్జెట్‌లో ఈ పథకాలకు రూ. 2,750 కోట్లు కేటాయించగా, ఈ బడ్జెట్‌లో రూ. 3,210 కోట్లు ఇచ్చారు.

ఆసరా పింఛన్లు

రాష్ట్ర ప్రభుత్వం ఆసరా పింఛన్లకు గతేడాదికంటే రూ.272 కోట్లు అధికంగా కేటాయించింది. గత బడ్జెట్‌లో ఆసరా పెన్షన్లకు రూ,11,728 కోట్లు కేటాయించగా, 2023-24 ఆర్థిక సంవత్సరానికి ఆ మొత్తాన్ని రూ.12000 కోట్లకు పెంచింది. గత ప్రభుత్వాలు కంటి తుడుపుగా ఇచ్చిన రూ.200 పింఛన్‌ను రాష్ట్ర ప్రభుత్వం రూ.2016కు, దివ్యాంగులకు రూ.3016కు పెంచింది. ఈ ఆర్థిక సంవత్సరం నుంచి రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసే పట్టణ ప్రగతి, పల్లె ప్రగతి నిధులతో పాటు ఫైనాన్స్ కమిషన్ నిధులను కూడా స్థానిక సంస్థల ఖాతాల్లోకి నేరుగా బదిలీ చేయాలని సీఎం నిర్ణయించారు.

విద్యారంగం బలోపేతం : రాష్ట్రంలో విద్యారంగాన్ని బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నది. పేద పిల్లలు చదువులో ముందుండాలంటే గురుకుల విద్య ద్వారానే సాధ్యమని విశ్వసించిన సీఎం కేసీఆర్.. రాష్ట్రంలో గురుకుల విద్యకు పెద్దపీట వేశారు. రాష్ట్రం ఏర్పడినప్పుడు 293గా ఉన్న గురుకులాలను ఇప్పుడు 1,002కు పెరిగాయి.

విద్యాసంస్థల్లో మౌలిక వసతుల మెరుగుకు రూ.7,789 కోట్లు

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల మెరుగు కోసం ప్రభుత్వం మన ఊరు మన బడి అనే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టింది. మొత్తం 26,065 పాఠశాలల్లో దశల వారీగా మూడు దశల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తాం. బడ్జెట్‌లో రూ.7,289 కోట్ల నిధులను ఇస్తాం. మొదటి దశలో భాగంగా రూ.3,497 కోట్ల నిధులతో 9,123 పాఠశాలల్లో మౌలిక వసతులను కల్పిస్తున్నాం. అదేవిధంగా యూనివర్సిటీల్లో మౌలిక వసతుల కల్పన, హాస్టల్ భవనాల ఆధునీకరణ, కొత్త భవనాల నిర్మాణం కోసం ఈ బడ్జెట్‌లో రూ.500 కోట్లను కేటాంచాం. ఈ విద్యాసంవత్సరం మహేశ్వరం, మణుగూరులో పాలిటెక్నిక్ కళాశాలలు ప్రారంభం కానున్నాయి.

దళితబంధుకు రూ. 17,700 కోట్లు

దళితుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన దళితబంధు పథకానికి రూ.17,700 కోట్లు కేటాయించాం. స్వశక్తితో, స్వావలంబనతో జీవించాలనే బలమైన సంకల్పంతో ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ పథకానికి రూపుదిద్దారు. చరిత్రలో మునుపెన్నడూ లేనివిధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి దళిత కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నది. పాఠశాలల్లో వంటవాళ్ల పారితోషికాన్ని నెలకు రూ.1000 నుంచి రూ.3 వేలకు పెంచుతున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది.

యాదాద్రి పవర్‌ప్లాంట్ : నల్లగొండ జిల్లా దామరచర్లలో టీఎస్ జెన్ కో నిర్మిస్తున్న 4 వేల మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం గల యాదాద్రి అల్ట్రా మెగా థర్మల్ పవర్ ప్లాంట్ పనులు చివరిదశకు వచ్చాయి. ఈ ఆర్థిక సంవత్సరంలోనే ఈ ప్లాంటు నుంచి కూడా ఉత్పత్తి ప్రారంభమవుతుందని తెలియజేయడానికి సంతోషిస్తున్నాను.భద్రాద్రిలో 1080 మెగావాట్ల సామర్థ్యంతో 4 యూనిట్లలో ఉత్పత్తి ప్రారంభమైంది. 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన కొత్తగూడెం విద్యుత్ ప్లాంటులోనూ ఉత్పత్తి ప్రారంభమైంది. మంచిర్యాల జిల్లా జైపూర్‌లో 1200 మెగావాట్ల సామర్థ్యంతో సింగరేణి నిర్మించిన విద్యుదుత్పత్తి కేంద్రంలోనూ ఉత్పత్తి ప్రారంభమైంది.

కరెంట్ కోతలు, పవర్ హాలిడేలకు ముగింపు

అన్నిరంగాలకూ 24 గంటలపాటు నిరంతరాయంగా, వ్యవసాయానికి ఉచితంగా నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ. వెలుగు జిలుగుల రాష్ట్రంగా తెలంగాణ కీర్తి నేడు దశదిశలా వ్యాపించింది. రాష్ట్రంలో కరెంటు కోతలు, పవర్ హాలిడేలకు శాశ్వత ముగింపునిచ్చి, సీఎం కేసీఆర్ చరిత్ర సష్టించారు.

మండలిలో వేముల : శాసనమండలిలో నాలుగోసారి వేముల ప్రశాంత్‌రెడ్డి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈసందర్భంగా ప్రభుత్వ కేటాయింపులు, వ్యయంపైచర్చించారు. కేంద్ర ప్రభుత్వంతీరుపై విమర్శలు చేశారు.

మేడారంలో వేసిన ఈ అడుగు..
కేసీఆర్ ప్రభుత్వాన్ని పాతాళానికి తొక్కడానికే..

(మొదటిపేజి తరువాయి)

సీతక్కను ఎమ్మెల్యేగా గెలిపిస్తే.. ములుగు ఖ్యాతిని ఢిల్లీ వరకు తీసుకెళ్లారని కొనియాడారు. కులాలు, ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టి బీజేపీ అధికారాన్ని పదిలం చేసుకోవాలనుకుంటోందని విమర్శించారు. త్యాగాల పునాదులపై కాంగ్రెస్ పార్టీ ఏర్పడిందని, అందుకే ప్రాణాలకు తెగించి దేశ సమగ్రతను కాపాడేందుకు రాహుల్ గాంధీ పాదయాత్ర చేశారని తెలిపారు. ఆ స్ఫూర్తితో 'హాత్ సే హాత్' యాత్ర నిర్వహించాలని ఏఐసీసీ ఆదేశించిందన్నారు. కాగా, సమ్మక్క సారలమ్మ వన దేవతలు.. నమ్మిన ప్రజల కోసం కాకతీయ సామ్రాజ్యాన్ని ఎదిరించి చివరి రక్తపు బొట్టు వరకు పోరాడిన సమ్మక్క సారలమ్మల స్ఫూర్తితో ఈ యాత్రను ప్రారంభించినట్టు తెలిపారు. సాయుధ రైతాంగ పోరాటంలో నైజాం సర్కారును గడగడలాడించిన గడ్డ మీద ఆ అమ్మల ఆశీర్వాదంతో పోరాటానికి సిద్ధమయ్యామని స్పష్టంచేశారు. సమ్మక్క సారక్క సాక్షిగా సీతక్క హారతి ఇచ్చి స్వాగతం పలికిందంటే.. ఈ యాత్ర విజయవంతం అయినట్టేనని తెలిపారు. అమరుల త్యాగాలను ఈ ప్రభుత్వం మట్టి కప్పి, అధికారం అడ్డుపెట్టుకుని కేసీఆర్ ఇష్టారాజ్యాంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పుల బాధతో రైతులు పురుగుల మందు తాగి చనిపోవడం సంక్షేమమా అని, నోటిఫికేషన్ల లేక, ఉద్యోగాలు రాక నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకోవడం సంక్షేమమా అని.

విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా పేదలను విద్యకు దూరం చేయడం సంక్షేమమా అని ప్రశ్నించారు. రైతులకు లక్ష రూపాయల రుణమాఫీ ఏమయిందన్నారు. తెలంగాణ వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు రూ. 25 లక్షల కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టారని, ఆ లెక్కన ప్రతి నియోజకవర్గానికి రూ. 20 వేల కోట్లు రావాలని, ములుగుకు రూ. 20 వేల కోట్లు వచ్చాయా అని అడిగారు. కేసీఆర్‌ను గద్దె దింపితేనే రాష్ట్రంలో మార్పు వస్తుందని, అందుకే యాత్ర చేపట్టినట్టు తెలిపారు.

రేవంత్ వస్తున్నారని రాత్రికి రాత్రే పట్టాలు: సీతక్క

టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి వస్తున్నాడని తెలిసి పోడు భూములకు పట్టాలు ఇస్తామని రాత్రికి రాత్రి చాటింపు వేశారని ములుగు ఎమ్మెల్యే సీతక్క అన్నారు. కాంగ్రెస్ అంటేనే లక్షలాది ఎకరాలు పేదలకు పంచిన పార్టీ అని, అలాంటి పార్టీని అధికారంలోకి తీసుకొచ్చే వరకు చేతిలో చేయి వేసి.. అడుగులో అడుగేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

రేవంత్ రెడ్డి యాత్ర పిలుపుతో ఇంత మంది తరలిరావడం చూస్తుంటే.. కాంగ్రెస్ అధికారంలోకి రావాలని మీలో ఎంత ఉత్సాహం ఉందో అర్థమవుతోందన్నారు. పేదింటి బిడ్డనైన తనని అక్కున చేర్చుకున్నారని.. మూడు తరాలతో అక్కా అని ఆప్యాయంగా పిలిపించుకోవడం ఆనందంగా ఉందని చెప్పారు. మేడారం వనదేవతల ఆలయం నుంచి రేవంత్ రెడ్డి యాత్రను ప్రారంభించడం సంతోషంగా ఉందని సీతక్క అన్నారు. ఈ యాత్రలో ఏఐసీసీ ఇన్‌చార్జ్ మాణిక్ రావ్ ఠాక్రే, ప్రచార కమిటీ చైర్మెన్ మధు యాష్కీ, షబ్బీర్ అలీ, పీసీసీ ఉపాధ్యక్షులు మల్లు రవి, కొండా మురళి, తదితరులు పాల్గొన్నారు.

అదానీకి మరో షాక్!

(మొదటిపేజి తరువాయి)

చేసింది. అనివార్య కారణాల వల్ల ఈ టెండర్‌ను రద్దు చేస్తున్నట్టు మధ్యాంచల్ విద్యుత్ వితరన్ నిగమ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. తాజాగా మరోసారి బిడ్లను ఆహ్వానించింది. ఉత్తరప్రదేశ్‌లోని వేర్వేరు ప్రాంతాలకు విద్యుత్ పంపిణీ చేస్తున్న డిస్కమ్‌లు మొత్తం 2.5 కోట్ల స్మార్ట్‌మీటర్ల కోసం టెండర్లు ఆహ్వానించాయి. దాదాపు రూ.25వేల కోట్లను వెచ్చించి స్మార్ట్‌మీటర్ల ఏర్పాటుకు యోగి సర్కార్ సిద్ధమవుతోంది. స్మార్ట్‌మీటర్ల టెండర్‌పై యూపీ విద్యుత్ వినియోగదారుల ఫోరం మండిపడుతోంది. దొడ్డిదారిన విద్యుత్ సంస్థలను ప్రయివేటుకు కట్టబెట్టే కుట్ర అని ఆరోపించింది.

మధ్యాంచల్, దక్షిణాంచల్, పూర్వాంచల్, పశ్చిమాంచల్..లలోని వివిధ డిస్కమ్‌లు స్మార్ట్ మీటర్లపై టెండర్ ప్రక్రియ చేపట్టాయి. అదానీ గ్రూప్ సహా జీఎంఆర్, ఎల్అండ్‌టీ, ఇంటెల్లీ, స్మార్ట్ ఇన్‌ఫ్రా కంపెనీలు బిడ్లు దాఖలు చేశాయి. ఒక్కో స్మార్ట్‌మీటర్‌ను రూ.10వేలకు అందించేందుకు సిద్ధమని అదానీ గ్రూప్ బిడ్ దాఖలు చేసింది. అయితే ఒక్కో స్మార్ట్‌మీటర్‌ను రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ (ఆర్ఈసీ) రూ.6వేలుగా పేర్కొంది. దీంతో పోలిస్తే అదానీ గ్రూప్ దాఖలు చేసిన మొత్తం చాలా అధికమని పవర్ ఇంజినీర్స్ ఫెడరేషన్స్ పేర్కొంది. ఈనేపథ్యంలో విద్యుత్ పంపిణీ సంస్థ మధ్యాంచల్ విద్యుత్ వితరన్ నిగమ్ మొత్తం టెండర్ ప్రక్రియనే రద్దు చేసింది. బిడ్లు దాఖలు చేసిన నాలుగు కంపెనీలకు ఇప్పటివరకు స్మార్ట్‌మీటర్లు తయారుచేసిన అనుభవం లేకపోవటం గమనార్హం. మిగిలిన డిస్కమ్‌లు సైతం ఇదే విధంగా బిడ్లను రద్దు చేసి, కొత్తగా టెండర్ల ప్రక్రియ చేపట్టే అవకాశముందని వార్తలు వెలువడ్డాయి.

రంగాలు, శాఖలు, పథకాల వారీగా కేటాయింపులు ఇలా...

పంచాయతీరాజ్ శాఖ	31,426
నీటిపారుదల శాఖ	26,885
వ్యవసాయ శాఖ	26,831
విద్యాశాఖ	19,093
విద్యుత్ శాఖ	12,727
వైద్యారోగ్య శాఖ	12,161
పట్టణాభివృద్ధి శాఖ	11,372
హోం శాఖకు	9,599
పరిశ్రమల శాఖ	4,037
రెవెన్యూ శాఖ	3,560
రోడ్లు, భవనాల శాఖ	2,500
మహిళా, శిశు సంక్షేమ శాఖ	2,131
మైనార్టీ సంక్షేమం	2,200
న్యాయశాఖ	1,665
అటవీశాఖ	1,471
పర్యాటక శాఖ	1,117
పాడి, మత్స్యశాఖ	2,071
కార్మిక శాఖ	542
సాధారణ పరిపాలనా శాఖ	1,491
ఐటీ శాఖ	366
రవాణా శాఖ	1,644
షెడ్యూల్ కులాల ప్రత్యేక ప్రగతి నిధి	36,750
షెడ్యూల్ తెగల ప్రత్యేక ప్రగతి నిధి	15,233
బీసీ సంక్షేమం	6,229
దళితబంధు పథకం	17,700
డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు	12,000
ఆసరా పింఛన్లు	12,000
ప్రజాపంపిణీ వ్యవస్థ	3,117
ఆయిల్ పామ్ సాగు	1000
కళ్యాణలక్ష్మి, షాదీముబారక్	3,210
కేసీఆర్ న్యూట్రీషన్ కిట్	200
కొత్తగా నియమితులయ్యే ఉద్యోగుల జీతభత్యాలు	1,000
రైతు రుణమాఫీ	6,385
రైతు బీమా	1,589
గృహ నిర్మాణం	7,890

బడ్జెట్‌లోని కీలకాంశాలు

- తెలంగాణ తలసరి ఆదాయం - రూ.3,17,115 (అంచనా). దేశ తలసరి ఆదాయం(రూ.1,70,620) కంటే 86 శాతం అధికం.
- దక్షిణాది రాష్ట్రాల్లోనే అత్యధికంగా 11.8 శాతం తలసరి ఆదాయ వృద్ధి రేటు నమోదు
- 2019-20లోజీఎస్‌డీపీ వృద్ధి రేటు పెరుగుదల 13.2 శాతం. 18 రాష్ట్రాల కంటే ఇది అధికం. జాతీయ వృద్ధిరేటు 10.2 శాతమే.
- దేశ జీడీపీలో తెలంగాణ జీడీపీ శాతం 4.9 శాతం
- దేశం జనాభాలో తెలంగాణ జనాభా శాతం 2.9 శాతం మాత్రమే. అదే జీడీపిలో వాటా 4.9 శాతం.
- 2015-16 నుంచి 2020 -21 వరకు జీఎస్‌డీపీ వార్షిక వృద్ధి రేటులో తెలంగాణ దేశంలోనే మూడో స్థానంలో ఉంది.
- ఏప్రిల్ నుంచి కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసు క్రమబద్ధీకరణ
- ఏప్రిల్ నుంచి సెర్ప్ ఉద్యోగుల పే స్కేల్ సవరణ
- రాష్ట్రంలో మరో 60 జూని యర్, సీనియర్ సివిల్ జిల్లా జడ్జి కోర్టుల ఏర్పాటు

కేంద్రం ఆటంకాలు..

- ఆర్థిక సామర్థ్యం మేరకు రుణ పరిమితిని 53,970 కోట్లను బడ్జెట్ లో పొందుపర్చగా..కేంద్ర ప్రభుత్వం రూ.15,033 కోట్లకు కోత పెట్టి 38,937 కోట్లు మాత్రమే ఇచ్చింది.
- 2019-20కి సంబంధించి పన్నుల వాటాలో రూ.723 కోట్ల స్పెషల్ గ్రాంట్, పోషకాహార కార్యక్రమాల కు రూ.171 కోట్ల గ్రాంట్ ఇవ్వాలని 15వ ఆర్థిక సంఘం సిఫారసు చేయ గా కేంద్రం మొండి చేయి చూపింది.
- రాష్ట్ర విభజన చట్టం 94(2) ప్రకారం వెనుకబడిన జిల్లా అభివృద్ధి కి ఏడాదికి రూ.450 కోట్లు కేటాయి ంచాలి. కానీ, కేంద్రం మూడేండ్లకు సంబంధించి రూ.1350 కోట్లు ఇవ్వలేదు.

ఏ శ్రమనైనా గౌరవించండి

(మొదటిపేజీ తరువాయి)

పనులనూ ప్రజలు గౌరవించాలని కోరారు. ఉద్యోగాల వెంట పరుగెత్తడం ఆపాలన్నారు. పనిలో చిన్న, పెద్ద ఉండదనీ, అది సమాజం కోసం చేయబడుతుందని భగవత్ చెప్పారు. పని శారిరక శ్రమైనా లేదా మేధస్సుకు సంబంధించిందైనా.. అన్నిటినీ తప్పక గౌరవించాలని తెలిపారు. " మన చుట్టూ ఉన్న ప్రభుత్వ ఉద్యో గాలు పది శాతమే. ఇతర ఉద్యోగాలు 20 శాతం ఉంటాయి. ప్రపంచం లో ఏ సమాజమూ 30 శాతానికి మించి ఉద్యోగాలు సృష్టించలేదు. చేతి శ్రమ అవసరమున్న పనికి ఇప్పటికీ గౌరవం దక్కటం లేదు" అని ఒక కార్యక్రమం లో పాల్గొన్న ఆయన అన్నారు. నైపుణ్యాలు ఉంటే ఉన్నతస్థాయికి చేరు కుంటారనీ, ప్రతి ఒక్కరూ నైపుణ్యాలు పెంచుకోవాలని సూచించారు. కప్పులు కడిగే ఒక వ్యక్తి పాన్ షాపు పెట్టుకొని రూ. 28 లక్షలు సంపాదిం చాడనీ, పనిపై గౌరవం ఉంటే వారు ఉన్నతస్థాయికి చేరుకుంటారని మోహన్ భగవత్ చెప్పారు. అయితే, ఆరెస్సెస్ చీఫ్ చేసిన వ్యాఖ్యలపై దేశంలోని నిరుద్యోగులు, రాజకీయ పార్టీల నాయకుల నుంచి విమర్శలు వచ్చాయి.

ఆర్టీసీకి అన్యాయం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ప్రజల్ని గమ్యస్థానాలకు చేరుస్తున్న టీఎస్‌ఆర్టీసీపై ప్రభుత్వం శీతకన్ను వేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022-23) బడ్జెట్‌లో రూ.1,500 కోట్లు కేటాయించి, మరో రూ.1,500 కోట్లు సర్కారు గ్యారెంటీ రుణాలు ఇపిస్తామని చెప్పిన విషయం తెలిసిందే. కానీ బడ్జెట్‌లో కేటాయించిన రూ.1,500 కోట్లలో కేవలం రూ.600 కోట్లు మాత్రమే ఇప్పటి వరకు విడుదల చేశారు. మిగిలిన సొమ్ము వస్తుందో...రాదో తెలీదు. 2023-24 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో ఆర్టీసీకి కేవలం రూ.1,500 కోట్లు మాత్రమే కేటాయించారు. అదీ సంస్థకు ప్రభుత్వం చెల్లించాల్సిన రీయింబర్స్‌మెంట్‌తో పాటు ఇతర పద్దుల కింద సంస్థకు రావల్సిన సొమ్మే కావడం గమనార్హం. ఈ ఏడాదిలో సర్కారు గ్యారెంటీ రుణాలుగా ఆర్టీసీ రూ.వెయ్యి కోట్లు మాత్రమే తీసుకున్నది. దానికి వడ్డీ సహా అసలు కూడా సంస్థే చెల్లిస్తున్నది. బడ్జెట్ కేటాయింపు ద్వారా రావల్సిన నిధులు రాలేదు. ఫలితంగా సంస్థపై తీవ్ర ఆర్థిక భారం పడుతున్నది. డీజిల్ ధరలు పెరగడంతో నిర్వహణ వ్యయం కూడా పెరిగినట్టు యాజమాన్యం చెప్పింది. దాన్ని కవర్ చేసుకోవడానికి వివిధ సెస్‌ల రూపంలో ప్రయాణీకులపై ఆర్థిక భారం వేసినా, ఇంకా సంస్థ లోటులోనే ఉన్నదని అధికారులు చెప్తున్నారు. ఆర్టీసీకి బడ్జెట్‌లో రెండు శాతం నిధులు కేటాయించాలని కార్మిక సంఘాలు ఏటా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూనే ఉన్నాయి. ప్రయోజనం శూన్యం. ఆర్టీసీ కార్మికులకు 2015లో జరిగిన వేతన సవరణ తర్వాత ఇప్పటి వరకు జీతాలు పెరగలేదు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఈ ఏడాదిలోనే 30 శాతం జీతాలు పెంచిన ప్రభుత్వం, ఆర్టీసీ కార్మికులను మాత్రం పట్టించుకోలేదు. దానితో పాటు సీసీఎస్, ఎస్‌ఆర్‌బీఎస్ సహా పలు రూపాల్లో కార్మికులకు సొమ్ము చెల్లించాల్సి ఉంది. వాటి ఊసు బడ్జెట్‌లోనే లేదు. దీనిపై ఆర్టీసీలోని కార్మిక సంఘాలు తీవ్రంగా స్పందించాయి. టీఎస్‌ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ చైర్మెన్, కన్వీనర్లు కే రాజిరెడ్డి, వీఎస్ రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని తీవ్రంగా ఖండించారు. ఇప్పటికే కార్మికులకు రెండు వేతన సవరణలు ఇవ్వాల్సి ఉంది. వాటి గురించి అతీగతీ లేదు. ఈ ఏడాది కూడా వేతన సవరణ ఉండదని ప్రభుత్వం చెప్పకనే చెప్పినట్టు అయ్యిందని ఆక్షేపించారు. కార్మికుల సహనాన్ని ఇంకా పరీక్షించడం ప్రభుత్వానికి సమంజసం కాదని హెచ్చరించారు.

నేడు డిమాండ్స్ డే

బడ్జెట్‌లో ఆర్టీసీకి నిధుల కేటాయింపులో వివక్షను వ్యతిరేకిస్తూ మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిపోలు, యునిట్లలో డిమాండ్స్ డే బ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహించాలని జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. కార్మికులు ఈ ఆందోళనను విజయవంతం చేయాలని కోరారు. జేఏసీ ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పంచాయతీరాజ్‌శాఖకు ప్రాధాన్యం

- రూ.31,426 కోట్ల కేటాయింపులు
- ఫైనాన్స్ కమిషన్ నిధులు నేరుగా ఖాతాల్లోకి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర బడ్జెట్‌లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు ప్రాధాన్యం లభించింది. ఎస్సీ సంక్షేమ ప్రత్యేక నిధి(రూ36,750 కోట్లు) తర్వాత అత్యధికంగా ఈ శాఖకే కేటాయింపులు దక్కాయి. పంచాయతీరాజ్ శాఖకు మొత్తంగా రూ.31,426కోట్ల కేటాయిం పులు జరిగాయి. విడిగా చూసినప్పుడు పంచాయతీరాజ్ శాఖ నిర్వహణ పద్దుకు రూ.9,072.34 కోట్లు, ప్రగతి పద్దుకు రూ.52 96.89 కోట్లు దక్కాయి. గ్రామీణాభివృద్ధికి నిర్వహణ పద్దు కింద రూ.58.91 కోట్లు, ప్రగతి పద్దు కింద 12,434.30 కోట్లను కేటాయించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నుంచి విడుదల చేసే పట్టణ, పల్లె ప్రగతి నిధులతో పాటు ఫైనాన్స్ కమిషన్ నిధులను కూడా నేరుగా స్థానిక సంస్థల ఖాతాల్లోకి బదిలీ చేయనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటిం చింది. ఈ సంస్కరణ వల్ల స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ఫైనాన్స్, ట్రెజరీల ఆమోదం కోసం వేచి చూడకుండా, స్వతంత్రంగా నిధులు వినియోగించుకునే అవకాశం కలుగబోతుందని మంత్రి హరీశ్‌రావు సభలో చెప్పారు. ప్రతి ఏటా పంచాయతీరాజ్ శాఖకు భారీ ఎత్తున నిధులు కేటాయింపులు జరుగుతున్నా తమకేమీ పెద్దగా ఉపయోగపడటం లేదని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది బడ్జెట్‌లో ఎంపీటీసీ, జెడ్పీటీసీలకు ప్రత్యేకంగా బడ్జెట్‌లో రూ.500 కోట్లు కేటాయించిన సంగతి తెలిసిందే. కానీ, వాస్తవానికి రాష్ట్ర ప్రభుత్వం అందులో రూ.250 కోట్లను మాత్రమే విడుదల చేసిందనీ, తమకు ఎలాంటి సంబంధం లేకుండా విద్యాకమిటీ ద్వారా మన ఊరు-మనబడి పథకానికి ఖర్చుపెడు తున్నారని ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు వాపోతున్నారు. స్థానిక సంస్థలకు ఇచ్చే నిధులను ఫ్రీజింగ్‌లో పెట్టకుండా, నెలల తరబడి పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు విడుదల చేయాలని ప్రజా ప్రతినిధులు వేడుకుంటున్నారు. పింఛన్ల కోసం ఆసరా పథకానికి రాష్ట్ర ప్రభుత్వం ఏటా నిధులను పెంచుకుంటూ పోతున్నది. గత బడ్జెట్‌లో ఆసరాకు రూ.11,728 కోట్లు కేటాయించగా...ఈసారి దాన్ని రూ.12 వేల కోట్లకు పెంచింది.

దారులన్నీ పెద్దగట్టువైపు

పోటెత్తిన సందర్శకులు

- సోమవారం స్వామివారిని దర్శించుకున్న ఐదు లక్షల మంది
- నేడు చంద్రపట్నం



నవతెలంగాణ- చివ్వెంల

సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలంలోని దురాజ్‌పల్లి లింగమంతుల స్వామి(పెద్దగట్టు) జాతరకు సందర్శకులతో పోటెత్తింది. రెండోరోజు సోమవారం సుమారు ఐదు లక్షల మందికి పైగా స్వామి వారిని దర్శించుకున్నారని అంచనా. ఆదివారం అర్ధరాత్రి నుంచి జాతర ప్రారంభం కాగా, సోమ వారం ఆలయ పరిసరాలు జనంతో కిక్కిరిశాయి. ఆదివారం అర్ధరాత్రి పెద్దగట్టుకు దేవరపెట్టె చేరుకున్న తర్వాత సోమ వారం ఉదయం సమయంలో సౌడమ్మ, యలమంచమ్మ, ఆకు మంచమ్మ దేవతలకు బోనాలు సమర్పించారు. సాయంత్రం మద్దెలపోలు పోశారు. యాదవ పూజారులు పోలు ముంతలు, బొట్లు, కంకణ అలంకరణ చేశారు. అనంతరం స్వామివారి కొలుపు చెప్పారు. దురాజ్‌పల్లి చుట్టుపక్కల ఐదు కిలో మీటర్ల మేర ట్రాక్టర్లు, గుడారాలు వేసుకొని వంటలు వండు కున్నారు. దురాజ్‌పల్లి, కాశీంపేట, కలెక్టరేట్ వరకు జనసందడి కనిపించింది. పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు నిర్వహించారు. జాతర మంగళ వారం చంద్రపట్నం వేస్తారు. ఉదయం యాచకులతో కలిసి రాజులు, పూజారులు గుడి ప్రాంగణంలో చంద్రపట్నం వేసి భైరవుడికి పోలుపోస్తారు.

స్వామి వారిని దర్శించుకున్న ప్రజాప్రతినిధులు

లింగమంతుల స్వామిని మంత్రులు గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, శ్రీనివాస్, రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్యయాదవ్, తెలంగాణ షీప్ అండ్ గోట్ డెవలప్‌మెంట్ కార్పొ రేషన్ చైర్మెన్ దూదిమెట్ల బాలరాజు యాదవ్, మాజీ మంత్రి ఈటల రాజేందర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వీరిని దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో సన్మానించారు. టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, స్వామి వారిని దర్శించు కున్నారు.

తాగునీటికి కటకట

గుట్టపైన సందర్శకుల స్నానాల కోసం షవర్లు ఏర్పాటు చేశారు. అయితే, తాగు నీటి సమస్య ఏర్పడింది. నీటి కోసం సందర్శకులేగాక పోలీసు, ఇతర శాఖల అధికారులు సైతం అల్లాడారు. కొత్తగా నిర్మించిన కోనేటి మధ్యలో శివుడి విగ్రహం ఆకర్షణీయంగా నిలిచింది.

ఏరులై పారిన మద్యం

జాతరలో మద్యం ఏరులై పారింది. జాతర సమీపంలో దురాజ్‌పల్లి, రాంకోటితండా, మున్యా నాయక్ తండా, ఖాశీంపేట, వల్లభాపురం గ్రామాల్లో మద్యం అమ్మకాలు జోరుగా సాగాయి. దురాజ్‌పల్లి లోని కిరాణా, కూల్‌డ్రింక్స్ దుకాణాలు, పలు హోటళ్లలో సైతం మద్యం విక్రయాలు సాగాయి. అంతేకాక మద్యాన్ని అధిక ధరలకు విక్రయించారు.

బడ్జెట్‌లో భారీ అంకెలు

(మొదటిపేజీ తరువాయి)

పడుతున్నారు. 50 శాతం పైనున్న బీసీలకు కేటాయించింది కేవలం రూ.6వేల కోట్లు. 8 ఏండ్లలో ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు పక్కదారి పట్టాయి. ఓల్డ్ పెన్షన్ స్కీమ్ గురించి బడ్జెట్‌లో ప్రస్తావన లేదు. ఉద్యోగులు నష్టపోతున్నారు. నిరుద్యోగ భృతి మాటే ఎత్తలేదు. లిక్కర్ తప్ప దేనిలోనూ రాష్ట్ర అభివృద్ధి కన పడటం లేదు. కొద్ది మంది అధికారులు రాసిస్తే.. భారీ బడ్జెట్ అని ఎన్నికలకు ముందు చెప్పే ప్రయత్నం ఇది. నీళ్లు, నిధులు, నియామకాలు, ఆత్మగౌరవం లేదు. రెసిడెన్షియల్ స్కూళ్లకు సొంత భవనాలు లేవు. వాటికి నిధులు కేటా యిస్తారని అనుకున్నాం. మంత్రి హరీశ్‌రావు మాటలతో మేడి పండు బడ్జెట్ ప్రవేశపెట్టారు.

సీబీఐకి ఎమ్మెల్యేల ఎర కేసు

- హైకోర్టు ధర్మాసనం తీర్పు
- ప్రభుత్వ పిటిషన్ తిరస్కరణ

నవతెలంగాణ - హైదరాబాద్

రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఎమ్మెల్యేల ఎర కేసు దర్యాప్తును సీబీఐకి బదిలీ చేస్తూ సింగిల్ జడ్జి గతంలో ఇచ్చిన తీర్పును హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం ఆమోదిస్తూ సోమవారం తీర్పు చెప్పింది. డివిజన్ బెంచ్ తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేస్తామనీ, అప్పటి వరకు తీర్పును సస్పెండ్ చేయాలన్న ప్రభుత్వ వినతిని తిరస్కరించింది. పిటిషన్ సాధారణమైనదే అయినా అందులోని అంశాలన్నీ క్రిమినల్ కేసుకు చెందినవేననీ, ఆ అంశాలపైనే సింగిల్ జడ్జి తీర్పు వెలువరించారని గుర్తు చేసింది. ఈ నేపథ్యంలో క్రిమినల్ కేసులో అప్పీల్ దాఖలుకు హైకోర్టు పరిధి కాదనీ, సుప్రీంకోర్టులో అప్పీల్ దాఖలు చేసుకోవాలని తీర్పులో స్పష్టం చేసింది. క్రిమినల్ కేసులో హైకోర్టు సింగిల్ జడ్జి తీర్పు వెలువరించాక దానిపై హైకోర్టు డివిజన్ బెంచ్ వద్ద అప్పీల్‌కు ఆస్కారమే లేదని తెలిపింది. అందుకే ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీళ్లను అనుమతించడం లేదని వివరించింది. రిట్ అప్పీళ్లను ఆమోదించనందున కేసులో మెరిట్ అంశాల జోలికి వెళ్లడం లేదని స్పష్టం చేసింది. సింగిల్ జడ్జి తీర్పులో జోక్యం చేసుకోవడం లేదని తెలిపింది. సింగిల్ జడ్జి ఉత్తర్వులపై రిలీఫ్ కోరుతూ సమర్పించిన రాతపూర్వక వాదనలను కూడా పరిగణనలోకి తీసుకున్నాకే తీర్పు చెబుతున్నట్టు వివరించింది. సింగిల్ జడ్జి వద్ద పిటిషన్ విచారణ అంతా పోలీసులు నమోదు చేసిన క్రిమినల్ కేసుపైనేననీ, ఆ అప్పీల్ పరిధి హైకోర్టు ద్విసభ్య ధర్మాసనానికి ఉండదనీ, సుప్రీంకోర్టుకే ఉంటుందని రామ్ కృష్ణన్ ఫౌజి కేసులో సుప్రీం తీర్పు చెప్పిందని గుర్తు చేసింది. ఆ తీర్పునకు లోబడే అప్పీళ్లను తిరస్కరిస్తున్నట్టు చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీల డివిజన్ బెంచ్ సోమవారం తీర్పు చెప్పింది. చార్జిషీట్ దాఖలు చేయడానికి ముందే నిందితులను దోషులుగా చిత్రీకరించే ప్రయత్నం జరిగిందంటూ సింగిల్ జడ్జి తీర్పులో పేర్కొన్నారనీ, అందుకే పోలీస్ దర్యాప్తును రద్దు చేసి, సీబీఐ దర్యాప్తునకు ఆదేశించారని గుర్తు చేశారు సుప్రీంకోర్టుకు అప్పీల్ చేస్తామంటూ అప్పటివరకు సీబీఐ విచారణపై స్టే ఇవ్వాలని అడ్వకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ అభ్యర్థించారు. అందుకు హైకోర్టు నిరాకరించింది. సీబీఐ ఈ కేసు విచారణకు స్వీకరించేందుకు అనుమతి ఇచ్చింది. సింగిల్ జడ్జి తీర్పు తర్వాత సీబీఐ దర్యాప్తు చేపట్టకుండా డివిజన్ బెంచ్ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను ఎత్తేసింది. దీంతో సీబీఐ దర్యాప్తునకు మార్గం సుగమమయ్యింది.

ఎమ్మెల్యేల ఎర కేసులో సిట్ దర్యాప్తును రద్దు చేసి సీబీఐకి బదిలీ చేస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం, సిట్, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఇతరులు హైకోర్టులో జనవరి నాలుగో తేదీన అప్పీళ్లను దాఖలు చేశాయి. జనవరి 18 వరకు వాదనలు జరిగాయి. అదేనెల 30 వరకు రాతపూర్వక వాదనలకు హైకోర్టు అనుమతి ఇచ్చింది. తీర్పు రిజర్వులో పెట్టిన హైకోర్టు సోమవారం కీలక తీర్పు చెప్పింది. ప్రభుత్వం తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది దుష్యంత్ దవే, నిందితుల తరఫున సీనియర్ న్యాయవాదులు డీవీ సీతారాంమూర్తి, ఎస్‌డీ సంజయ్ తివారీ, ఉదయ హొల్లా, జె ప్రభాకర్ ఇతరులు వాదించారు.

'పోలీసులు ఎఫ్ఐఆర్ దాఖలు చేసిన 12 గంటల్లోనే దర్యాప్తు ఏకపక్షంగా జరిగిందంటూ బీజేపీ రిట్ దాఖలు చేయడం ఆశ్చర్యంగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వ పర్యవేక్షణలోని సిట్ దర్యాప్తుపై సందేహాలు వ్యక్తం చేస్తున్నారని, కేంద్ర ప్రభుత్వ పరిధిలోని సీబీఐకి కేసును బదిలీ చేస్తే తమకు కూడా అలాంటి సందేహాలే వస్తాయి. సీబీఐ అవసరం లేదు. సిట్‌నే కొనసాగించాలి. పోలీసుల దర్యాప్తు ఏకపక్షంగా ఉందని ఆందోళన వ్యక్తం చేస్తే సరిపోదు. వాటికి ఆధారాలు కూడా చూపాలి. నిందితులు సిట్ దర్యాప్తును రద్దు చేయాలని క్రిమినల్ పిటిషన్ వేయలేదు. కాబట్టి హైకోర్టు డివిజన్ బెంచ్ వద్దనే అప్పీల్ దాఖలు చేయవచ్చు'అని ప్రభుత్వం, సిట్ వాదనలను హైకోర్టు తోసిపుచ్చింది. పోలీసులు నమోదు చేసింది క్రిమినల్ కేసు కాబట్టి సింగిల్ జడ్జి సీబీఐ దర్యాప్తు ఉత్తర్వులపై అప్పీల్ హైకోర్టులో చేయరాదనీ, సుప్రీంకోర్టులో చేయాలన్న రామచంద్రభారతి ఇతర నిందితుల వాదనను ఆమోదిస్తూ తీర్పు చెప్పింది.

మ్యానిఫెస్టో హామీలు అమలు చేయాలి : సీపీఐ

(మొదటిపేజీ తరువాయి)

గిరిజనులకు గిరిజన బంధు ఇవ్వాలని కోరారు. ఉద్యోగ నియామక ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలనీ, ఎలక్షన్ మేనిఫెస్టోలో పెట్టిన ప్రకారం నిరుద్యోగులకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. వ్యక్తి కేంద్రీకరణగా నిధులు కేటాయించాలనీ, ఇండ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలనీ, యూనివర్శిటీలు, పాఠశాలలకు నిధులు పెంచాలనీ, పంటల బీమా అమలు, కౌలు రైతులకు సంక్షేమ పథకాలు అందించాలని కోరారు. పాలమూరు-రంగారెడ్డి, జూరాల, నెట్టెంపాడు, కల్వకుర్తి ప్రాజెక్టులకు నిధులు పెంచాలని చెప్పారు. బీజేపీయేతర రాష్ట్రాల కంటే తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ ప్రగతిశీలమైందనీ, అమల్లో ప్రభుత్వం విఫలమైతే వ్యతిరేక బడ్జెట్ అని విశ్లేషించారు.

ప్రగతి నిరోధకం-ఎమ్‌సీపీఐ(యూ)

రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రగతి నిరోధక బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందనీ, దీనితో కేసీఆర్ ఓటమి ఖాయమని ఎమ్‌సీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ అభిప్రాయపడింది. ఈ మేరకు ఆపాటూర్ద రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి సోమవారంనాడొక పత్రికా ప్రకటన విడుదల చేశారు. పూర్తి జిమ్మిక్కులతో ఉన్న ఈ బడ్జెట్‌ను తాము వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు. అంకెల గారడీ తప్ప చిత్తశుద్ధి లేదన్నారు. సకలజనుల సర్వేలో తేలిన బీసీ జనాభా సంక్షేమానికి కేవలం రూ. 6,229 కోట్లు కేటాయించటం సరికాదన్నారు. సీఎం కేసీఆర్ బీజేపీ మనువాద నియంతృత్వంపై పోరాటం చేస్తున్నట్టైతే, బడ్జెట్లో బీసీలకు 30 శాతం నిధులు కేటాయించి, బీసీ సబ్‌ప్లాన్ తెచ్చి, బీసీ కార్పొరేషన్ ద్వారా అభివద్ధి చేయాలన్నారు. మహిళల అభివృద్ధికి కేటాయింపులు సరిగా లేవన్నారు. విద్య, వైద్యరంగాలకు కేటాయింపులు చాలవన్నారు.

ఎన్నికల దారిలో.. హరీశ్ పద్దు...

- నాలుగు శాఖలు.. నాలుగు అంశాలకే అత్యధిక నిధులు
- ప్రజాకర్షణే లక్ష్యంగా కేటాయింపులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ముందస్తు ఎన్నికలు వస్తాయో లేదో తెలియదు గానీ...సోమవారం ప్రవేశపెట్టిన బడ్జెట్ మాత్రం అదే సంకేతాలను ఇస్తున్నది. ఆర్థిక మంత్రి హరీశ్‌రావు 2023-24 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన రూ.2,90, 396 కోట్ల పద్దులో అత్యధిక భాగం నాలుగు శాఖలు, నాలుగు అంశాలకే దక్కాయి. అవన్నీ పూర్తిగా ప్రజాకర్షణతో కూడుకున్నవే కావటం గమనార్హం. ముఖ్యంగా ఆసరా పింఛన్ల కోసం రూ.12 వేల కోట్లు, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ కోసం రూ.3,210 కోట్లు, రైతు బంధుకు రూ.15,075 కోట్లు, విద్యుత్ సబ్సిడీల కోసం రూ.12 వేల కోట్లను కేటాయించారు. ఈ నాలుగింటికి కలిపి రూ.42,285 కోట్లు అవుతున్నాయి. మొత్తం బడ్జెట్‌లో ఇది 14.56 శాతంగా ఉంది. మరోవైపు దళిత బంధు కోసం రూ.17,700 కోట్లను కేటాయించారు. పై నాలుగింటికి కేటాయించిన నిధులతో దళిత బంధు కేటాయింపులను కలిపితే మొత్తం రూ.59,985 కోట్లు అవుతున్నాయి. ఈ రకంగా మొత్తం పద్దులో ఇవన్నీ కలిపి 20.66 శాతంగా నమోదయ్యాయి. అంటే వీటికి ప్రభుత్వం ఎంత ప్రాధాన్యతనిచ్చిందో విదితమవుతున్నది.

మరోవైపు పంచాయతీరాజ్ శాఖకు రూ.31,426 కోట్లు, షెడ్యూల్ కులాల ప్రత్యేక ప్రగతి నిధికి రూ.36,750 కోట్లు, నీటిపారుదల శాఖ రూ.26,885 కోట్లు, వ్యవసాయ శాఖకు రూ.26,831 కోట్లను ప్రతిపాదించారు. ఈ నాలుగింటికి కలిపి మొత్తం రూ.1,21,892 కోట్లను కేటాయించారు. ఆ రీత్యా చూసినప్పుడు రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే తమకు అవసరమైన కొన్ని ప్రాధాన్యతా రంగాలు, శాఖలకు ప్రభుత్వ పెద్దలు అధిక నిధులను వెచ్చించినట్టు ఆర్థిక, రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

ఉభయ సభలు బుధవారానికి వాయిదా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

శాసనసభ, మండలి బుధవారానికి వాయిదా పడ్డాయి. మంత్రులు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి ఉభయ సభల్లో పద్దును ప్రతిపాదించిన అనంతరం... శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి, మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆయా సభలను బుధవారానికి వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. బీఏసీల్లో నిర్ణయం ప్రకారం... మంగళవారం శాసనసభ, మండలికి సెలవు ప్రకటించారు.

కేటాయింపులు సరే.. ఖర్చెందుకు చేయరు?

సంక్షేమం పట్ల నిర్లక్ష్యం తగదు : పలు ప్రజాసంఘాల విమర్శ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రతి ఏటా ఆయా తరగతుల సంక్షేమం కోసం బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తున్నప్పటికీ..వాటిని ఖర్చు చేయటంలో సర్కారు నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నదని పలు ప్రజాసంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. సోమవారం శాసన సభలో ఆర్థిక శాఖా మంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రవేశ పెట్టిన 2023-24 బడ్జెట్‌పై పలు ప్రజాసంఘాలు తమ నిరసనను వ్యక్తం చేశాయి.

60శాతం నిధులు ఖర్చు చేయటం లేదు..:కేవీపీఎస్

ఎస్సీ ప్రత్యేక అభివృద్ధి నిధి కింద గతేడాది రూ.33,907కోట్ల కేటాయించగా.. ఈ ఏడాది రూ. 36,750 కోట్లు కేటాయించారని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జాన్‌వెస్లీ, టి స్కైలాబ్‌బాబు తెలిపారు. దళిత సంక్షేమానికి 2022-2023లో రూ.31,770కోట్ల కేటాయించగా ఈ ఏడాది రూ.34,475 కోట్లు కేటాయిం చారని పేర్కొన్నారు. ఈ మొత్తం కేటాయింపుల్లో 60 శాతం కూడా ఖర్చు చేయలేదని తెలిపారు. కేటాయించిన నిధుల్ని ఖర్చు చేయకుండా దళిత సాధికారత ఎలా సాధ్యమని ప్రశ్నించారు. దళిత బంధు కోసం గతేడాది కేటాయించిన రూ.17,700కోట్లు ఖర్చు చేయలేదనీ, ఈ ఏడాది కూడా రూ.17,700 కేటాయింపులు చూపారనీ, నియోజకవర్గానికి 1100మందికి దళిత బంధు ఇస్తామన్నారనీ, ఆచరణలో అమలు చేయాలని డిమాండ్ చేశారు.

వికలాంగుల సంక్షేమంపట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం:ఎన్‌పీఆర్‌డీ

వికలాంగుల సంక్షేమం పట్ల సర్కారు నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నదని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక(ఎన్‌పీఆర్‌డీ) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె వెంకట్, ఎం అడివయ్య విమర్శించారు. 2016 ఆర్‌పీడీ చట్టం ప్రకారం రూ.10,584.25 కోట్లు కేటాయించాలని గుర్తు చేశారు. (ఐదు శాతం ప్రకారం) గతేడాది రూ. 89 కోట్లు మాత్రమే కేటాయించిందనీ, ప్రస్తుత బడ్జెట్‌లో మొండి చేయి చూపారని ఆందోళన వ్యక్తం చేశారు. మానసిక వికలాంగుల సంరక్షణ కోసం ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో బడ్జెట్ ప్రసంగంలో లేదని పేర్కొన్నారు. వికలాంగుల వివాహ ప్రోత్సాహకం, స్వయం ఉపాధి రుణాలకు, పరికరాల కోసం నిధులు కేటాయించలేదని తెలిపారు. వికలాంగుల సంక్షేమ శాఖలో ఉద్యోగ నియామకాల గురించి బడ్జెట్‌లో ప్రస్తావించలేదని పేర్కొన్నారు.

గీత కార్మికులకేది భరోసా..? : టీజీకేఎస్

గీత కార్మికుల సంక్షేమం కోసం రూ.100 కోట్లు కేటాయిస్తామనీ, టాడి కార్పొరేషన్ కోసం రూ. గతేడాది రూ.30 కోట్లు కేటాయించి, ఒక్క పైసా కూడా ఖర్చు చేయలేదని తెలంగాణ గీత కార్మిక సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎంవీ రమణ, బెల్లంకొండ వెంకటేశ్వర్లు తెలిపారు. ఐదు లక్షల కుటుంబాలు ఆధారపడి బతుకుతున్న గీత వృత్తిని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ఆరోగ్య బడ్జెట్ గణనీయం..: డాక్టర్ సునీల్‌కుమార్

రాష్ట్ర బడ్జెట్‌లో ఆరోగ్య బడ్జెట్‌ను గణనీయంగా పెంచారని నిజామాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాల శస్త్ర విభాగాధిపతి డాక్టర్ సునీల్ కుమార్ తెలిపారు. బడ్జెట్‌లో 4.18శాతం కేటాయిస్తూ మంత్రి న్విహించిన నెలవారి సమీక్షలో తేలిన అంశాలకు ప్రాధాన్యత ఇచ్చారని అభిప్రాయం వ్యక్తం చేశారు.

వైద్య ఆరోగ్య రంగానికి న్యాయం జరగలే.. టీయుఎంహెచ్‌యు

రాష్ట్ర బడ్జెట్‌లో వైద్యారోగ్య రంగానికి తగిన న్యాయం జరగలేదని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (టీయుఎంహెచ్‌యూ) గౌరవాధ్యక్షులు భూపాల్,రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహమ్మద్ ఫసియుద్దీన్, కె యాదానాయక్ తెలిపారు. కనీసం పది శాతం కేటాయించాల్సి ఉండగా కేవలం 4.18 శాతం మాత్రమే కేటాయించటం శోచనీయమన్నారు.

కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు పెంచేందుకు నిధులు పెంచలే.. హెచ్‌ఆర్‌డీఏ

జనాభాకు తగినట్టుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు పెంచేందుకు ఆరోగ్య బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదని హెల్త్ కేర్ రిఫార్మ్ డాక్టర్స్ అసోసియేషన్(హెచ్‌ఆర్‌డీఏ) అధ్యక్షులు డాక్టర్ కె మహేశ్‌కుమార్ విమర్శించారు.

చేతి వృత్తిదారులకు చేయూత లేదు.. వృత్తిదారుల సంఘం

చేతి వృత్తిదారులకు చేయూతనందించాల్సిన కార్పొరేషన్లకు, ఫెడరేషన్లకు నామమాత్రంగా కేటాయింపులు చేయటం శోచనీయమని వృత్తిదారుల సమన్వయ కమిటీ కన్వీనర్ ఎంవీ రమణ పేర్కొన్నారు. బీసీ సంక్షేమానికి రూ. 6,229 కోట్లు కేటాయించారనీ, విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ తదితర వాటికి వాటిని ఖర్చు చేస్తే.. కార్పొరేషన్లు, ఫెడరేషన్ల సంగతేంటని ప్రశ్నించారు. కల్లుగీత , రజక,నాయి బ్రాహ్మణ, వడ్డెర, విశ్వ బ్రాహ్మణ, పూసల, బట్రాజ్, ఉప్పర, బోయ, కుమ్మరి, మేదర కార్పొరేషన్లు, ఫెడరేషన్లకు 10 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.

సేవా వృత్తుల పట్ల వివక్ష..:రజక వృత్తిదారుల సంఘం

సేవా వృత్తులకు బడ్జెట్ కేటాయింపుల్లో వివక్ష కొనసాగుతున్నదని రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి నరేశ్, పి ఆశయ్య తెలిపారు. రజక,నాయి బ్రాహ్మణ వృత్తి దారులకు కేవలం ఉచిత విద్యుత్తును అందిస్తున్నామని ప్రకటన చేసి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. సంక్షేమాభివద్ధికి నిధుల కేటాయింపులు ప్రస్తావనే లేకపోవడం శోచనీయమన్నారు. ఎంబీసీ కార్పొరేషన్ల ప్రస్తావన లేకపోవటం ఆందోళన కలిగిస్తున్నదని పేర్కొన్నారు.

గిరిజన బంధు ఊసే లేదు..:టీజీఎస్

బడ్జెట్‌లో గిరిజన బంధును విస్మరించడం అన్యాయమని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం ధర్మానాయక్, ఆర్ శ్రీరాంనాయక్ విమర్శించారు. గిరిజన జనాభా నిష్పత్తి ప్రకారం ప్రతి ఏటా 29శాఖలు కలిపి గిరిజన ప్రత్యేక అభివృద్ధి నిధి పద్దు కింద గతేడాది రూ.13,412 కోట్లు కేటాయించగా ఈ ఏడాది 2023-24 లో 15,233 కోట్లు కేటాయించారని తెలిపారు. కేటాయింపులు పెరిగినట్టు కనపడినా నేరుగా గిరిజనులకు లబ్ది జరిగే శాఖల్లో మాత్రం కేటాయింపులు తక్కువగా చూపారని తెలిపారు. అభివృద్ధి సంక్షేమానికి ఖర్చు చేసే గిరిజన సంక్షేమ శాఖకు మాత్రం కేవలం రూ.3,965 కోట్లు మాత్రమే కేటాయించి చేతులు దులుపుకుందని విమర్శించారు.

మైనారిటీల సబ్‌ప్లాన్ హామీ నిలబెట్టుకోవాలి..:ఆవాజ్

మైనారిటీల సంక్షేమానికి బడ్జెట్ కేటాయింపులు రూ. 5వేల కోట్లకు పెంచాలనీ, సబ్ ప్లాన్ హామీ నిలబెట్టుకోవాలని ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అబ్బాస్ డిమాండ్ చేశారు. మైనారిటీ సంక్షేమానికి కేవలం రూ.2,200 కోట్లు మాత్రమే కేటాయించడం విచారకరమని తెలిపారు. గత బడ్జెట్ లో కేటాయించిన రూ.1,702 కోట్లు పూర్తిగా ఖర్చు చేయలేదనీ, ఈ బడ్జెట్‌లో కేటాయింపులు పెద్దగా పెంచలేదని విమర్శించారు.

విద్యారంగం పట్ల నిర్లక్ష్యం తగదు..:ఎస్ఎఫ్ఐ

విద్యారంగానికి తగిన విధంగా కేటాయింపుల చేయటంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్‌ఎల్ మూర్తి, టి నాగరాజు ఆందోళన వ్యక్తం చేశారు. 6.57శాతం మాత్రమే కేటాయించి చేతులు దులుపుకున్నదని విమిర్శించారు. పాఠశాల విద్యాశాఖకు కేవలం 5.54 శాతం, ఉన్నత విద్యకు ఒక్క శాతం మాత్రమే కేటాయించటం శోచనీయమన్నారు.

సంతృప్తికరంగా నిధులు కేటాయించలేదు: టీఎస్‌యూటీఎఫ్

విద్యారంగానికి కేటాయించిన నిధులు సంతృప్తి కరంగా లేవని టీఎస్‌యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె జంగయ్య, చావ రవి తెలిపారు. గత బడ్జెట్‌లో కేటాయింపులను ఖర్చు చేయలేదని గుర్తు చేశారు. విద్యారంగాన్ని అభివృద్ధి చేయటానికి ఈ నిధులు సరిపోవనీ, ఇంగ్లీషు మీడియం కోసం ప్రత్యేకంగా ఉపాధ్యాయులు, మౌలిక వసతుల కల్పనకోసం కేటాయింపులు లేవని గుర్తుచేశారు.

ఉపాధ్యాయులపై చిన్నచూపు..:టీఎస్‌టీసీఈఏ

ప్రయివేటు ఉపాధ్యాయ, అధ్యాపకులపై చిన్న చూపు తగదని టీఎస్‌టీసీఈఏ అధ్యక్షులు అయినేని సంతోష్‌కుమార్ తెలిపారు. విద్యాశాఖకు 6.57శాతం నిధులు ఎలా సరిపోతాయని ప్రశ్నించారు.పాఠశాల విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా మధ్యాహ్నం భోజనం రేట్లపై ఆలోచన చేయాలని కోరారు.

ప్రాధాన్యతా రంగాన్ని విస్మరించటం తగదు:డీటీఎఫ్

ప్రాధాన్యతా రంగమైన విద్యారంగాన్ని మరోమారు బడ్జెట్‌లో ఆనవాయితిగా విస్మరించిందని డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం సోమయ్య, టి లింగారెడ్డి విమర్శించారు. రాష్ట్ర అభివృద్ధిలో దేశం ముందుందనీ, సంక్షేమంలో స్వర్ణయుగాన్ని సృష్టించిందని చెబుతూ కీలకమైన విద్యారంగాన్ని విస్మరించటమేంటని ప్రశ్నించారు.

మన ఊరు మన బడిని మరిచింద్రు:టీపీటీఎఫ్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మన ఊరు మన బడిని మరిచిపోయిందని టీపీటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై అశోక్‌కుమార్, ముత్యాల రవీందర్ తెలిపారు. ప్రతిష్టాత్మకంగా తీసుకుని అమల్లోకి తెచ్చిన మన ఊరు మన బడి కోసం అదనపు కేటాయింపులు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలి.. పీడీఎస్‌యూ

బడ్జెట్‌ను సవరించి విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణ, ఆజాద్ డిమాండ్ చేశారు. విద్యారంగం పట్ల ఇంత నిర్లక్షమేంటని మరో పీడీఎస్‌యూరాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎం పరుశురాం, విజయ్‌కన్నా ప్రశ్నించారు.

విద్యా,వైద్యం పట్ల నిర్లక్ష్యం తగదు:పౌర స్పందన వేదిక

రాష్ట్ర బడ్జెట్‌లో విద్య, వైద్య రంగాలకు ఆశించిన మేర కేటాయింపులు లేకపోవడం విచారకరమని పౌరస్పందన వేదిక అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అలుగుబెల్లి నర్సిరెడ్డి,ఎం రాదేశ్యాం ఆందోళన వ్యక్తం చేశారు. బడ్జెట్‌లో విద్యకు 24 శాతం, వైద్యానికి 12శాతం నిధులు కేటాయించాలని కోరుతూ తెలంగాణ పౌరస్పందన వేదిక ప్రజల సంతకాలతో కూడిన వినతి పత్రాన్ని ఆర్థిక మంత్రికి అందజేశామనీ, అయినా ఫలితం లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు.

విద్యారంగాన్ని విస్మరించింది..:ఏఐఎస్ఎఫ్

విద్యారంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని ఏఐఎస్ఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్ విమర్శించారు. నిరుద్యోగ భృతి అమలుకు నోచుకోని బడ్జెట్‌గా మిగిలి పోయిందని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వలిఉల్లాఖాద్రి, కె ధర్మేంద్ర ఆందోళన వ్యక్తం చేశారు.

చరిత్రలో రికార్డు..:ప్రజారోగ్య సంచాలకులు

రాష్ట్ర బడ్జెట్‌లో చరిత్రలో రికార్డు స్థాయి కేటాయింపులు జరిగాయని ప్రజారోగ్య సంచాలకులు గడల శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్, ఆర్థిక మంత్రి హరీశ్‌రావుకు ధన్యవాదాలు తెలిపారు.

నిరుద్యోగుల పట్ల నిర్లక్ష్యం తగదు..:డీవైఎఫ్ఐ

రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు ఉపాధి పొందేవరకు రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పిందనీ, ఎనిమిదేండ్లు గడుస్తున్నా..హామీ అమలు నోచుకోలేదని డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోట రమేశ్, అనగంటి వెంకటేశ్ విమర్శించారు. ఈ ఏడాది బడ్జెట్‌లోనైనా తగిన నిధులు కేటాయిస్తారని యువత ఆశగా ఎదురు చూసిందని వారిని మోసం చేయడం తగదని హితవు పలికారు.



నాగలికి నానాఅవస్థలేనా?

రైతు బంధే సర్వరోగ నివారిణా?

- అనుబంధ రంగాలకు బడ్జెట్‌లో నామమాత్రమే



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

వ్యవసాయం' అందడం లేదు. అన్నింటికి రైతు బంధు పథకమే సర్వరోగ నివారిణి అన్నట్టుగా బడ్జెట్‌లో చూపించింది. ప్రభుత్వం డబ్బులు ఇవ్వడంతోనే అన్నదాత కష్టాలు తీరవు. సన్న, చిన్నకారు రైతులకు జీవనాధారమైన అనుబంధ రంగాలను పట్టించుకోలేదు. ఇప్పటికే వ్యవసాయం చేయలేక నానా అవస్థలు పడుతున్న రైతన్నకు ఈ బడ్జెట్ కూడా ఊరటనివ్వలేదు. గత రెండేండ్లుగా అధిక వర్షాలు పడి లక్షల ఎకరాల్లో పంటలు పాడయ్యాయి. ఒక్కొక్కసారి రెండుసార్లు విత్తనాలు వేయాల్సి వచ్చింది. దీంతో రైతులు తీవ్రమైన అప్పుల బారిన పడ్డారు. కానీ బడ్జెట్ (2023-24) ప్రకృతి విపత్తులకు నిధులు కేటాయించలేదు. దీంతో రైతులకు నష్టపరిహారం అండడం లేదు. పైగా దిగుబడులు తగ్గాయి. పలు దఫాలుగా సాగు చేయడం వలన విత్తనాలు, ఎరువుల, ఇతర అవసరాల కోసం అన్నదాతలు చేసిన అప్పులకు ఈ బడ్జెట్ భరోసా ఇవ్వలేదు. రాష్ట్ర బడ్జెట్‌లో రైతు బంధుకు రూ.15075 కోట్లు కేటాయించింది. గతేడాది కంటే ఈసారి మరో రూ 300 కోట్లు అదనంగా కేటాయించింది.రైతు బీమాకు గతేడాది కంటే ఈసారి రూ 123 కోట్లు పెంచింది. రైతు బంధు ఇవ్వడం ద్వారా రైతుకు మేలు చేస్తున్నట్టు చెబుతున్న ప్రభుత్వం...ఇతర అంశాలను పట్టించుకోవడం లేదు. ధర స్థిరకరణకు కూడా నిధులు ఈసారి తగ్గించింది. పత్తి, మిరప, పసుపు ధరలు క్షీణించడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రైతులు తమ ఉత్పత్తులను అమ్ముకునేందుకు దళారులపైన్నే ఆధారపడాల్సి వస్తుంది. ఎంతో ప్రాముఖ్యత ఉన్న మార్కెట్ ఇంటర్వెషన్ ఫండు నిమిత్తం గతేడాది రూ 377 కోట్లు కేటాయించగా, ఈ ఏడాది రూ 75 కోట్లు మాత్రమే కేటాయించింది. ఒకేసారి రూ 300 కోట్లు తగ్గించడం ద్వారా రైతులను గాలికొదిలేసింది. పండ్ల తోటలు, కూరగాయాల రైతులను ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన ఉద్యానవన శాఖకు ఈసారి మొండిచేయి చూపింది. గత బడ్జెట్‌లో రూ 1053 కోట్లు కేటాయిస్తే, ఈసారి రూ919 కోట్లకే పరిమితమైంది. పెద్ద పెద్ద భూస్వాములకు ఉపయోగపడే ఫామ్ ఆయిల్ సాగు కోసం మాత్రమే వెయ్యి కోట్లు కేటాయించింది. ఫామ్ ఆయిల్ సాగుతో అనేక ఇబ్బందులు వస్తాయన్న నిపుణుల అభిప్రాయాలను సర్కారు పెడచెవిన పెట్టింది. పశుసంవర్ధక శాఖకు గతేడాది రూ 2,345 కోట్లు కేటాయించగా, ఈసారి రూ 1,481 కోట్లతో సరిపెట్టింది.

దాదాపు రూ 864 కోట్ల కోత పెట్టింది. చేపల పెంపకం దార్లకు రూ 384 కోట్లు కేటాయించి కాస్త ఊరటనిచ్చింది. మార్కెటింగ్ శాఖకు గతంలో రూ 10 కోట్ల కేటాయించిన సర్కారు ఈయేడాది 12 కోట్లు కేటాయించినప్పటికీ ఏ మాత్రం సరిపోవు. వ్యవసాయానికి అత్యంత కీలకమైన యాంత్రీకరణకు ఈసారి బడ్జెట్ జీవో చేసింది. దీని కోసం గతేడాది కేటాయించిన నిధులను కూడా ఖర్చు చేయలేదు. ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి గతేడాది నిధులనే ఈసారి కేటాయించింది. ముఖ్యంగా వ్యవసాయ పరిశోధనలకు ప్రోత్సహించేలా బడ్జెట్ లేదు. దీంతో వ్యవసాయ రంగానికి ఈ బడ్జెట్ అందించే సాయమేమీ లేదని విమర్శలొస్తున్నాయి.

సుప్రీం కోర్టుకెళ్తాం

అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు



నవతెలంగాణ- సిటీబ్యూరో

ఎమ్మెల్యేలకు ఎర కేసుకు సీబీఐకి కేటాయిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును గౌరవిస్తామని, ఈ విషయంపై తాము సుప్రీం కోర్టుకెళ్తామని ప్రభుత్వ విప్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. సోమవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో వారు మాట్లాడారు. కోర్టు తీర్పును గౌరవిస్తూనే హక్కుల కోసం పోరాడుతామన్నారు. కేంద్రంలోని పెద్దలు ప్రతిపక్ష పార్టీలపై ఈడీ, సీబీఐ, ఐటీ సంస్థలతో దాడులు చేయిస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహస్యం చేస్తున్నారని విమర్శించారు.

రుణమాఫీ ప్రస్తావనేది?

హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్



రాష్ట్ర బడ్జెట్‌లో రుణమాఫీ ప్రస్తావన లేదని, రైతులు బ్యాంకులకు పోతే రుణాలు ఇవ్వడం లేదు. దీనిపై ఆర్థిక శాఖ మంత్రి సమాధానం చెప్పాలి. దేశంలోనే ఉద్యోగులకు ఎక్కువ వేతనాలు చెల్లిస్తున్నామని గొప్పలు చెప్పడానికేనని కానీ ఉద్యోగులకు మొదటి వారంలో కూడా వేతనాలు ఇవ్వలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉంది. సెర్ప్, వీఓఏల వేతనాలు పెంచలేదు. పక్క రాష్ట్రంలో రూ.10 వేలు ఇస్తున్నారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు కేవలం వెయ్యి రూపాయలు ఇస్తున్నారు. అవి కూడా సకాలంలో చెల్లించడం లేదు. పిల్లలు పుట్టిన సంవత్సరం తరువాత కేసీఆర్ కిట్ ఇస్తున్నారు. అంగాన్ వాడీ సెంటర్లలో కుళ్లిన కోడి గుడ్లు పెడుతున్నారు.

ఇది ప్రజా బడ్జెట్

నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్త



దేశ తలసరి ఆదాయంతో పోలిస్తే రాష్ట్ర తలసరి ఆదాయం 86శాతం ఎక్కువగా ఉంది. జై జవాన్, జై కిసాన్ మాటను కేసీఆర్ నిజం చేస్తున్నారు. విద్యుత్, వ్యవసాయం, సాగునీటికి అధిక నిధులు కేటాయించారు. 'అబ్ కి బార్ కిసాన్ సర్కార్' అనే నినాదంతో కేసీఆర్ దేశాన్ని ఏకం చేస్తున్నారు. 'మన ఊరు- మన బడి'కి పెద్దపీట వేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మహిళల సంక్షేమం కోసం అధిక నిధులు కేటాయించారు.

బీఆర్ఎస్ సర్కార్..రాష్ట్ర హక్కులను అమ్మకానికి పెట్టబోతున్నది : ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



ఏడు మండలాలు, సీలేరు హైడ్రో ప్రాజెక్టు విషయంలో ఆంధ్ర రాష్ట్రానికి కేసీఆర్ సరెండర్ అయ్యారు. శ్రీరామ్‌సాగర్ బ్యాక్ వాటర్ విషయంలో మహారాష్ట్రకు అనుమతి ఇస్తామని అనడం, నీళ్ల, నిధులు, నియామకాల స్ఫూర్తికి విఘాతం. నీటిని ఆంధ్ర రాష్ట్రం తరలించుకుపోతుంటే నిమ్మకు నీరెత్తినట్టు ఉన్నారు. నదీ జలాల విషయంలో రాష్ట్ర హక్కులను తాకట్టు పెట్టారు. కాళేశ్వరం నుంచి రివర్స్ పంపింగ్ పోయింది. శ్రీరామ్‌సాగర్ నీరు మన హక్కు. ముఖ్యమంత్రి తెలిసి మాట్లాడుతున్నారా? తెలియక మాట్లాడుతున్నారా? నాందేడ్‌లో మైక్ ముందు ఏది పడితే అది మాట్లాడారు.

ప్రజల సమస్యలు గవర్నర్ ప్రసంగంలో రాలేదు

ఎమ్మెల్యే టి.జయప్రకాష్‌రెడ్డి



గవర్నర్ ప్రసంగంలో ప్రజల సమస్యలు రాలేదు. బడ్జెట్ పుస్తకం దొడ్డుగా ఉంది తప్ప అందులో ఏమీ లేదు. గుండె జబ్బులున్నవారిని ఆర్థికంగా ఆదుకోవాలి. వాళ్ల అప్పులపాలై ఆత్మహత్య చేసుకుంటున్నారని చెప్పినా ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. కేవలం కంటి వెలుగుకే పరి మితం అయింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రస్తావన లేదు. ఆరోగ్యశ్రీ అమలు ఊసే లేదు. వీఆర్ఏలకు సంబంధించి ప్రస్తావన లేదు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల కేటాయింపు దిక్కులేదు. యాదగిరిగుట్టకు మెట్రో ట్రైన్ ప్రస్తావన లేదు.

ఇది లెక్కల అంకెల గారడీ

ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



కేంద్రం నుంచి రూ.40వేల కోట్లు, పక్క రాష్ట్రం నుంచి రూ.17వేల కోట్లు రావాలని ఈ బడ్జెట్‌లో చెప్పడం అతిశయోక్తి. ఇవి వస్తాయో రావో తెలియదు. ఎన్నికల నేపథ్యంలో మెగా బడ్జెట్ అని చూపెట్టి ప్రజలను మభ్యపెట్టడం మాత్రమే.

కోతలే..చేతల్లేవ్

టీడీపీ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్



కేసీఆర్ ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ సాంతం కోతలే తప్ప చేతల్లేవు. పథకాలు బోలెడు ఉన్నా నిధుల్లేవనే సంగతిని గుర్తించాలి. మన ఊరు-మన బడి పథకాన్ని దాతలకే పరిమితం చేయకుండా నిధులు కేటా యించాలి. 52 శాతం ఉన్న బీసీలకు బడ్జెట్లో కేవలం 2 శాతం నిధులు ఇవ్వ ఓడం దారుణం. బడ్జెట్ అంకెలగారడిని తలపిస్తున్నది. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు నిధులు కేటాయించి, ఖర్చు పెట్టడం లేదు.

131.8 కోట్లతో కార్మికుల సంక్షేమమెట్లా?

- బడ్జెట్‌లో కార్మిక శాఖకు మొండిచేయి
- కేటాయింపులు 542 కోట్లే
- జీతభత్యాలు, అద్దెవాహనాలు, ఖర్చులకే రూ.410 కోట్లు
- భవన నిర్మాణ కార్మికులకులక్షమోటార్ సైకిళ్ల పంపిణీదీ?



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర సర్కారు కార్మికుల సంక్షేమాన్ని మరోమారు మరిచింది. రాష్ట్రంలోని పారిశ్రామిక, అసంఘటిత రంగంలోని కోటీ 20 లక్షల మంది కార్మికుల పట్ల తన వైఖరేంటో బడ్జెట్‌లో కేటాయింపుల ద్వారా చెప్పకనే చెప్పింది. రాష్ట్ర జనాభాలో మూడో వంతుగా ఉన్న కార్మికులకు రూ. 2,90,396 కోట్ల రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయింపులు చేసింది కేవలం రూ.542 కోట్లు మాత్రమే. మొత్తంగా చూస్తే అది కేవలం 0.25 శాతమే. అందులో నిర్వహణ పద్దు కిందనే రూ.410.37 కోట్లు పోనున్నాయి. అంటే అవి ఉద్యోగుల జీతభత్యాలు, అద్దెవాహనాల చెల్లింపులు, ఇతరత్రా ఖర్చులకు వినియోగించనున్నారు. ఇదిపోనూ ప్రగతిపద్దుకు మిగిలేది రూ.131.81 కోట్లు మాత్రమే. ఇందులో ఉపాధి శిక్షణ, ఇతరత్రాలకే ఎక్కువ ఖర్చు చేసే అవకాశం ఉంటుంది. మొత్తంగా బడ్జెట్‌లో కార్మిక సంక్షేమం కోసం కేటాయింపు గుండుసున్నాగానే చూడాలి. గత బడ్జెట్‌లో లక్ష మంది భవననిర్మాణ కార్మికులకు మోటారు సైకిళ్లను పంపిణీ చేస్తామని రాష్ట్ర సర్కారు ఆర్భాటంగా ప్రకటించింది. ఇప్పటి వరకూ ఒక్కమోటారు సైకిల్ కూడా పంపిణీ చేయలేదు. నిత్యావసరాల ధరలు, ఇంటి అద్దెలు రోజురోజుకీ విపరీత స్థాయిలో పెరిగిపోతున్నాయి. మరోవైపు యాజమాన్యాల తీరుతో ఉద్యోగ భద్రత కరువైంది. ఇలాంటి పరిస్థితుల్లో కార్మికుల సంక్షేమం గురించి కనీసం పట్టించుకోకపోవడంపై కార్మికసంఘాలు పెదవి విరుస్తున్నాయి. బతుకుబండిని లాగేందుకు కుస్తీ పడుతున్న కార్మికుల కుటుంబాల అవసరాలను ఆసరాగా తీసుకుని యాజమాన్యాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయి. ఇష్టముంటే పనిచేయండి? లేకుంటే పనులకు రాకండి? అనే బెదిరింపు ధోరణులు కూడా ఎక్కువైపోతున్నాయి. పరిశ్రమలన్నీ అరకొర వేతనాలిస్తూ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, ట్రైనీ, ఫిక్స్‌డ్‌టర్మ్, తదితర పేర్లతో కార్మికులతో గొడ్డుచాకిరీ చేయించుకుంటూ శ్రమదోపిడీకి పాల్పడుతున్నాయి. రాష్ట్రంలో 73 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్‌లో జీవోలు విడుదల చేయాలనే డిమాండ్‌ను ఎనిమిదేండ్లుగా రాష్ట్ర సర్కారు పెడచెవిన పెడుతూనే ఉన్నది. ఖజానాపై పైసా భారం పడకున్నా రాష్ట్ర సర్కారు ఇలా వ్యవహరిస్తుండటంపై కార్మికులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. 2014కు ముందు నుంచి ప్రభుత్వ శాఖల్లో కాంట్రాక్టు ఉద్యోగులను ఈ ఏప్రిల్ నుంచి క్రమబద్ధీకరిస్తున్నామని హరీశ్‌రావు చెప్పే క్రమంలో తమకు ఏమైనా తీపికబురు అందిస్తారేమోనని ఎదురుచూసిన కార్మికులకు తీవ్ర నిరాశే ఎదురైంది.

వైద్యారోగ్యశాఖకు రూ.12,161 కోట్లు

గతేడాది కన్నా రూ.924 కోట్లు అధికం

- బడ్జెట్‌లో 4.18 శాతం కేటాయింపు
- ఇక రాష్ట్రవ్యాప్తంగా కేసీఆర్ న్యూట్రిషన్ కిట్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వైద్యారోగ్యశాఖకు బడ్జెట్ స్వల్పంగా పెరిగింది. రాష్ట్ర బడ్జెట్ లో ఆ శాఖకు రూ.12,161 (బడ్జెట్‌లో 4.18 శాతం) కోట్లు కేటాయించారు. గతేడాది కేటాయించిన రూ.11,237 కోట్ల కన్నా ఇది రూ.924 కోట్లు అధికం. రాష్ట్రంలో 60 శాతం మందికి పైగా వైద్యసేవల కోసం ప్రయివేటును ఆశ్రయిస్తున్నారని గణాంకాలు చెబుతున్న నేపథ్యంలో ఈ శాఖ బలోపేతానికి కనీసం 10 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ ఉన్నప్పటికీ ఈ మారు 4.3 శాతంతో సరిపెట్టింది. అయితే మెడికల్ కాలేజీలు, బోధనాస్పత్రులు, గర్భిణుల పోష కాహారం, కంటి వెలుగు వంటి వాటికి ప్రాధాన్య తనివ్వడం స్పష్టంగా కనిపించింది. ఈ శాఖలో పెద్ద సంఖ్యలో పని చేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పారామెడికల్, స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంల జీతభత్యాల పెంపు, రెగ్యులరైజేషన్ పై దీర్ఘకాలికంగా ఉన్న డిమాండ్లను తీర్చేలా కేటాయింపులు లేకపోవడంపై విమర్శలు వస్తు న్నాయి. కేటాయించిన మొత్తం రూ.5,595 కోట్లను నిర్వహణ పద్దు కింద, మిగిలిన రూ.6,566 కోట్లను ప్రగతి పద్దు పరిధిలో చూపించారు.. నిర్వహణ పద్దులో ప్రధానంగా మెడికల్ కాలేజీలకు రూ.562 కోట్లు, నర్సింగ్ కాలేజీలకు రూ.37 కోట్లు, డీఎంఇకి రూ.2,088 కోట్లు, డీహెచ్ 1,047 కోట్లు, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ విభాగానికి రూ.578 కోట్లు కేటాయించారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని శాశ్వత కార్యక్రమంగా మారుస్తామని ప్రభుత్వం ప్రకటించి నట్టుగానే బడ్జెట్‌లో రూ.20 కోట్లు ప్రతిపాదించారు. ఆయుష్‌కు రూ.162 కోట్లు, ఆరోగ్యశ్రీకి రూ.605 కోట్లు, ఈహెచ్ఎస్‌కు రూ.150 కోట్లు, జేహెచ్ఎస్‌కు రూ.45.83కోట్లు, ఆయుష్మాన్ భారత్‌కు రూ.115 కోట్లు ప్రది పాదించారు. ప్రగతిపద్దులో భాగంగా ప్రభుత్వం ముందే ప్రకటించిన కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ పథకాన్ని రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు విస్తరించేందుకు వీలుగా రూ.200 కోట్లను కేటాయించారు. ఈ పథకంతో నాలుగు లక్షల మంది లబ్ది పొందుతారని భావిస్తున్నారు. జిల్లాకో మెడికల్ కాలేజీ నిర్మాణం చేయనున్న నేపథ్యంలో ఈ ఏడాది మరో తొమ్మిది కాలేజీలు నిర్మించాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఆ మేరకు వాటి నిర్మాణానికి రూ.1,033 కోట్లతో పాటు, బోధనాస్పత్రుల నిర్మాణానికి రూ.181 కోట్లను కేటాయించారు. మెడికల్ కాలేజీలు, బోధనాస్పత్రులకు రూ.1,237 కోట్లను ప్రతిపాదించారు. హైదరాబాద్ నలువైపులా నాలుగు, వరంగల్ ఒకటి మొత్తం ఐదు సూపర్ స్పెషాలిటీల నిర్మాణానికి రూ.500 కోట్లు కేటాయించారు. ఇక స్టేట్ సెక్టార్ స్కీంలు 108, 104, కేసీఆర్ కిట్ వంటి వాటికి కేటాయింపుల్లో గతేడాదితో పోలిస్తే పెద్దగా మార్పు లేదు. రోగుల డైట్ ఛార్జీలను ఇటీవల పెంచిన నేపథ్యంలో గతేడాది రూ.16 కోట్ల నుంచి ఈ ఏడాది రూ.60 కోట్లకు, అదే విధంగా జీహెచ్ఎంసీ పరిధిలోని ఎంపిక చేసిన ఆస్పత్రుల్లో రోగుల సహాయకులకు భోజనం అందించే కార్యక్రమానికి కొత్తగా రూ.70 కోట్లను కేటాయించారు.

అప్పులే దిక్కు...

- సాగునీటిశాఖకు నిధుల గండం



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్రం అభివృద్ధిపథంలో దూసుకు పోతున్నదని సోమవారం బడ్జెట్ ప్రవేశ పెట్టిన సందర్భంగా ఆర్థిక శాఖ మంత్రి టి. హరీశ్ రావు ప్రకటించారు. ప్రతి యేటా నిధులు కేటాయి స్తున్నా, ఖర్చు మాత్రం అంతంతగానే ఉంటున్నది. గతంలోని కేటాయిం పులు, ఖర్చు పరిశీలిస్తే ఇదే విషయం స్పష్టమ వుతున్నది. కాగా అప్పులు సైతం బాగానే మిగిలాయి. రాష్ట్రానికి ప్రస్తుతం సుమారు రూ. 3 లక్షల కోట్ల అప్పు ఉన్నట్టు సమాచారం. దీనికి ప్రతియేటా దాదాపు రూ. 14 వేల కోట్లు వడ్డీలు చెల్లిస్తున్నది. ఇందులో 50 శాతం మేర సాగునీటి ప్రాజెక్టులకే వడ్డీకింద చెల్లిస్తున్నట్టు తెలిసింది.

1.50 లక్షల కోట్లు అవసరం .. కానీ ఇచ్చింది రూ. 26 వేల కోట్లే

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేయడానికి భారీగా నిధులు అవసరమని ఇటు సాగునీటిశాఖ ఉన్నతాధికారులు, అటు సాగు నీటిరంగ నిపుణులు చెబుతున్నారు. వాటికి దాదాపు రూ. 1.50 లక్షల కోట్లు కావాల్సి ఉంటుందనీ, అప్పుడే చేపట్టిన ప్రాజెక్టులు పూర్తయి సత్ఫలితాలు వస్తాయని అంటున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ. 80 వేల కోట్లు అవసరం. ఇప్పటివరకు రూ. 40 వేల కోట్లు ఖర్చు చేశారు. మరో రూ. 40 వేల కోట్లు కావాల్సి ఉంటుంది. పాలమూరు - రంగారెడ్డికి లిఫ్ట్ ఇరిగేషన్‌కు కూడా రూ. 80 వేల కోట్లు వ్యయం చేయాల్సి ఉంటుంది. ఇప్పటికీ రూ. 20వేల కోట్లు పెట్టారు. ఇంకా రూ. 60 వేల కోట్లు తప్పనిసరిగా అవ సరమే. సీతారామసాగర్ ప్రాజెక్టుకు రూ.10 వేల కోట్లు కావాలి. ఇకపోతే చిన్న, మధ్య తరహా ప్రాజెక్టులకు మరో రూ. నాలుగు వేల కోట్లు అవసరమని అధికారుల చెబుతున్నారు. సాగునీటి ప్రాజెక్టుల కోసం చేసిన అప్పులకుగాను ప్రతియేటా ఏడు నుంచి తొమ్మిది శాతం మేర వడ్డీ చెల్లిస్తున్నది. అయితే తాజా బడ్జెట్‌లో సర్కారు ప్రాజెక్టులకు కేటాయించింది. మాత్రం రూ.26,885 కోట్లు మాత్రమే కావడం గమనార్హం.

వచ్చే రెండేండ్లల్లో పూర్తికాకపోతే..

ఈ ప్రాజెక్టులు వచ్చే రెండేండ్లల్లో పూర్తి చేయకపోతే ప్రభుత్వంపై మరింత ఆర్థిక భారం పడే అవకాశాలు ఉన్నాయని సాగునీటిరంగ నిపుణులు చెబుతున్నారు. నిధులు విడుదల చేసి సకాలంలో పనులు ముగించకపోతే అంచనా వ్యయాలు మరింత పెరిగే పరిస్థితులు ఉత్పన్నమ వుతాయి. ఎస్ఎస్ఆర్ రేట్లూ పెరుగుతాయి.రీడిజైన్లు చేయడం సైతం వ్యయం పెరగడానికి కారణమవుతు న్నది. గతంలో ఒక్కో ప్రాజెక్టు పూర్తి కావడానికి 15 నుంచి 20 ఏండ్లు పట్టేది. దాంతో నిధుల అంచనాలు ఎప్పటికప్పుడు ప్రభుత్వం పెంచాల్సి వచ్చింది. నాగార్జున సాగర్ ప్రాజెక్టును రూ.155 కోట్లతో చేపట్టారు. నిర్మాణం ఆలస్యమై ఎస్ఎస్ఆర్ రేట్లు అంచనా వ్యయ మూ అధికమైంది. దీంతో ఆ ప్రాజెక్టు పూర్తయ్యేనాటికి రూ. 3500 కోట్లు ఖర్చయ్యాయి.

మళ్లీ అప్పులే

గతంలో కాళేశ్వరం, పాలమూరు ఎత్తిపోతల, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, సీతారామసాగర్ ప్రాజెక్టులకు కార్పొరేషన్ల ద్వారా రుణాలు తేవడం జరిగింది. కాళేశ్వరం ప్రాజెక్టుకు 2020 మార్చి నాటికి రూ.63,541 కోట్లు కాగా, ఇందులో బడ్జెట్ నుంచి రూ.23,901.66 కోట్లు ఖర్చు చేశారు. కార్పొరేషన్ రుణాల ద్వారా రూ.39,640.04 కో ట్లు వ్యయం చేశారు.2020-21 అంచనా వ్యయం రూ.86 వేల కోట్ల నుంచి రూ.1,05,790.72 కోట్లకు పెంచారు. మరో రూ.17 వేల కోట్లు కార్పొరేషన్ల ద్వారా 2020 తర్వాత రుణాలు తేవడం జరిగింది.

యాద్రాద్రిలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం

- ప్రారంభించిన హైకోర్టు చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్




నవతెలంగాణ-భువనగిరి

యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో లీగల్ ఎయిడ్ డి ఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్‌ను వర్చువల్ విధానంలో తెలంగాణ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 16 జిల్లాల్లో ఈ సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. జిల్లా కోర్టు ఆవరణలో నూతన కార్యాలయాన్ని యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, అధ్యక్షులు, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ వి.బాలభాస్కర్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. న్యాయ సేవా సలహా కేంద్రం ప్రత్యేకంగా జిల్లాలో ఏర్పాటు చేసినట్టు చెప్పారు. దీనికి డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్‌గా గాదెపాక శంకర్ నియామకమైనట్టు తెలిపారు. ఈ కార్యాలయం ద్వారా న్యాయ సేవలు, సలహాలు ఉచితంగా పొందొచ్చని తెలిపారు.

తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ అధ్యక్షులు, హైకోర్టు జడ్జి జస్టిస్ పి.నవీన్‌రావు, యాదాద్రి భువనగిరి జిల్లా పరిపాలన న్యాయమూర్తి, హైకోర్ట్ జడ్జి జస్టిస్ పి.మాధవిదేవి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.దశరథరామయ్య, జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి కె.మారుతీదేవి, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి డి.నాగేశ్వరరావు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కవిత, జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీసీపీ రాజేష్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

పక్కా ఇండ్లు మంజూరు చేయాలంటూ.. కలెక్టరేట్ ఎదుట ధర్నా



నవతెలంగాణ-పాల్వంచ

నిరుపేదలమైన తమకు పక్క ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం భద్రాద్రి జిల్లా పాల్వంచలోని జిల్లా కలెక్టరేట్ ఎదుట మహిళలు ఆందోళన చేపట్టారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అశ్వారావుపేట మండలం గుర్రాల చెరువు వద్ద ఉండే తాము రోజువారి కూలీ పనులు చేసుకుంటూ బతుకుతున్నామని తెలిపారు, తమకు ఎలాంటి సొంత స్థలం ఇల్లు లేక అద్దె గదుల్లో ఉంటూ దుర్భరమైన జీవితాలు గడుపుతూ ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. తామంతా ఎస్సీ మాదిగ, బీసీ గొల్ల కులాలకు చెందిన వారమని, ఇప్పటికైనా తమపై దయవుంచి పక్కా ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో మహిళలు కే.పుష్ప, కె.సునీత, కే.లక్ష్మి, ఆర్.మరియమ్మ, చిలకమ్మ, మహాలక్ష్మి, సొరకాయ లక్ష్మి, కె.రాజా రాణి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇండ్ల స్థలాల పట్టాలివ్వాలి

నెల్లుట్లలో గుడిసె వాసులకు కనీస సౌకర్యాలు కల్పించాలి

- ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జనగామ జిల్లా కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున ధర్నా



నవతెలంగాణ-జనగామ

నెల్లుట్లలోని గుడిసె వాసులకు, నిరుపేదలకు ఇండ్ల స్థలాలకు పట్టాలిచ్చి, కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ జనగామ కలెక్టరేట్ ఎదుట ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గుడిసె వాసులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘాల ఆధ్వర్యంలో ఇండ్లు లేని నిరుపేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని, ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న వారికి ఇళ్ల స్థలాల పట్టాలిచ్చి వారికి మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ సుమారు 1500 మందికి పైగా నిరుపేద ప్రజలు కలెక్టరేట్ ఎదుట బైటాయించారు. ధర్నాకి సింగార రమేష్ అధ్యక్షత వహించగా రైతు సంఘం నాయకులు మోకు కనకా రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఏదునూరి వెంకటరాజం, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి బోట్ల శేఖర్ పాల్గొని మాట్లాడారు. జిల్లాలోని లింగాల ఘన్‌పూర్ మండలం నెల్లుట్ల శివారులో పేదల స్వాధీనంలో ఉన్న ఇంటి స్థలాలకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పట్టాలతో పాటు రూ.5 లక్షలిచ్చి ఇంటి నిర్మాణానికి సహకరించాలని కోరారు. గుడిసె వాసులకు మౌలిక సదుపాయాలైన మంచినీరు, కరెంటు కల్పించాలన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల కోసం ఎంతో ఆశతో ఎదురు చూసిన ప్రజలకు నిరాశే ఎదురయిందని తెలిపారు. భారత రాజ్యాంగం ప్రతి మనిషికి జీవించే హక్కును ఇచ్చిందని, ప్రస్తుత పాల కులు ఆ జీవించే హక్కును సైతం లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

విసిగి వేసారిన ప్రజలు నిలువ నీడ కోసం ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకుని అత్యంత దయనీయమైన పరిస్థితుల్లో కాలం వెల్లబు చుతు న్నారని అన్నారు. వారికి సౌకర్యాలు కల్పించి పట్టాలు ఇవ్వాల్సింది పోయి వేధింపులకు గురి చేస్తూ దాడులు చేస్తున్నారని ఆరోపించారు.

పేదలు తలుచుకుంటే ఎంత గొప్ప ప్రభుత్వాలైన తలవంచక తప్ప లేదని, పేదల స్వాధీనంలోని ఇండ్ల స్థలాలకు పట్టాలిచ్చి, ఇల్లు నిర్మించి ఇవ్వని పక్షంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నా అనంతరం నాయకులు జిల్లా అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయికి డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు, గుడిసె వాసులు, వందలాది మంది పేదలు పాల్గొన్నారు.

ఇల్లందు మున్సిపల్ చైర్మెన్‌పై అవిశ్వాస తీర్మానం

- కలెక్టర్ అనుదీప్‌కు పత్రాలు అందజేత
- తిరస్కరించడంతో 18 మహిళా కౌన్సిలర్లు ఆందోళన
- కలెక్టర్ కార్యాలయం ఎదుట బైటాయింపు



నవతెలంగాణ-పాల్వంచ

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు మున్సిపాలిటీ చైర్మెన్‌పై మెజార్టీ మహిళా కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానాన్ని ప్రకటించారు. కౌన్సిలర్ల సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు అందజేయగా, ఆయన తిరస్కరించారు. కలెక్టర్ తీరుపై కౌన్సిలర్లు నిరసన వ్యక్తం చేస్తూ కార్యాలయం ఎదుట బైటాయించారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. పోలీసులు చేరుకొని వారికి నచ్చచెప్పారు. అధికార పార్టీ కౌన్సిలర్లమైన తమను కలెక్టర్ అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. అవిశ్వాస తీర్మానం ఇచ్చే హక్కు మెజార్టీ కౌన్సిలర్లకు ఉందని, కాపీలు కలెక్టర్ తీసుకోకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ సీసీ వినతిపత్రాన్ని తీసుకున్నారు. ఈ సందర్భంగా మహిళా కౌన్సిలర్లు విలేకరులతో మాట్లాడుతూ.. ఇల్లందు మున్సిపాలిటీ చైర్మెన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు వ్యవహార శైలి బాలేదని, మహిళా కౌన్సిలర్ల పట్ల హేళనగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. 24 మంది కౌన్సిలర్లు ఉండగా 18 మంది అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇచ్చారని తెలిపారు. ఎన్నికల సమయంలో పట్టణ అభివృద్ధికి సహకరిస్తామని చెప్పి అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నాడని వాపోయారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి ముందు రోజు అభివృద్ధిపై ఎజెండా గాని జరగబోయే అభివృద్ధిపై తమ కౌన్సిలర్లకు ఎవరికి తెలియపరచకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటూ ప్రశ్నించిన వారిని బెదిరిస్తూ బిల్లులను నెగ్గించుకుంటున్నారని చెప్పారు. అంతేకాకుండా మున్సిపల్ అధికారులను భయపెడుతూ బినామీ కాంట్రాక్టులతో టెండర్లు వేస్తూ పనులు జరిపించుకుంటూ కమీషన్లు దండుకుంటున్నారని ఆరోపించారు. ఇలాంటి అన్యాయాలు, అక్రమాలను ఎన్నో సార్లు చైర్మెన్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. అందుకే మెజార్టీ కౌన్సిలర్లందరం అవిశ్వాస తీర్మానం చేయాలని నిర్ణయించుకున్నామని చెప్పారు. అవిశ్వాస తీర్మానం ఇచ్చిన వారిలో.. కౌన్సిలర్లు సిలివేరు అనిత, వాంకుడోత్ తార, చెరుపల్లి శ్రీనివాస్, తోట లలిత శారద, పత్తి స్వప్న, పాబోలు స్వాతి, వార్డు చీమల సుజాత, సామల మాధవి, సంద బిందు ఉన్నారు.

ఆర్థిక శాఖ మంత్రి హరీష్‌రావుకు శుభాకాంక్షలు



నవతెలంగాణ-అబ్దుల్లాపూర్‌మెట్

రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావును, టీఆర్ఎస్ సీనియర్ నాయకులు ప్రవీణ్ గోవర్ధన్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ గోవర్ధన్ మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక ఆర్థిక పురోభివృద్ధి సాధించడంలో ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు కృషి అభినందనీయమని కొనియాడారు. ఆర్థిక శాఖ మంత్రిగా అన్ని రంగాల అభివృద్ధి, పురోభివృద్ధి కోసం బడ్జెట్ ప్రవేశపెట్టడం హర్షనీయ మన్నారు.

ఘనంగా బీఆర్ఎస్ నాయకుడి జన్మదిన వేడుకలు

నవతెలంగాణ -సరూర్‌నగర్

ఆర్కే పురం డివిజన్ మార్గదర్శి కాలనీకి చెందిన బీఆర్ఎస్ నాయకుడు బొడ్డు బద్రీనాథ్‌గౌడ్ జన్మదిన వేడుకలు డివిజన్ బీఆర్ఎస్ ఉపాధ్యక్షుడు మహమ్మద్ జహీద్ అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శాలువాకప్పి, కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జాహెద్ మాట్లాడుతూ ప్రజా జీవితంలో ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాజేందర్ రెడ్డి, సంపత్, విశ్వనాథ గౌడ్, సాయి ప్రసాద్, రవి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



మానసిక ప్రశాంతత కోసమే పార్కులు

- బట్టెల్ గుట్ట పార్కు ప్రజలకు అంకితం ఎంతో అవసరం
- మంత్రి సబితా ఇంద్రారెడ్డి





నవతెలంగాణ-బడంగ్‌పేట్

బడంగ్‌పేట్‌లోని బట్టెల్ గుట్టను ప్రజలకు అంకితం చేయటం జరిగిందని అక్కడ రూ.1కోటి 20లక్షల నిధులతో చేపట్టిన పార్కు ప్రజల మానసిక ప్రశాంతతకు ఎంతో అవసరమని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. సోమవారం మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్‌లోని మేయర్ పారిజాత నర్సిమ్హారెడ్డి, డిప్యూటీ మేయర్ ఇబ్రం శేఖర్, స్థానిక కార్పొరేటర్ బిమిడి స్వప్న జంగారెడ్డితో కలిసి ఎంతో పురాతనమైన బట్టెల్ గుట్టను మున్సిపల్ కార్పొరేషన్ నిధులతో పార్కును ఎంతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది ప్రజలకు అంకితం చేయటం జరిగిందని తెలిపారు. ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనతో పాటు మానసిక ప్రశాంతతకు కోట్లాది రూపాయల నిధులతో చెరువులను సుందరీకరణ చేయటం జరుగుతుందన్నారు. అనంతరం గాంధీ నగర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీ రామాంజనేయ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. అదేవిధంగా నాదర్‌గుల్ గ్రామంలో రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ కృష్ణమోహన్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రామిడి రాంరెడ్డి, కార్పొరేటర్లు పెద్దబావి శోభ ఆనంద్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అర్జున్, రాళ్లగుడం సంతోషి శ్రీనివాస్ రెడ్డి, లిక్కి మమత కృష్ణారెడ్డి, వంగేటి ప్రభాకర్ రెడ్డి, వై.రాంరెడ్డి, బోయపల్లి దీపిక శేఖర్ రెడ్డి, ఎం.లలిత కృష్ణ, పి.సుదర్శన్‌రెడ్డి, తోట శ్రీధర్ రెడ్డి, ఇంద్రసేన, నిమ్మల సునీత శ్రీకాంత్ గౌడ్, మనోహర్, కోఆప్షన్ సభ్యులు సమైక్య జ్యోతి అశోక్, డిఈఈలు అశోక్ రెడ్డి, జ్యోతి, ఏఈ రాంప్రసాద్ రెడ్డి ఉన్నారు.

తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యమే లక్ష్యం

- టీ.పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి
- హాత్ సే హాత్ జోడో యాత్రకు జననీరాజనం
- ఘటకేసర్‌లో రేవంత్‌కు కాంగ్రెస్ శ్రేణుల ఘన స్వాగతం
- భారీగా ఏర్పాట్లు చేసిన టీ.పీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్



నవతెలంగాణ-బోడుప్పల్

తెలంగాణ రాష్ట్రంలో గడీల పాలనను భూస్థాపితం చేసి ఇందిరమ్మ రాజ్యం సాధించేందుకు ప్రతి కాంగ్రెస్ పార్టీ కార్యకర్త కృషిచేయాలని టీ.పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో ములుగు జిల్లా మేడారం సమ్మక్క సారలమ్మ వనదేవతల నుంచి నిర్వహించ తలపెట్టిన హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా సోమవారం నాడు రోడ్డు మార్గంలో ములుగు బయలుదేరిన రేవంత్ రెడ్డికి ఘట్‌కేసర్ ఓఆర్ఆర్ వద్ద మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గ కోఆర్డినేటర్, టీ.పీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ అధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ రూపొందించిన భారీ గజమాలతో సత్కరించారు. అనంతరం పార్టీ శ్రేణులనుద్దేశించి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ తెలంగాణలో చేసిన పాపాలకు లెక్కలతో సహా కక్కించేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందని అన్నారు. హాత్ సే హాత్ జోడో యాత్రతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన విధంగా బుద్ధి చేప్పేలా ప్రజలను చైతన్యవంతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ పీర్జాదిగూడ అధ్యక్షుడు తుంగతుర్తి రవి, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు పోగుల నరసింహారెడ్డి, గ్రేటర్ హైదరాబాదు మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మచ్చ వరలక్ష్మి, కార్పొరేటర్ తోటకూర అజయ్ యాదవ్, గుండ్లపోచంపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాయిపేట శ్రీనివాస్ యాదవ్, మేడ్చల్ మల్కాజిగిరి మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సరిత, ఘటకేసర్ వైస్ ఎంపీపీ కర్రే జంగమ్మలతోపాటు ఉమ్మడి ఘటకేసర్ మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శ్రీపురం కాలనీ పార్కు అభివృద్ధికి కృషి



నవతెలంగాణ-హస్తినాపురం

బి.ఎన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని శ్రీపురం కాలనీ పార్కు అభివృద్ధికి కృషి చేస్తానని స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. కాలనీవాసుల వినతి మేరకు హార్టికల్చర్ డిపార్ట్‌మెంట్ మేనేజర్ మేధతో కలిసి పార్కును పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్కు ఆధునికీకరణతో పాటు కాలనీలలో వున్న మౌలిక సమస్యలను పరిష్కరిస్తామని వారికి లచ్చిరెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రధాన కార్యదర్శి పద్మారెడ్డి, చంద్రయ్య, నరసింహారెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, సికిందర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, సురేందర్‌రెడ్డి, జంగయ్య, వెంకట్ రెడ్డి మరియు తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకోండి

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



నవతెలంగాణ-ఎల్బీనగర్

ఫిబ్రవరి11న జరిగే జాబ్ మేళా కార్యక్రమాన్ని విజవంతం చేయడం కోసం తన నివాసంలో సుధీర్‌రెడ్డి పలువురు జీహెచ్ఎంసి మరియు పోలీస్ ఉన్నత అధికారులచే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ జాబ్ మేళాకు వచ్చే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. వచ్చిన అభ్యర్థులకు మంచినీటి సౌకర్యం, మూత్రశాలలు, పార్కింగ్ సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు ఎదురవ్వకుండా చూడాలని కోరారు. దాదాపుగా 20వేల మంది అభ్యర్థులు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ట్రాఫిక్ మరియు పార్కింగ్ ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే దాదాపుగా ఆన్‌లైన్‌లో ఆరు వేల మంది అభ్యర్థులు తమ పేర్లు నమోదు చేసుకోవడం జరిగింది అని తెలిపారు. అలాగే జీహెచ్ఎంసీ సిబ్బంది కూడా శానిటేషన్ మీద ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే జాబ్ మేళా రోజు ఇంటర్వ్యూలు సాయంత్రం వరకు జరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో లైటింగ్ సౌకర్యం కల్పించాలని సూచించారు. ప్రతి ఒక్క నిరుద్యోగ యువత ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్.బి.నగర్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీధర్ రెడ్డి, ఎల్.బి.నగర్ ఇన్‌స్పెక్టర్ అంజిరెడ్డి, ఎల్.బీ.నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, డీ.సీ.కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి ప్రణాళికాబద్దంగా చర్యలు

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ సత్తు వెంకటరమణ రెడ్డి
- వనస్థలిపురంలో రెండు కోట్ల రూపాయలతో అధునాతన గ్రంథాలయం



నవతెలంగాణ-వనస్థలిపురం

జిల్లాలో గ్రంథాలయ అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టినట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ సత్తు వెంకటరమణారెడ్డి తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన తొలిసారిగా జిల్లాలో గ్రంథాలయాల సందర్శనకు శ్రీకారం చుట్టారు. జిల్లా గ్రంథాలయ కార్యదర్శి మనోజ్ కుమార్‌తో కలిసి సోమవారం వనస్థలిపురం, సరూర్‌నగర్ శాఖ గ్రంథాలయాలను సందర్శించారు. గ్రంథాలయాల్లో వసతులను పరిశీలించి పాఠకులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సూచనల మేరకు వనస్థలిపురం శాఖ గ్రంథాలయానికి రెండు కోట్ల వ్యయంతో అధునాతన నూతన భవనాన్ని నిర్మించినట్లు తెలిపారు. సకల వసతులతో ఈ భవనాన్ని నిర్మించి త్వరితగతిన అందుబాటులోకి తెచ్చే విధంగా కృషి చేస్తానని తెలిపారు. జిల్లాలో 9 కోట్లతో నిర్మాణం చేపడుతున్నామన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో మరిన్ని భవనాల నిర్మాణానికి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్ అందుబాటులోకి ఉంచామని, ఆన్ డిమాండ్ బుక్స్ కొనడానికి సంసిద్ధంగా ఉన్నామని వెంకటరమణారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ పాలకులు పద్మ బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదింటి వధువుకు

మంగళసూత్రం,మెట్టెలు విరాళం



నవతెలంగాణ-నాగోల్

హైదరాబాద్‌లోని నందనవనం కాలనీకి చెందిన నిరుపేద కుటుంబం, అమ్మాయి, ఈగల జగన్, చంద్రకళల కూతురు ఈగల భాగ్యలక్ష్మి వివాహం కోసం సోమవారం ఉదయం హైదరాబాద్‌లోని నాగోల్‌లో ఉప్పల శ్రీనివాస్ గుప్త క్యాంప్ కార్యాలయానికి వచ్చి కలిసిన సందర్భంగా వారికి ఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మెన్ మరియు ఉప్పల ఫౌండేషన్ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త చేతుల మీదుగా మంగళ సూత్రం, మెట్టెలు, చీర, గాజులు విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పెళ్లి కూతురు భాగ్యలక్ష్మి, ఇ.చంద్రకళ, ఇ.జగన్, పి.యాదగిరిగౌడ్, ఎన్.కృష్ణ, ఎం.యాదగిరి, ఎస్.దర్శన్ యాదయ్య తదితరులు ఉన్నారు.

దివ్యాంగుల జీవనోపాధికి శ్రీరాజమాత ఫౌండేషన్ చేయూత



నవతెలంగాణ-ఘట్కేసర్

దివ్యాంగుడి జీవనోపాధికి శ్రీరాజమాత ఫౌండేషన్ వారు చేయూతను అందించారు. పోచారం మున్సిపల్ అన్నోజిగూడ వికలాంగుల కాలనీకి చెందిన వికలాంగుడు జాన్‌కి జీవనోపాధి కల్పించేందుకు శ్రీరాజమాత ఫౌండేషన్ అధ్యక్షులు ఉదయ్‌రెడ్డి ముందుకు వచ్చి దాతల సహకారంతో రూ.16వేల విలువ చేయు దుకాణ సముదాయపు సామాగ్రిని అందజేసి షాపును ఏర్పాటు చేయించారు. ఆదివారం శ్రీరాజమాత ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు ఉదయ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 10 సంవత్సరాల నుండి రాజమాత ఫౌండేషన్ ద్వారా ప్రజాసేవ కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కరోనా వ్యాపించిన నాటి నుండి వికలాంగుల కాలనీలో సామాజిక సేవలు చేస్తున్నట్లు తెలిపారు. వికలాంగులకు నూతన వస్త్రాల పంపిణీ, స్వయం ఉపాధి కోసం వితంతు మహిళలకు కుట్టుమిషన్లు, పేద విద్యార్థికి ఫీజు కట్టడం జరిగిందని, అలాగే పేద ప్రజలకు వారంలో 4 రోజులు అన్నదానం, 3 రోజులు టిఫిన్ డ్రైవ్, ప్రతిరోజు రాజమాత ఫౌండేషన్ ద్వారా సహాయ, సహకారాలు అందిస్తున్నట్లు తెలియజేశారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు శ్రీరాజమాత ఫౌండేషన్ ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో మరిన్ని నిర్వహిస్తూ ముందుకు వెళతామని పేర్కొన్నారు.

ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న సేవా కార్యక్రమాలకు వికలాంగుడి జీవనోపాధికి షాపును ఏర్పాటు చేయించి ప్రారంభిస్తున్న రాజమాత ఫౌండేషన్ అధ్యక్షులు ఉదయ్‌రెడ్డి సహకరిస్తున్న దాతలకు ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షులు ఉదయ్ రెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ఉపాధ్యక్షులు మనోజ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, సభ్యులు అంజలి, ప్రీతి, శృతి, పండు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు సకాలంలో చెల్లించాలి

- సీఐటీయూ నగర కార్యదర్శి వెంకటేష్
- సంచాలన్ భవన్ ఎదుట ధర్నా
- డివిజనల్ రైల్వే మేనేజర్‌కు వినతి



నవతెలంగాణ- సిటీబ్యూరో, బేగంపేట్

కాచిగూడ రైల్వే స్టేషన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు ప్రతి నెల చట్ట ప్రకారం 7వ తేదీ లోపు వేతనాలు చెల్లించడంతో పాటు ఇతర సమస్యలను వెంటనే పరిష్కరించాలని హైదరాబాద్ రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) నగర అధ్యక్షుడు ఎం.వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు హైదరాబాద్ డివిజన్, సౌత్ సెంట్రల్ రైల్వే సంచాలన్ భవన్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించి, అనంతరం డివిజినల్ రైల్వే మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సౌత్ సెంట్రల్ రైల్వే హైదరాబాద్ డివిజన్‌లోని కాచిగూడ రైల్వే స్టేషన్‌లో డైనమిక్ కాంట్రాక్టు సంస్థ కింద సుమారు 50 మంది కార్మికులు హౌస్ కీపింగ్ పని చేస్తున్నారని, ఆల్ సర్వీసెస్ గ్లోబల్ ప్రయివేట్ లిమిటెడ్ కాంట్రాక్టు సంస్థ కింద సుమారు 100 మంది కార్మికులు కోచ్ క్లీనింగ్ పనులు చేస్తున్నా.. వీరికి చట్ట ప్రకారం ప్రతినెలా 7వ తేదీ లోపు వేతనాలు ఇవ్వాలన్నారు. కానీ కాంట్రాక్టర్ ప్రతి నెలా 20 నుంచి 30వ తేదీ, లేదా రెండు నెలలకోసారి వేతనాలు ఇస్తున్నారని మండిపడ్డారు. దానివల్ల కార్మికులు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కావునా ప్రతీనెల 7వ తేదీలోపు కాంట్రాక్టర్ వేతనాలు చెల్లించేలా రైల్వే యాజమాన్యం చర్యలు తీసుకోవాలని వెంకటేష్ డిమాండ్ చేశారు. సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి బి.మధు, సీఐటీయూ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ అధ్యక్షుడు జె.కుమార స్వామి మాట్లాడుతూ రైల్వే కాంట్రాక్టు కార్మికులకు కాంట్రాక్టర్‌లు సకాలంలో వేతనాలు చెల్లించకపోవడంతో డ్యూటీకి రావడానికి బస్సు కిరాయిలు లేక ఇబ్బందులు పడుతున్న పరిస్థితి ఉందన్నారు. అలాగే కిరాయి ఇండ్లలో ఉంటున్న కార్మికులకు చాలా సమస్యలు వస్తున్నాయని చెప్పారు. ఇండ్లు ఖాళీ చేయాలని సదరు ఇంటి ఓనర్లు బెదిరిస్తున్నారన్నారు. అలాగే నిత్యావర సరుకులు కొనలేని పరిస్థితి ఉంటుందని, దీంతో వారు బయట వ్యక్తుల వద్ద వడ్డీకి డబ్బులు తెచ్చుకొని కుటుంబాలు గడుపుకుంటున్న పరిస్థితి ఉందన్నారు. 7వ తేదీ లోపు కార్మికులకు కాంట్రాక్టర్ వేతనం ఇవ్వకుంటే రైల్వే యాజమాన్యం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. చట్టప్రకారం ఏడాదికి 18 ఈఎల్, 12 సీఎల్, 12 పండుగ సెలవులతో పాటు పేస్లిప్‌లు ఇవ్వాలని, కార్మికులపై పనిభారం తగ్గించాలని కోరారు. ఈ ధర్నాలో సీఐటీయూ అంబర్‌పేట్ జోన్ కమిటీ కన్వీనర్ జి.రాములు, మంజుల, ఈదమ్మ, సాజిదా బేగం తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ అంధత్వ రహిత తెలంగాణ లక్ష్యంగా 'కంటివెలుగు'

- రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త



నవతెలంగాణ-ఎల్బీనగర్

సంపూర్ణ అంధత్వ రహిత తెలంగాణ లక్ష్యంగా, ప్రతి ఒక్కరికీ కంటి పరీక్షలు జరిపాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి కేసీఆర్ అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన పథకం 'కంటి వెలుగు' అని రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. కంటి వెలుగు రెండో విడత కార్యక్రమం సోమవారం ఎల్.బి. నగర్ లింగోజిగూడలో నిర్వహించారు. కంటి వెలుగు కార్యక్రమంలో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతు మన ఇంటి వద్దకే మన ఆరోగ్యం అనే నినాదంతో ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో మన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో 100 రోజులపాటు కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా పరీక్షలు నిర్వహించి కళ్లద్దాలు అందజేయనున్నారు. అవసరం ఉన్నవారికి కళ్లద్దాలు అందేవిధంగా ఏమైనా ఇబ్బంది ఉంటే కళ్ళకు ఆపరేషన్ కూడా చేయించి ఆపరేషన్‌కు అయ్యే ఖర్చులు మొత్తం ప్రభుత్వం భరిస్తుంది అన్నారు. ఇంతటి చక్కటి కార్యక్రమాన్ని అందరూ ఉపయోగించుకోవాలని కోరారు.

ప్రపంచంలోనే ఇటువంటి కార్యక్రమం ఎవరు నిర్వహించలేదని, ముందుచూపుతో సీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా నిర్వహిస్తున్నారని, ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్న తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు ధన్యవాదాలు తెలిపారు. పక్క రాష్ట్ర ప్రభుత్వాలు కూడా మొదలు పెట్టే ఆలోచనలో ఉన్నాయని అన్నారు. రోజుకి ఒక్కో క్యాంప్ ద్వారా 150 నుండి 200 మందికి పరీక్షలు నిర్వహిస్తున్నారని, ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఢిల్లీ సీఎం, ఆప్ నేతలపై ఈడీ నకిలీ కేసులు

- అవాస్తవాలతో ప్రభుత్వాన్ని పడగొట్టే యత్నాలు
- ఆప్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు డాక్టర్ డి. సుధాకర్
- కేంద్రం చర్యలను నిరసిస్తూ.. ఈడీ ప్రతుల దహనానికి పిలుపు



నవతెలంగాణ-సిటీబ్యూరో, హిమాయత్‌నగర్

ప్రజల ఆదరణతో రాజకీయంగా ఎదుగుతున్న ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) భవిష్యత్తులో తమకు సవాలుగా మారుతుందన్న భయంతో మోడీ సర్కారు ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, ఇతర ఆప్ నేతలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ద్వారా నకిలీ కేసులు బనాయించి చార్జ్‌షీట్లను దాఖలు చేయించిందని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు డాక్టర్ డి.సుధాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం కేజ్రీవాల్‌పై అవాస్తవాలతో ఈడి ఛార్జ్‌షీట్లను సృష్టించి, నకిలీ కేసులతో ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వాన్ని పడగొట్టే ప్రయత్నాలు ఫలించవన్నారు. సోమవారం లిబర్టీ సర్కిల్‌లోని ఆప్ రాష్ట్ర కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆప్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు రాముగౌడ్, ప్రొఫెషనల్ టీమ్ కోఆర్డినేటర్ డాక్టర్ హరిచరణ్, అధికార ప్రతినిధి అబ్దుల్, హైదరాబాద్ ఇన్‌చార్జి మాజిద్, నల్లగొండ ఇన్‌చార్జి అఫ్జల్, అఫ్సా, టి.రాకేష్ సింగ్, మోమిన్, జావేద్‌లతో కలసి సుధాకర్ మాట్లాడారు. అవినీతిని నిర్మూలిస్తానని ప్రతిజ్ఞ చేసి, మౌలిక సదుపాయాల అభివృద్ధి, నీటి సరఫరా, పారిశుధ్యం, విద్యుత్, విద్యపై దృష్టి పెట్టి ఆప్ పాలిత రాష్ట్రాల్లో సుపరిపాలన ప్రభుత్వాలను కొనసాగిస్తున్నారని, ఆప్ నేత అరవింద్ కేజ్రీవాల్‌తో సహా ఎవరూ ఆప్ నేతలు అవినీతికి పాల్పడే సమస్యేలేదని స్పష్టం చేశారు. ఆప్ నేతలను నకిలీ కేసులతో వేధిస్తే ఊరుకునేదిలేదని మోడీ సర్కారును హెచ్చరించారు.

ఇక తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌లో అన్ని రంగాలవారికి అన్యాయమే జరిగిందని, నిరాశే మిగిలిందని తెలిపారు. విద్యా రంగానికి తగినన్ని నిధులు కేటాయించలేదని, యువతకు నిరుద్యోగ భృతి ప్రస్తావన లేకపోవడం శోచనీయమన్నారు. బీసీల అభివృద్ధి పట్ల నిర్లక్ష్యం, బీసీ, ఎస్టీ మైనార్టీ బంధు లేదని, ఇది అంకెల గారడీ బడ్జెట్ అని విమర్శించారు. రాముగౌడ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలను కూల్చివేస్తే తిరుగుబాటు తప్పదని మోడీ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఆప్ నేతలపై ఈడీ నకిలీ కేసులను, ప్రజాస్వామ్య ప్రభుత్వాలను పడగొట్టాలనే బీజేపీ కుట్రలను నిరసిస్తూ మంగళవారం(నేడు) హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలో అన్ని జిల్లా కేంద్రాలు, ప్రధాన కేంద్రాల్లో నిరసన పదర్శనలకు పిలుపు నిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్లు రమేష్ దర్శనమ్, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం



నవతెలంగాణ-జవహర్‌నగర్

జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 17వ డివిజన్ శాంతినగర్‌కు చెందిన మేరీ కుటుంబంతో కలసి నివాసం ఉంటున్నారు. నాలుగు రోజుల క్రితం అనారోగ్యంతో బాధపడుతున్న మేరీని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో చనిపోయిన విష యాన్ని స్థానికులు, కుటుంబ సభ్యుల ద్వారా తెలుసుకున్న 17వ డివిజన్ కార్పొరేటర్ అళగిరి చిత్ర సుబ్రహ్మణ్యం మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చి అంత్యక్రియల నిమిత్తం మేరీ అన్న యేసుకు ఆర్థిక సాయం అందించారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోండి



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

కంటి సమస్యలు ఉన్న వారు కంటి వెలుగు శిబిరాన్ని సద్విని యోగం చేసుకోవాలి అని నేరేడ్‌మెట్ డివిజన్ కార్పొరేటర్ కొత్తప ల్లి మీనా ఉపేందర్ రెడ్డి అన్నారు. సోమవారం డివిజన్ పరిధి లోని జెజె నగర్ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలు గు కార్యక్రమన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఆధార్ కార్డు జిరాక్స్ వెంట తీసుకుని రావాలని సూచించారు. కంటి వైద్యులు కండ్లను పరీక్షించి, అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలను ఇస్తారని చెప్పారు. కంటి ఆపరేషన్ అవసరమైన వారికి ఇక్కడ ఉచితంగా చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మల్కాజిగిరి సర్కిల్ వైస్ ప్రెసిడెంట్ ఉపేం దర్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఎస్ఆర్ ప్రసాద్, శివ,రాజు, మహేష్, రాజేష్, మధుసూదన్ రెడ్డి, సాయి గౌడ్, నవీన్, కిషోర్, శ్యామ్ ప్రసాద్, వైద్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సాధారణం

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా నూతన కలెక్టర్ అమోయ్ కుమార్

నవతెలంగాణ-మేడ్చల్‌కలెక్టరేట్

ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి బదిలీలు సర్వసాధారణమనీ, ఈ విషయంలో వారు ఏ ప్రాంతానికి బదిలీపై వెళ్ళినా తమకంటూ ఒక గుర్తింపును, మంచి పేరు సంపాదించుకోవాలనీ, ఈ విష యంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గా విధులు నిర్వ హించిన రంగారెడ్డి జిల్లా కలెక్టర్ గా బదిలీపై వెళ్ళిన హరీశ్ తనకు సోదర సమానులనీ, తాము రంగారెడ్డి జిల్లాలో కలిసి పని చేశా మని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా నూతన కలెక్టర్ అమోయ్ కుమా ర్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నూతన కలెక్టర్ అమోయ్ కుమార్ కు స్వాగతం, బదిలీపై వెళ్ళి కలెక్టర్ హరీశ్ కు ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అమోయ్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ఏడాదిన్నర పాటు విధులు నిర్వహించి మరింత అభివృద్ధి చేసి మంచి పేరు తెచ్చిన ఘనత హరీశ్ కు దక్కుతుందన్నారు. ఈ విషయంలో తాము రంగారెడ్డి జిల్లాలో కలిసి పని చేశామని ఆయన తెలిపారు. హరీశ్ అన్ని రంగాల్లో మంచి పట్టు, బాధ్యత కలిగిన వ్యక్తిగా పేరు సంపాదించారనీ, ఆయన జిల్లాకు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఎప్పటికీ గుర్తుంటాయని కొని



యాడారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ విధులు నిర్వహించి న ఆయన బదిలీపై వెళ్ళారని అయినప్పటికీ ఆయన సహకారం జిల్లాకు తీసుకుంటామన్నారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా బదిలీపై వెళ్ళిన హరీశ్ మాట్లాడుతూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో తాను 18 నెలల పాటు బాధ్యతలు నిర్వహించాననీ, ఎంతో ఆనందంగా అందరు అధికారులతో కలిసి మెలసి పని చేసేవారమని గుర్తు చేశారు. జిల్లాలో తాను పని చేసిన సమయంలో అన్ని శాఖల అధి కారులు, సిబ్బంది ఎంతో సహకరించారనీ, వారి సహకారం ఎప్పటికీ మరువలేనిదని హరీశ్ పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ధరణి, జీవో 58, 59 విషయాల్లో అధికారులు ఎప్పటికప్పుడు పనులను పూర్తి చేసి ఏమాత్రం పెండింగ్ లేకుండా చేయడంలో వారి పాత్ర ఎంతో ఉందని తెలిపారు. కరోనా సమయంలో జిల్లా స్థాయి అధికారులతో పాటు కింది స్థాయి అధికారులు, సిబ్బంది చేసిన సేవలు ఎప్పటికీ మరువలేనివని వివరించారు. ప్రస్తుతం జిల్లాకు కలెక్టర్‌గా బదిలీపై వచ్చిన అమోయ్ కుమార్ సమర్థవం తమైన వారనీ, ఆయన హయాంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మరింత అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని చెప్పడంలో ఏమా త్రం సంకోచంలేదన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి మాట్లాడుతూ కలెక్టర్లు అమోయ్ కుమార్, హరీశ్ రాష్ట్రంలోనే చురుకైన అధికారులుగా మంచి పేరు సంపాదించారనీ, వీరి ఆధ్వ ర్యంలో రెండు జిల్లాలు మరింత అభివృద్ధి చెందుతాయని ఆకాం క్షించారు. పలువురు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు జిల్లా కలెక్టర్ హరీశ్ చేసిన పనులను గుర్తు చేస్తూ ఆయన సేవలను కొనియాడారు. ఇద్దరు కలెక్టర్లను కీసరగుట్ట నుంచి వచ్చిన వేద పండితులు ఆశీర్వదించారు. ఈ సందర్భంగా కలెక్టర్లు పూలమాల లు, శాలువాలు, జ్ఞాపికలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు నర్సింహారెడ్డి, అభిషేక్ అగస్త్య, జిల్లా రెవె న్యూ అధికారి లింగ్యానాయక్, టీజీఓ అధ్యక్షుడు, డీసీఓ శ్రీనివాస్ మూర్తి, ట్రెస్మా జిల్లా అధ్యక్షులు గౌతమ్ కుమార్, కలెక్టరేట్ ఏవో వెంకటేశ్వర్లు, జిల్లాలోని మేయర్లు, మున్సిపల్ చైర్మన్‌లు, కమిషనర్లు, కౌన్సిలర్లు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు వేగవంతం చేయండి



- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

నవతెలంగాణ-బేగంపేట్

రోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులను ఆదేశిం చారు. సోమవారం రాంగోపాల్ పేట డివిజన్‌లోని ఓల్డ్ గ్యాస్ మంది, మేకల బండ ప్రాంతాల్లో మంత్రి వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సంద ర్భంగా ఓల్డ్ గ్యాస్ మండి లోని శ్రీ ఉప్పలమ్మ ఆలయం వద్ద రూ.45 లక్షలతో చేపట్టిన రోడ్డు పనులు అసంపూ ర్తిగా ఉండటం చూసి మిగిలిన రోడ్డు పనులను రెండు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ఆలయం పక్కన ఉన్న వ్యర్థాలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. మంత్రి తన వ్యక్తిగత నిధులతో పునర్నిర్మిస్తున్న ఉప్పలమ్మ ఆలయాన్ని కూడా సందర్శించారు. అనంతరం మేకలబం డ కమ్యూనిటీ హాల్‌ను స్థానిక ప్రజల విజ్ఞప్తి మేరకు సందర్శించారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ హాల్‌లో టాయిలెట్స్ మరమ్మతులు చేయాలనీ, ప్రహరీ గోడ మర మ్మతులు చేపట్టాలని కోరారు. వెంటనే చర్యలు తీసుకోవా లని అధికారులను ఆదేశించారు. కమ్యూనిటీ హాల్ ఆవరణలో మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. మంత్రి వెంట మాజీ కార్పొరేటర్ అత్తిలి అరుణ, ముకుంద రెడ్డి, సుదర్శన్, శానిటేషన్ శ్రీనివాస్, తహసీల్దార్ శైలజ, నాయకులు అత్తిలి మల్లిఖార్జున్, మనోజ్, కాలనీకి చెందిన జగన్, మహేష్ గౌడ్, వినయ్, తదితరులు ఉన్నారు.

'ప్రజావాణి' ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- మంత్రి తలసాని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి
- ప్రజావాణికి 76 ఫిర్యాదులు

నవతెలంగాణ-మేడ్చల్‌కలెక్టరేట్

జిల్లా వ్యాప్తంగా ప్రజావాణిలో ప్రజలు ఇచ్చిన దరఖాస్తులను ఆయా శాఖల అధికారులు సత్వరమే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజావాణి సమావేశ మంది రంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్‌తో కలిసి జిల్లాలోని ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ సమ స్యలు తీరుతాయని ఎంతో నమ్మకంతో దూర ప్రాంతాల నుంచి వస్తారనీ, దీన్ని దృష్టిలో పెట్టుకుని సంబంధిత



శాఖల జిల్లా అధికారులు వీలైనంత వరకు ఎప్పటి సమస్య లకు సంబంధించి పరిష్కారాలు అప్పటికప్పుడు పరిష్కరిం చేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా వచ్చిన 76 దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం ఆయా శాఖల వారికి వాటిని అందచేసి వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బోయిన్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం



నవతెలంగాణ-కంటోన్మెంట్

బోయిన్‌పల్లి వ్యవసాయ మార్కెట్ పాలక మండలి సోమవారం నూతన కమిటీ ఏర్పాటైంది. కంటోన్మెంట్ ఎమ్మెల్యే జిజసాయన్న సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. బోయినపల్లి మార్కెట్ మొట్టమొదటి మహి ళా చైర్‌పర్సన్‌గా హరికా ఆనంద్‌గౌడ్ నియమితులయ్యా రు. ఉపాధ్యక్షునిగా చింతల వేణుగోపాల్ రెడ్డి, సభ్యులుగా బండి రామకృష్ణ, మీనా భాస్కర్, దేవులపల్లి శ్రీనివాస్, బి.నారాయణ, ఎం.గిరిధర్, శ్రీనివాస్‌గౌడ్, షేక్ నయీం, ఎస్.సంత్రెడ్డి, బి.భాస్కర్, జవహరిలాల్, శ్రీరాముల ప్రభాకర్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మార్కెట్ స్పెషల్ గ్రేట్ కార్యదర్శి ఎల్. శ్రీనివాస్, మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్, బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరికా ఆనంద్ గౌడ్ మాట్లాడుతూ తనకు ఈ రావడానికి కృషి చేసిన ఎమ్మెల్యేలు సాయన్న, మైనంపల్లి హనుమంతరావు, మంత్రి శ్రీనివాస్ యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించినందుకు పదవికి న్యాయం చేస్తానని పేర్కొన్నారు.

బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం

నవతెలంగాణ-కాప్రా



రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యారంగానికి నిధుల కేటాయింపులో తీవ్ర అన్యాయం చేసిందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాథోడ్ సంతోష్ అన్నారు. 2023-2024 సంవత్సర రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగా న్ని పూర్తిగా విస్మరించిందన్నారు. బడ్జెట్‌లో విద్యారంగా నికి 30శాతం నిధులు కేటాయించాల్సి ఉన్నా కేవలం 6.57శాతం నిధులను మాత్రమే కేటాయించినట్టు తెలి పారు. ఈ నిధులతో విద్యారంగం ఎలా అభివృద్ధి బాటలో ముందుకు వెళు తుందని తెలిపారు. పక్క రాష్ట్రాలైన కేరళలో విద్యారంగానికి 25శాతం నిధులు కేటాయించినట్టు తెలిపారు. దేశానికి తెలంగాణ ఆదర్శమని చెపుతున్న కేసీఆర్ ముందు విద్యారంగాన్ని అభివృద్ధి చేయడానికి నిధుల కేటాయింపులపై పక్క రాష్ట్రాలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ బడ్జెట్‌లో యూనివర్సి టీల అభివృద్ధిని పట్టించుకోలేదనీ, సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీల పెంపు లేదనీ, గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు లేక అద్దె భవనంలో నడిపిస్తున్నారని తెలిపారు.

ఈ బడ్జెట్‌తో గురుకులలకు సొంత భవనం ఎలా నిర్మిస్తారు అని ప్రశ్నించారు. ఇప్పటికీ దాదాపు రూ.5,300 వేల కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయనీ, ప్రభుత్వ గురుకుల పాఠశాలల, పాఠశాల, కళాశాలల విద్యార్థులు సమస్యలతో సతమవు తున్నారనీ, 2018 ఎన్నికల హామీ అయిన ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం హామీ అమలు కూడా లేదనీ, ఈ బడ్జెట్ ద్వారా విద్యారంగానికి ఒరిగిందేమీ లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యారంగానికి ఇచ్చిన హామీలు అమలు నోచుకోవడం లేదని చెబుతున్న మాటలకు ఇస్తున్న బడ్జెట్ నిధులకు పొంతన లేకుండా పోయిందన్నారు. ఇది పూర్తిగా విద్యార్థి వ్యతిరేక బడ్జెట్‌గా ఉందన్నారు.



బీఆర్ఎస్ నాయకులు ప్రభాకర్ రెడ్డి జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు ఆయనను కలిసి పూల బొకే, శాలువతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు కుమారుడు, ఎంఎస్ ఎస్ ఓ చైర్మన్ మైనంపల్లి రోహిత్ బాబును కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నవతెలంగాణ-నేరేడ్‌మెట్

జీఓ 59 ప్రకారం స్థలాలను రెగ్యులరైజేషన్ చేసుకోవాలి

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

జీఓ 59 ప్రకారం స్థలాలను రెగ్యులరైజేషన్ చేసుకో వాలని మల్కాజిగిరి తహశీల్దార్ వెంకటేశ్వర్లు కోరారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక ప్రభుత్వ భూముల్లో స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న వారికి రాష్ట్ర ప్రభుత్వం జీఓ 58, 59 ద్వారా రెగ్యుల రైజేషన్ స్కీంను ప్రవేశపెట్టిందన్నారు. గతంలో ఈ అవకా శాన్ని వినియోగించుకోని వారికి ప్రభుత్వం మరోసారి అవకాశం కల్పించిందన్నారు. మల్కాజిగిరిలో మొత్తం 732 అప్లికేషన్లను స్వీకరించామనీ, ఇందులో అర్హులైన అందరికీ నోటీసులు ఇచ్చినట్టు తెలిపారు. అందుకు సంబంధించిన రుసుం వివరాలను అర్హులకు నోటీసులో తెలిపినట్టు చెప్పారు. అందులో తెలిపిన విధంగా



రుసుంను మార్చి నెల లోపల పూర్తిగా చెల్లించాలన్నారు. ఈ అవకాశాన్ని నోటీసులు అందుకున్న అర్హులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇంకేమైనా సందేహాలుంటే పూర్తి వివరాలు కోసం మల్కాజిగిరి తహసీల్దారు కార్యాలయంలో తమను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎలక్షన్ ఆఫీసర్ శ్రీదేవి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే బడులకు మౌలిక సదుపాయాలు : మేయర్ మేకల కావ్య



నవతెలంగాణ-జవహర్‌నగర్

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే పాఠశాలలు కార్పొ రేట్ స్థాయి హంగులు సంతరించుకున్నాయని మేయర్ మేకల కావ్య అన్నారు. సోమవారం కార్పొరేషన్‌లోని అంబేద్కర్‌నగర్ ప్రైమరీ పాఠశాలలో కార్పొరేటర్ ఏకే మురుగేష్ ఆధ్వర్యంలో రూ.5లక్షలతో ప్రహరీ నిర్మాణా నికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కార్పొరేషన్‌లోని ప్రభుత్వ బడులకు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. పాఠశాలలను కాపా డుకోవాల్సిన బాధ్యత మనందరిదన్నారు. గతంలో సర్కా రు బడులకు విద్యార్థులు భయపడేవారనీ, నేడు ప్రభుత్వ బడుల్లో సీటు దొరకని పరిస్థితి నెలకొందంటే ఎంత మార్పు వచ్చిందో చెప్పవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ రామలింగం, కో-ఆప్షన్ సభ్యురాలు శోభారెడ్డి, సీనియర్ నాయకులు మెట్టు వెంకన్న, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

చిన్న వ్యాపారులకోసం బిజ్ ఖాతాను ప్రారంభించిన ఎయిర్టెల్ పేమెంట్స్ బ్యాంక్


నవతెలంగాణ-హైదరాబాద్

ఎయిర్టెల్ పేమెంట్స్ బ్యాంక్ తన కరెంట్ అకౌంట్-బిఖాను ప్రారంభించినట్టు ప్రకటించింది. ఇది దేశవ్యాప్తంగా చిన్న వ్యాపారులు అండ్ వ్యాపార భాగస్వా ముల కోసం అపరిమిత లావాదేవీలు, తక్షణ ఆక్టివేషన్ అందిస్తుంది. ఈ సందర్భంగా ఎయిర్టెల్ పేమెంట్స్ బ్యాంక్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ గణేష్ అనంతనా రాయణన్ మాట్లాడుతూ... ఎయిర్టెల్ పేమెంట్స్ బ్యాంక్, బ్యాంకింగ్ను సులభంగా, సులభంగా అందుబాటులోకి తీసుకురావాలని తాము లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. కనీస బ్యాలెన్స్ అవసరాలను తీర్చలేకపోవడం, నిర్దేశించ బడిన లావాదేవీల సంఖ్యకు మించి ఎక్కువ ఛార్జీలు విధించబడతాయనే భయం చిన్న వ్యాపార యజమాను లకు వ్యాపార ఖాతాను ప్రారంభించడానికి ఎదురుదెబ్బ అని తమ పరిశోధన తెలిపిందన్నారు. ఈ విషయానీ న్న దృష్టిలో పెట్టుకుని చిన్న వ్యాపార యజమానులకు వ్యాపార బ్యాంకింగ్ ప్రయోజనాలను ప్రారంభించడాని కి, అందించడానికి తాము బిజాతా ఖాతాను తీసుకువ చ్చామన్నారు. ఈ ఖాతా తమ ప్రస్తుత వ్యాపార ఉత్పత్తుల పోర్ట్ఫోలియోకి ఒక ముఖ్యమైనదిగా ఉంటుందన్నారు.

కార్పొరేషన్‌లో ముమ్మరంగా అభివృద్ధి పనులు

నవతెలంగాణ-జవహర్‌నగర్

కార్పొరేషన్‌లో అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయనీ, అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతూ ఓ మోడల్ సిటీగా మార్చుతున్నామని మేయర్ మేకల కావ్య అన్నారు. సోమవారం కార్పొరేషన్‌లోని 27వ డివిజన్ భక్తబాయి కాలనీలో కార్పొరేటర్ జిట్ట శ్రీవాణి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ సాధారణ నిధులు రూ.5 లక్షలతో భూగర్భ డ్రైనేజీ పనులను ప్రారంభించా రు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మంత్రి మల్లారెడ్డి సహకారంతో ఎక్కడ చూసినా అభివృద్ధితో కొత్త అందాన్ని సంతరించుకుందన్నారు. ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని తెలిపారు. జవహర్ నగర్ కార్పొరేషన్‌లో ఇప్పటికే రూ.60కోట్లతో అభివృద్ధి పనులు



జరగాయంటే ఘనత మంత్రి మల్లారెడ్డికే దక్కుతుందని తెలిపారు. 28 డివిజన్లలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు ఆశాకుమారి, కో-ఆప్షన్ సభ్యులు శ్వేతాముఖేష్, శోభారెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్, 7వ డివిజన్ అధ్యక్షుడు మెట్టు వెంక న్న, పార్టీ నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

అమెజాన్ వాలెంటైన్స్ డే స్టోర్ ప్రారంభం

నవతెలంగాణ-హైదరాబాద్

తమ వాలంటైన్స్ స్టోర్‌తో మీ ప్రేమను వ్యక్తీకరించ డానికి అమెజాన్.ఇన్ ఉత్తేజ భరితమైన అవకాశాన్ని తెచ్చింది. చాకొలెట్స్, తాజా పూలు, బహుమతి సెట్స్, ఎలక్ట్రానిక్స్, హోమ్ డెకర్, కిచెన్ ఉపకరణాలు, ఫ్యాషన్ అండ్ సౌందర్య అవసరాలు, పెద్ద ఉపకరణాలు, యాక్సెసరీస్, స్మార్ట్ ఫోన్స్, అమేజాన్ పరికరాలు, ఇంకా ఎన్నో శ్రేణులను ప్రత్యేకంగా రూపొం దించిన ఉత్పత్తులు పై కస్టమర్స్ అమెజాన్.ఇన్ పై ఉత్తేజ భరితమైన ఆఫర్స్ అండ్ డీల్స్ ను ఫిబ్రవరి 14 వరకు ఆనందించవచ్చని ఆ సంస్థ తెలిపింది. మీరు ప్రేమించిన వారితో ప్రేమను సంబరం చేసుకోండి.. తమ బహుమతి అవసరాలు అన్నింటి కోసం ఏకైక వేదికగా నిలిచిన అమేజాన్ వారి వాలంటైన్స్ డే స్టోర్లో వారి షాపింగ్ అవసరాలను తీర్చండని తెలిపింది. కస్టమర్స్ క్యాడ్ బరీ, వ్యాన్ హ్యుసేన్, గివా, జేయా బై కుందన్, ద హెూల్ ట్రూత్, బాంబే షేవింగ్ కంపెనీ, ఓలే, హెర్బల్ ఎసెన్స్, ఓపెన్ సీక్రెట్స్, జనస్య, ప్యూమా, గో కలర్స్, క్లోవియా, గ్లోబల్ దేశీ సహా పలు బ్రాండ్స్ కోసం కస్టమర్స్ షాపింగ్ చేయవచ్చని, అమేజాన్ షాపింగ్ యాప్ (ఆండ్రాయిడ్ మాత్రమే) పై అలెక్సాను ఉపయోగించి వాలంటైన్స్ డే స్టోర్ను పొందడానికి కస్టమర్స్ తమ వాయిస్ ను కూడా ఉపయోగించవచ్చని ఆ సంస్థ పేర్కొంది.

సమస్యల పరిష్కారానికి అధికారులు ముందుండాలి



నవతెలంగాణ-మల్కాజిగిరి

ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు ముందుండాలని కార్పొరేటర్ శ్రావణ్ కుమార్ అన్నారు. సోమవారం శ్రీకృష్ణ నగర్‌లో కాలనీవాసులతో కలిసి పాదయాత్ర నిర్వహించిన కార్పొరేటర్ పలుచోట్ల ప్యాచ్ వర్క్స్, మ్యాన్ హెూల్ రిపైర్స్ వెంటనే చేయాలని అధికారులకు సూచించారు. వాటర్ పొల్యూషన్ జరుగుతున్న స్ట్రీట్ నెంబర్ టెన్‌లో పొల్యూషన్ రాకుండా రిపేర్ చేయించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు సునీల్, శరత్, వినయ్, సంజీవ్, మురళి, శ్రీకాంత్, నవీన్, బెనర్జీ, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మర్రి మోహన్ రెడ్డికి పరామర్శ

నవతెలంగాణ-కాప్రా

బీజేపీ సీనియర్ నాయకులు మర్రి మోహన్ రెడ్డి తల్లి యాదమ్మ నాలుగు రోజుల క్రితం చనిపోవడంతో ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్



ప్రభాకర్, ఏఎస్ రావు నగర్ డివిజన్ అధ్యక్షులు కే.రమేష్ యాదవ్, సీనియర్ నాయకులు లక్ష్మణ్ గౌడ్, చర్లపల్లి డివిజన్ బీజేవైఎం ఉపాధ్యక్షులు అప్పి వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు.

అన్ని వర్గాల వారికి వైద్యం అందించేందుకు కృషి



నవతెలంగాణ-ధూల్‌పేట్

అన్ని వర్గాల ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేసేందుకే ఈ హెల్త్ కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని సెంటర్ అధినేత డాక్టర్ సంతోష్ సింగ్ అన్నారు. జియాగూడ రోడ్డు పురాణ పూల్‌లో సువిధ హెల్త్ కేర్ అండ్ డయాగ్నొస్టిక్స్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మధ్యతరగతి ప్రజలకు తగిన విధంగా తక్కువ ఖర్చు లోనే వైద్యంతో పాటు అవసరమైన శస్త్ర చికిత్సలు కూడా నిర్వహిస్తామన్నారు. సేవాభావంతోనే అందరికీ అందు బాటులో ఉండే విధంగా ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గోషామహల్ కార్పొరేటర్ లాల్ సింగ్, సంతోష్ సింగ్, రామరాజు సింగ్, జితేందర్ సింగ్, రణవీర్ సింగ్, జ్ఞాని చందర్ సింగ్, శైలేందర్ సింగ్, సర్దార్ సింగ్, కుషర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర బడ్జెట్.. సామాన్యులు హర్షించే బడ్జెట్

- ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్



నవతెలంగాణ-అడిక్‌మెట్

రాష్ట్ర బడ్జెట్ సామాన్యులు హర్షించే బడ్జెట్ అని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఒక ప్రకటనలో అభిప్రాయ పడ్డారు. బడ్జెట్‌లో బడుగు బలహీన వర్గాలకు పెద్దపీట వేశారన్నారు. ప్రతి రంగానికి అత్యధిక నిధులు కేటాయించి ప్రజా సంక్షేమ బడ్జెట్‌గా చరిత్రలో నిలిచిపోతుందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసే బడ్జెట్ ప్రవేశపెట్టినందుకు ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావుకు ధన్యవాదాలు తెలిపారు.

బడ్జెట్‌లో ఈ సారీ అంతే!

- జీహెచ్‌ఎంసీ, వాటర్‌బోర్డు, మెట్రోరైలుకు అప్పులే దిక్కు
- బల్దియాకు రూ.31కోట్లు కేటాయింపు
- వాటర్‌బోర్డుకు రూ.1,960కోట్లు
- మూసీకి రూ.200కోట్లు
- ఎంఎంటీఎస్‌కు రూ.50కోట్లు
- ఎస్‌ఆర్‌డీపీ, ఎస్‌ఎన్‌డీపీలకు నిధులు సున్నా

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్‌ను విశ్వనగరంగా మారుస్తామన్న హామీ అటకెక్కింది. డల్లాస్..ఖల్లాస్ అయింది. ఇంకెక్కడి ఇస్తాంబుల్. పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయినా సర్కార్ నుంచి ఎలాంటి సాయంలేదు. అందుకు హైదరాబాద్ మహానగరానికి 9 ఏండ్లుగా బడ్జెట్ కేటాయింపులే నిదర్శనం. అప్పులు చేసి అభివృద్ధి పనులు చేస్తున్నారు. సోమవారం అసెంబ్లీలో ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు ప్రవేశపెట్టిన బడ్జెట్‌లోనూ అప్పులు తీసుకోవడానికి మార్గమే చూపించారు తప్ప ఇచ్చిందేమిలేదు. జీహెచ్‌ఎంసీ ఇప్పటికే రూ.5,500కోట్లకుపైనే అప్పులు చేసింది. ఈ బడ్జెట్‌లో వాటర్ బోర్డుకు రుణం కింద రూ.1,660 కోట్లు కేటాయించారు. అత్యధిక



మంది ప్రయాణీకులకు ఉపయోగంగా ఉన్న ఎంఎంటీఎస్‌కు రూ.50కోట్లు, ఎల్‌అండ్‌టీ సంస్థ కోసం హెచ్‌ఎంఆర్‌ఎల్‌కు రుణం రూ.1500కోట్లు ప్రతిపాదించారు. దీంతోపాటు హైదరాబాద్ అర్బన్ అగ్లోరేషన్ కోసం రూ.150.94 కోట్లు కేటాయించారు. ఇలా అప్పులు చేసుకోవడం తప్ప మరో మార్గంలేదని ప్రభుత్వం చెబుతోంది. ఈ అప్పులు క్రమంగా నగర వాసులకు భారంగా మారనున్నాయి.

బల్దియాకు అప్పులే గతి

తొమ్మిదేండ్ల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లలో జీహెచ్‌ఎంసీకి నామమాత్రంగానే నిధులు కేటాయిస్తున్నారు. ఈ సారి అదే పరిస్థితి. 2023-24బడ్జెట్‌లో రూ.31 కోట్లు కేటాయించారు. వేతనాల కోసం రూ.11.34 కోట్లు కేటాయించారు. గ్రేటర్‌లోని ప్రభుత్వ భవనాలకు సంబంధించిన ఆస్తిపన్ను బకాయిలు రూ.5వేల కోట్ల వరకు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. కానీ బడ్జెట్‌లో ఇచ్చింది మాత్రం రూ.10 కోట్లే. ఏటా వృత్తి పన్ను రూ.300కోట్లకుపైగానే వసూలవుతుంది. కాని ఇచ్చింది రూ.10.10కోట్లు. మోటారు వాహనాల పన్ను రూ.300కోట్లకుపైగానే వసూలవుతున్నా బడ్జెట్‌లో ఇచ్చింది రూ.10లక్షలు. ఎస్‌ఆర్‌డీపీ, సీఆర్‌ఎంపీ, నాలా అభివృద్ధి పనులకు, మూసీపై నిర్మించే బ్రిడ్జీలకు రుణాలు తీసుకుని పూర్తిచేయాలని ప్రభుత్వం చెబుతోంది.

మూసీ సుందరీకరణకు రూ. 200కోట్లు

తెలంగాణ ప్రభుత్వం మూసీ నది సుందరీకరణను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నది. అందుకోసం ఈసారి బడ్జెట్‌లో రూ. 200 కోట్లు కేటాయించింది. హైదరాబాద్ మహానగరం మీదుగా ఉన్న మూసీ నదిని సుమారు 53 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం మూడేండ్ల క్రితం మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఎంఆర్‌డీసీఎల్)ను ఏర్పాటు చేసింది. గతేడాది మాదిరిరగానే రూ.200కోట్లు కేటాయించారు.

ఎస్‌ఆర్‌డీపీ, ఎస్‌ఎన్‌డీపీలకు నిధుల్లేవు

నగరంలో మౌలిక వసతులను మెరుగు పరచడానికి ప్రభుత్వం పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపట్టింది. హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్యలను తగ్గించడం కోసం ఎస్‌ఆర్డీపీ కింద 42 కీలక రహదారులు, ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌లు, ఆర్వోబీల అభివద్ధి చేపట్టింది. అందులో 31 పూర్తి చేసింది. మిగతా 11 ఈ ఆర్థిక సంవత్సరంలో పూర్తిచేయనున్నారు. కానీ ఎస్‌ఆర్‌డీపీ పనుల కోసం బడ్జెట్‌లో నయాపైసా కేటాయించలేదు. దీంతోపాటు ఇంతముందు భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో నగరమంతా అతలాకుతలమైన విషయం తెలిసిందే. దీనికోసం వరదల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌ఎన్‌డీపీ కార్యక్రమాన్ని చేపట్టారు. మొదటి దశలో చేపట్టిన పనులు చివరి దశలో ఉన్నాయి. రూ.985కోట్లతో రెండో దశ పనులు చేయాలని నిర్ణయించారు. కాని బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు.

పటిష్టంగా శాంతి భద్రతలు

రాష్ట్రంలోనూ, ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్‌లోనూ శాంతి భద్రతల నిర్వహణ సమర్థవంతంగా జరిగితేనే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని, దేశంలో ఎక్కడా లేనివిధంగా ఇవాళ రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయంటే రాష్ట్రంలో మెరుగైన శాంతిభద్రతల నిర్వహణ ఒక కారణం. మెగాసిటీ పోలీసింగ్‌లో భాగంగా హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లను మరింత బలోపేతం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మూడు కమిషనరేట్ల పరిధిలో 56 లా అండ్ ఆర్డర్, 19 టాఫిక్ పోలీస్ స్టేషన్లు, 4 ట్రాఫిక్ ఏసీపీ పోలీస్ డివిజన్లు, 2 ట్రాఫిక్ డిసిపి జోన్లను ఏర్పాటు చేశారు.

గ్రేటర్‌కు మొండి చేయి



రాష్ట్ర బడ్జెట్‌లో ఈ సారీ జీహెచ్‌ఎంసీకి నిధులు కేటాయించలేదు. జీహెచ్‌ఎంసీకి చట్టబద్ధంగా రావాల్సిన వృత్తి పన్ను, రాష్ట్ర ప్రభుత్వ భవనాలపై ఆస్తిపన్ను, మోటారు వాహన పన్ను కేటాయించకుండా బాధ్యతారహితంగా వ్యవహరించింది. ఎస్‌ఎన్‌డీపీ, ఎస్‌ఆర్‌డీపీలకు నయాపైసా కేటాయించకపోవడం శోచనీయం. ఎంఎంటీఎస్. ప్రాజెక్టుకు రూ.400 కోట్లు కేటాయిం చాల్సింది పోయి రూ.50కోట్లు కేటాయించారు. పాతబస్తీ మెట్రోరైలుకు గతేడాది, ఈ సారి రూ.500కోట్ల చొప్పున కేటాయించినప్పటికీ పనులు చేపట్టే పరిస్థితిలేదు. ఎయిర్‌పోర్టు మెట్రోరైలుకు నిధులు, మెట్రోరైలుకు అప్పులు ప్రతిపాదించారు. వాటర్‌బోర్డుకు పాత చెల్లింపుల కోసం ఎక్కువ నిధులు కేటాయించారు. మూసీకి కేటాయించిన రూ.200కోట్లను ఖర్చుచేస్తారా? లేదా? అనుమానంగానే ఉంది. కులీకుతూబ్ షా అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీకి నామమాత్రంగానే నిధులు కేటాయించారు. రాష్ట్ర అభివృద్ధిలోనూ, పన్నుల్లోనూ కీలకపాత్ర పోషిస్తున్న గ్రేటర్ హైదరాబాద్‌కు నిధులు కేటాయించకపోవడంపై నగర శాసన సభ్యులు ప్రశ్నించాలి.

– సీపీఐ(ఎం) నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్

అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న అంగన్వాడీ టీచర్లు అరెస్టు

- ఈడ్చుకెళ్లి వాహనం ఎక్కించిన పోలీసులు
- ఏఐటీయూసీ కార్యాలయం ఎదుట భారీగా పోలీసుల మోహరింపు





నవతెలంగాణ-హిమాయత్‌నగర్

రాష్ట్రంలో అంగన్వాడీ టీచర్లు, హెల్పర్‌ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం చలో అసెంబ్లీకి అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయూసీ) ఇచ్చిన పిలుపులో భాగంగా రాష్ట్రంలోని 30 జిల్లాల నుంచి వేలాది మంది అంగన్వాడీ టీచర్‌లు, హెల్పర్‌లు భారీగా స్థాయిలో ఏఐటీయూసీ కార్యాలయానికి చేరుకున్నారు. తెల్లవారుజాము నుంచే ఏఐటీయూసీ కార్యాలయం ఎదుట ఏసీపీ పూర్ణచందర్ రావు ఆధ్వర్యంలో భారీగా పోలీసులు మోహరించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ అసెంబ్లీ వైపునకు భారీ స్థాయిలో వెళ్తుండగా పోలీసులు దిగ్బంధించి బలవంతంగా రోడ్డుపై ఈడ్చుకెళ్లి దొరికన వారిని దొరికినట్లుగా బలవంతంగా పోలీసు వాహనం ఎక్కించి చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజ్ మాట్లాడుతూ..గత 40 ఏండ్లుగా ఐసీడీఎస్ డిపార్ట్‌మెంట్‌లో అంగన్వాడీ టీచర్స్ గా, హెల్పర్స్ మినీ టీచర్స్‌గా పని చేస్తున్నా నేటి వరకు ఉద్యోగ భద్రత లేకుండా చాలీచాలని వేతనాలతో ప్రభుత్వాలు వెట్టి చాకిరి చేయిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్‌లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి బేసిక్ పేతో కూడిన వేతనాలు అందించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, గ్రాట్యుటీ రూ.10 లక్షలు ఇవ్వాలని, హెల్త్ కార్డులు ఇవ్వాలని, ఇన్సూరెన్స్ సౌకర్యం, ప్రావిడెంట్ ఫండ్ కల్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం ప్రజాస్వామ్య పద్ధతిలో ధర్నాచౌక్ ఇందిరాపార్కు వద్ద నిరసన కార్యక్రమాలకు అనుమతి ఇవ్వకుండా అడ్డుకోవటం అప్రజాస్వామికమన్నారు. ఉద్యమ నాయకుడైన కేసీఆర్ ఉద్యమాలపై నిరంకుశంగా వ్యవహరించటం సరైంది కాదని హెచ్చరించారు. అనంతరం ఏఐటీయూసీ జాతీయ కమిటీ సభ్యులు వి.యస్.బోస్ మాట్లాడుతూ..కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐసిడిఎస్ రంగాన్ని నిర్వీర్యం చేయటం కోసం ప్రయత్నం చేస్తున్నాయని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టిన బడ్జెట్‌లో ఐసిడిఎస్ రంగానికి చాలా తక్కువగా బడ్జెట్ కేటాయింపులు జరిపారని దీని వలన మాతా శిశుసంక్షేమం కుంటుపడుతుందని వెంటనే ప్రభుత్వాలు పునరాలోచన చేయాలని, తెలంగాణ ప్రభుత్వం రూ.5 వేల కోట్లు బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు పి.ప్రేంపా వని, అధ్యక్షురాలు సాయీశ్వరీ, ప్రధాన కార్యదర్శి ఎన్. కరుణ కుమారి, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి సి.హెచ్. సీతామహాలక్ష్మి లు మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం అంగ న్వాడీ టీచర్ లకు పెడుతున్న అదనపు భారాన్ని తగ్గించాలని, సమాన పనికి సమాన వేతనం ఇచ్చి తెలం గాణ ఆడపడుచులను కేసీఆర్ గౌరవించాలని కోరారు. పెండింగ్ లో ఉన్న టి.ఎ, డి.ఎలు, ఇంటి అద్దెలు, గ్యాస్ బిల్లులు, పౌష్టికాహారం నూనె, పప్పు వెంటనే అందించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శులు నరాటి ప్రసాద్, ఎస్.విలాస్, టేకుమల్ల సమ్మయ్య, పల్లా దేవేందర్ రెడ్డి, అసోసియేషన్ నాయకులు ప్యారీజాన్, లలిత, అరుణ, క్రిష్ణ కుమారి, చంద్రకళ, పద్మ కుమారి, సుమతి, స్వప్న, భాగ్యలక్ష్మి రజిత, మల్లిఖార్జున్, భూక్య శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అరెస్ట్ అయిన రాష్ట్ర నాయకులను విడుదల చేయాలి

చలో అసెంబ్లీ సందర్భంగా హిమాయత్ నగర్, ఏఐటీయూసీ కార్యాలయం ఎదుట పోలీసులు అక్రమంగా అరెస్టు చేసిన అంగన్వాడీ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు ఎస్.కరుణ కుమారి, సాయీశ్వరీ, టేకుమల్ల సమ్మయ్య సీతామహాలక్ష్మి ప్యారీజాన్, చంద్రకళ, పద్మకుమారి, నారం సునీత, అరుణ, భూక్యా శ్రీదేవీతో పాటు మరో 25 మందిని తక్షణమే విడుదల చేయాలని, వివిధ జిల్లాలో చలో అసెంబ్లీకి బయలు దేరిన అంగన్వాడీ టీచర్లను అరెస్టులు చేయటాన్ని ఖండిస్తూ అంగన్వాడీ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు పి.ప్రేంపావని, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజ్, రాష్ట్ర అధ్యక్షులు ఎం.డి. యూసుఫ్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్



నవతెలంగాణ-అంబర్‌పేట

స్థానిక సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. సోమవారం నల్లకుంట డివిజన్ పాత రామాలయం కాలనీలో స్థానిక అధికారులతో కలిసి పాదయాత్ర నిర్వహించి ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో పిల్లలకు ఒక పార్కు ఏర్పాటు చేయాలని, డ్రయినేజీ పైప్ వేయించాలని, సీసీ రోడ్లను నిర్మించాలని, కొన్ని చోట్ల వీధి దీపాలను ఏర్పాటు చేయాలని అలాగే ఎత్తుగా పెరిగిన చెట్లను తొలగించాలని, పారిశుధ్య కార్మికులు రోజు రాకపోవడం వలన వీధులన్నీ అపరిశుభ్రంగా ఉంటున్నాయని ప్రజలు ఈ సందర్భంగా ఎమ్మెల్యే దష్టికి తీసుకువచ్చారు. అందుకు వెంటనే సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే చెట్ల కొమ్మలను తొలగించుట, వీధి దీపాల ఏర్పాటు, పరిశుభ్రత విషయంలో తక్షణమే వారి ఇబ్బందులను తొలగించాలని సంబంధిత అధికారులకు అక్కడే ఆదేశాలు జారి చేశారు. అలాగే ఇతర సమస్యలను కూడా వీలైనంత త్వరగా పరిష్కరిస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ అమత, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు జాబ్ మేళా

నవతెలంగాణ-ఓయూ

నేడు ఓయూలో ఉన్న కాలేజ్ ఆఫ్ టీచర్స్ ఎడ్యుకేషన్ ఆంధ్రమహిళ సభలో జాబ్ మేళా ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్టు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాబ్ మేళాలో అనేక ఇంటర్ నేషనల్, స్టేట్ బోర్డ్ స్కూల్స్ పాల్గొంటాయని చెప్పారు. ఈ జాబ్ మేళాలో బి.ఈడి స్పెషల్ ఎడ్యుకేషన్, పీజీ డిప్లొమా ఇసిఈ, ఎం.ఈడి కోర్సులు పూర్తి చేసిన విద్యార్థిని, విద్యార్థులు అర్హులు అని పేర్కొన్నారు. విద్యార్థులు హాజరు కావాలని కోరారు.

యూనివర్సిటీల్లో ఖాళీల భర్తీకి ప్రొఫెసర్ కాశిం దీక్ష



నవతెలంగాణ-ఓయూ

యూనివర్సిటీల్లో ఖాళీల భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ ఓయూలోని ఆర్ట్స్ కళాశాల తెలుగు విభాగం హెడ్ ప్రో.కాశిం సోమవారం ఆర్ట్స్ కళాశాల ఎదుట దీక్షకు దిగారు. మొదట బోర్డ్ పెట్టి విద్యార్థులకు పాఠం బోధించారు. అనంతరం అయిన అక్కడే దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా ప్రో.కాశిం మాట్లాడుతూ. రాష్ట్రంలో అన్ని యూనివర్సిటీల్లో బోధన బోధనేతర పోస్టులు ఖాళీగా ఉన్నాయని.. దాని ప్రభావంతో యూనివర్సిటీ ర్యాంకింగ్ లో వెనుకపడిపోవడంతో పాటుగా అనేక ఇబ్బందులు ఎదురవ్వడం జరుగుతున్నదన్నారు. యూనివర్సిటీల్లో ఖాళీ పోస్టులతో గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు నాణ్యమైన విద్య దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విశ్వవిద్యాలయాలపై ప్రభుత్వం దృష్టి పెట్టడం లేదని ఆరోపించారు. ఇందుకు ఒక్క సారి కూడా రాష్ట్ర విశ్వవిద్యాలయాల వీసీలతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించకపోవటమే ఉదాహరణగా పేర్కొన్నారు.

ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యార్థులకు తరగతులు బోధిస్తూ ఆర్ట్స్ కళాశాల ఎదుట చేపట్టిన ప్రొ. కాసీం దీక్షకు పలు విద్యార్థి సంఘాలు మద్దతు ప్రకటించారు. సత్వరమే అధ్యాపకుల నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉస్మానియా టీచర్స్ అసోసియేషన్ ఔటా ఉపాధ్యక్షుడు ప్రొ. జి. మల్లేశం, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొ. గణేష్, ప్రొఫెసర్ సూర్య ధనుం జయ్, ప్రొ. నిర్మలాదేవి. ప్రొ. చెన్నప్ప సహా ఆయా సెల్ ల డైరెక్టర్లు ప్రొ. మంగు, డాక్టర్ చలమల్ల వెంకటేశ్వర్లు, చీఫ్ వార్డెన్ డాక్టర్ కొర్రెముల. శ్రీనివాస్, అంబేద్కర్ రీసెర్చ్ సెం టర్ డైరెక్టర్ డాక్టర్ కొండా. నాగేశ్వర్, ప్రో.నిర్మల దేవి, డా.యం శ్రీనివాస్, ఎస్ ఎఫ్ ఐ నేతలు రవి నాయక్, ఆంజ నేయులు, శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు. శిబిరాన్ని సాయంత్రం ఈస్ట్ జోన్ డీసీపీ సునీల్ దత్, కాచిగూడ ఏసీపీ ఆకుల.శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ రమేష్ నాయక్ సందర్శించారు.

బడ్జెట్‌లో వైద్యానికి పెద్దపీట

- నిమ్స్ అనుసంధానాధికారి, తెలంగాణ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మార్త రమేష్



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రతి సామాన్యుడికీ వైద్యం చేరువయ్యేలా ప్రభుత్వం సంకల్పించిందనీ, ఆరోగ్య తెలంగాణే లక్ష్యంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వైద్యానికి పెద్ద పీట వేశారని నిమ్స్ అనుసంధానాధికారి, తెలంగాణ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు, ఆహ అధ్యక్షులు డాక్టర్ మార్త రమేష్ తెలిపారు. సోమవారం రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా మార్త రమేశ్ ఒక ప్రకటన విడుదల చేశారు. పేదలకు ఆరోగ్య ప్రదాయినిగా ఉన్న నిమ్స్ దవాఖానకు ఈ వార్షిక బడ్జెట్‌లో దాదాపుగా రూ.290 కోట్లు కేటాయించడం చారిత్రాత్మకం అన్నారు. కార్పొరేటుకు దీటుగా సామాన్యులకు నాణ్యమైన వైద్య సేవలందిస్తున్న నిమ్స్ దవాఖాన ఈ బడ్జెట్‌తో మరింత పురోభివృద్ధిలోకి తీసుకెళ్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నిమ్స్ దవాఖానకు అత్యధిక బడ్జెటు కేటాయించిన ముఖ్యమంత్రి కేసీఆర్, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావుకు నిమ్స్ యాజమాన్యం, ఉద్యోగుల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

బీసీలకు బడ్జెట్‌ను రూ. 20 వేల కోట్లకు పెంచాలి



నవతెలంగాణ-అంబర్‌పేట

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బీసీలకు రూ. 6,229 కోట్లు కేటాయించారని.. కానీ ఇది బీసీలకు సరిపో దని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాజ్యసభ సభ్యులు అర్. కృష్ణయ్య తెలిపారు. దీనిని రూ. 20వేల కోట్లకు పెంచాలని డిమాండ్ చేశారు. సోమవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో బీసీ జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణతో కలిసి వారు మాట్లాడారు. బడ్జెట్‌లో బీసీలకు సంక్షేమ ానికి రూ. 6,229 కోట్ల కేటాయించారని.. ఇది రాష్ట్రంలోని 52 శాతం జనాభా గల బీసీలకు ఏ మూలకు సరిపోద న్నారు. బడ్జెట్‌లో కొత్త స్కీములు ఏమీ లేవని.. పెరిగిన ధరల ప్రకారం స్కాలర్ షిప్‌లు, మెస్ చార్జీలు పెంచే ప్రస్తావన లేదన్నారు. అలాగే కాలేజీ కోర్సులు చదివే విద్యా ర్థులకు మొత్తం ఫీజులు రియంబర్స్మెంట్ చేస్తామని ముఖ్య మంత్రి ఇచ్చిన హామీకి బడ్జెట్ కేటాయింపు లేదని తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో కొత్తగా 119 బీసీ రెసిడెన్షియల్ పాఠశాలలు ఇస్తామని ఇచ్చిన హామీకి బడ్జెట్ కేటాయించలేదని పేర్కొన్నారు. బీసీ కార్పొరేషన్‌లో 12 బీసీ కుల ఫెడరేషన్ లకు పెండింగ్‌లో ఉన్న 5 లక్షల 47 వేల దరఖాస్తులకు రుణాలు ఇవ్వడానికి కూడా ఈ బడ్జెట్‌లో కేటాయింపులు లేవని చెప్పారు. బీసీ స్టడీ సర్కిల్ బడ్జెట్ కూడా పెంచలేదన్నారు. వెంటనే బీసీ బడ్జెట్ రివైజ్ చేయాలని డిమాండ్ చేశారు. బీసీ కార్పొరేషన్ కు సబ్సిడీ రుణాల కోసం రూ. 4 వేల కోట్ల బడ్జెట్ కేటాయించాలని, ఎంబీసీ కార్పొరేషన్‌కు రూ. 2 వేల కోట్లు కేటాయించాలని, 12 బీ.సి కులాల ఫెడరేషన్లకు జనాభా నిష్పత్తిలో 2 వేల కోట్లు కేటాయించాలని, ఇంజనీరింగ్/ఎంబీఏ/ఎంసీఏ/పీజీ/డిగ్రీ/ ఇంటర్ తదితర కాలేజీ కోర్సులు చదివే బీసీ విద్యార్థుల మొత్తం ఫీజుల స్కీమును పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఎస్.టి/ఎస్.సి/మైనారిటీ విద్యార్థులకు ఇస్తున్న మాదిరిగా బీసీ/ఇబీసి విద్యార్థులకు కూడా పూర్తి ఫీజులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావుకు శుభాకాంక్షలు



నవతెలంగాణ-అంబర్ పేట

రాష్ట్ర బడ్జెట్ ను ప్రవేశపెట్టిన సందర్భంగా రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావును బీఆర్‌ఎస్ నాయకులు దూసరి శ్రీనివాస్ గౌడ్ అసెంబ్లీలో కలసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

9న చలో ఇందిరాపార్క్



నవతెలంగాణ-జూబ్లిహిల్స్

ఇండ్లు లేని కార్మికులందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు ఇవ్వాలి, రేకుల రూమ్ ఉన్నటువంటి వాళ్లకు ఇల్లు కట్టుకోవడానికి 5,00,000 ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 9న చేపట్టిన చలో ఇందిరాపార్క్ జయప్రదం చేయాలని సీఐటీయూ జూబ్లీహిల్స్ జోన్ కమిటీ సభ్యులు రాపర్తి అశోక్ పిలుపునిచ్చారు. సోమవారం చలో ఇందిరాపార్క్ కరపత్రాన్ని కృష్ణకాంత్ పార్కు వద్ద కార్మిక నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా రాపర్తి అశోక్ మాట్లాడుతూ.. 9న కార్మికులందరూ ఉదయం 10 గంటల వరకు ఇందిరాపార్క్ చేరుకోవాలని చెప్పారు. తెలంగాణ వచ్చి 8 సంవత్సరాలు దాటిన ఇప్పటివరకు కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కార్మికులందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ నాయకులు సక్కుబాయి, సరస్వతి, ప్రభావతి, శశికళ ,నవనీత, పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు

సింగరేణి కాలరీస్ గుర్తింపు సంఘం ఎన్నికలు తక్షణమే నిర్వహించాలి



నవతెలంగాణ-అంబర్‌పేట

రాష్ట్ర హైకోర్టు తీర్పు ప్రకారం సింగరేణి కాలరీస్ గుర్తింపు సంఘం ఎన్నికలు తక్షణమే నిర్వహించాలని ఏఐటీయూసీ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. సింగరేణి కాలరీస్ గుర్తింపు సంఘం ఎన్నికలు తక్షణమే జరుపాలని డిమాండ్ చేస్తూ విద్యానగర్ శివమ్ రోడ్డులో ఉన్న కేంద్ర రీజినల్ లేబర్ కమిషనర్ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం వందలాదిమంది సింగరేణి కార్మికులతో భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వాసిరెడ్డి సీతారామయ్య మాట్లాడుతూ సింగరేణి సంస్థలో ఐదేండ్ల క్రితం ఎన్నికలు నిర్వహించగా, రెండేండ్ల కాలపరిమితి అనంతరం తిరిగి ఎన్నికలు నిర్వహిం చాల్సి ఉందని అన్నారు. సింగరేణి యాజమాన్యం, టీబీజీకే ఎస్ కుమ్మక్కై ఎన్నికలు నిర్వహించకుండా మోకాలడ్డుతూ వచ్చాయని ఆరోపించారు. ఓటమి భయంతోనే ఎన్నికలు జరగకుండా కరోనా సాకుతో మూడేండ్లుగా ఎన్నికలు జరగ కుండా కుట్ర చేశారని మండిపడ్డారు. సింగరేణి యాజమాన్యం వేల కోట్ల అవినీతికి పాల్పడుతుందని, అవినీతిని ప్రశ్నిస్తామని గుర్తింపు సంఘం ఎన్నికలు జరపడంలేదని అన్నారు. సింగరేణిలో ఎన్నికలు నిర్వహించాలని కేంద్ర కార్మిక శాఖల అధికారులపై హైకోర్టులో కేసు వేశామని తెలిపారు. దీనిపై కోర్టు సింగరేణిలో తక్షణమే ఎన్నికలు నిర్వహించాలని ఆర్డర్స్ జారీచేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ సీనియర్ నాయకులు వి.ఎస్.బోస్, రాష్ట్ర కార్యదర్శి బి. వెంకటేశం, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అదనపు ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య ఉప ప్రధాన కార్యదర్శులు కె. సారయ్య, కె. రాజ్ కుమార్, కె. వీర్ భద్రయ్య, ఎస్.కె. సైదా, వైవి. రావు, సలహాదారు డి. శేషయ్య, వంగ వెంకటి, ఎల్. ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మానవ మనుగడ ఉన్నప్పటి నుంచి ఆయుర్వేదం

- ప్రముఖ ఆయుర్వేద వైద్య నిపుణురాలు డాక్టర్ మృదుల



నవతెలంగాణ- బంజారాహిల్స్

ఆయుర్వేద అలోపతి రెండింటికి తల్లి లాంటిది సైన్స్. అయితే మానవ మనుగడ ఉన్నప్పటి నుంచి ఆయుర్వేదం ఉందని ప్రముఖ ఆయుర్వేద వైద్య నిపుణురాలు డాక్టర్ మృదుల అన్నారు.దాదాపుగా 3 వేల నుంచి 5 వేల సంవత్సరాల పురాతన చరిత్ర కలిగిన చికిత్స ఆయుర్వేదమని ఆమె తెలిపారు. 1978(డబ్ల్యూహెచ్‌ఓ) ఆయుర్వేదం సైంటిఫిక్ చికిత్సలయంలో గుర్తించడం జరిగిందని ఆమె గుర్తు చేశారు. తాజాగా ఆమె నవతెలంగాణతో ఆయుర్వేదం గురిం చి వివరించారు. అది ఆమె మాటల్లోనే..

'వైద్యులు ఇచ్చే బూస్టర్‌ను రసాయన చికిత్స అంటారు. అలాగే ఎనిమిది రకాలు అంటే (అష్టంగం) సూపర్ స్పెషాలిటీ వైద్య చికిత్సలను అందించేదాన్ని వాచీకరణ చికిత్స అంటాన్నారు. అలోపతికి ఆయుర్వేదకు తేడాలు స్పష్టంగా కనిపిస్తాయి. ఆయుర్వేద సహజ సిద్ధంగా ఉండమని తినే పదార్థాలు కూడా సహజ సిద్ధంగా ఉండేవే తినాలని తెలియజేస్తుంది. దాని ద్వారా అనారోగ్యాల బారిన పడే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయి.

అలోపతిలో మాత్రం చిన్నపాటి జలుబు, దగ్గు, జ్వరం వచ్చినా ఆదాయం కోసం లేదా యజమాన్యం లాభం కోసం ఇష్టానుసారంగా మందులు రాసిచ్చి ప్రజల ఆరోగ్యాన్ని కొంతమేర నష్టపరుస్తున్నారని అది ప్రభుత్వం దృష్టిలో పడగానే వాటిపై చర్యలు తీసుకున్న సంఘటనలుగా ఉన్నాయి. ఆయుర్వేదంలో ఎప్పుడు ఆరోగ్యాన్ని కాపాడటానికి దినచర్య, రుతు చర్య సూత్రాలను పాటించమని తెలియజేస్తుంది. రోజు మనం చేసుకునే కార్యకలాపాలతో పాటు తీసుకునే ఆహారం సమయపాలన దినచర్యలో భాగం. ఇక రుతు చర్య అంటే ఉదయం లేవగానే దంతాలు శుభ్రం చేసుకునే దగ్గర నుంచి ప్రారంభమయ్యే కార్యకలాపాలన్ని రుతు చర్యలో భాగం ముఖ్యంగా యోగా, వ్యాయామం వ్యాయామం తప్పనిసరిగా పరిగడుపునా చేయాలి, చాలామంది ఇది తెలియక నీళ్ల తాగి ఆహారం తీసుకుని చేస్తుంటారు. అది ఆరోగ్యానికి ముప్పు.

ఎవరైనా రోగులు లేదా సాధారణ మానవులు తమ జీవితంలో మార్పు కనిపిస్తే తాను వారికి చిన్న చిన్న కషాయాలతో పాటు వ్యాధి అధికంగా ఉంటే దానికి సరిపోయే వివిధ రకాల మసాజ్‌లు, ప్రత్యేక ఆయుర్వేద మందులు అందించి సీజనల్ గా వచ్చే కూరగాయలు, పండ్లు ఆహారపు పప్పు దినుసులు తినమని సూచిస్తాము. ప్రస్తుతం జీవనశైలిలో నిద్రలేమి ఒత్తిడి ఇతరత్రా కార్యకలాపాల వల్ల అనేక ఆరోగ్య సమస్యల్ని కొందరు కొని తెచ్చుకుంటున్నారు. పెద్దవాళ్ల లేదా తల్లిదండ్రులు పాటించే వివిధ విధానాలను పిల్లలు అనుసరిస్తారు. ఈ క్రమంలో మొబైల్ ఫోన్లుచ టీవీ, లాప్‌టాప్, కంప్యూటర్ వంటివి అత్యధికంగా వాడడం వలన పిల్లలు సైతం దానినే కోరుకుంటున్నారు. లేని పక్షంలో గొడవకు దిగే పరిస్థితి అనేక నివాసాల్లో మనం చూస్తున్నాం. దీనంతటికీ కారణం వారికి ఉదయం సూర్య నమస్కారం, యోగా, పుస్తక పఠనం, పెద్దవాళ్లు లేకపోయేసరికి వివిధ కథలు పురాణాలు ఉండకపోవడం. 40 సంవత్సరాల క్రితం అత్యధికంగా ఉమ్మడి కుటుంబాలు ఉండేవి. అలాగే ఆ కాలంలో కొందరు నలుగురు నుంచి ఐదుగురు మరి కొంత మంది పదిమం ది పిల్లలు కనేవారు అయినా వంద సంవత్సరాలు జీవించేవారు.

కల్తీని అరికట్టడం అంత సులువైన విషయం కాదు. ప్రభుత్వం చర్యలు తీసుకున్నా అవి వారిని ఏమి చేయలేకపో తున్నాయి. మరో మార్గాన్ని వెతుక్కుని కల్తీకి పాల్పడేవారు రోజురోజుకి పెరిగిపోతున్నారు. మరీ మెట్రో నగరాల్లో ఈ తంతు అత్యధికంగా ఉంది. ముఖ్యంగా విధులు నిర్వహణలో ఉండే పలువురు రహదారులపై హోటళ్లలో ఇష్టానుసారంగా భోజనాలు, తినుబండారాలు తిని షుగర్,డయాబెటిస్ కిడ్నీ సంబంధిత వ్యాధులకు గురవుతున్నారు.

ఆరోగ్యానికి వీటివల్ల డేంజర్...

కోల్డ్ స్టోరేజ్ లో పండ్లను పెట్టడం వలన సీజనల్‌గా కాకుండా అన్ సీజన్‌లో దొరికే వివిధ పండ్లు, రసాలు, కూల్‌డ్రింక్‌లు, మద్య పానం, ధూమపానానికి అలవాటైన వారు గుండెపోటుతో బ్రెయిన్ స్ట్రోక్‌తో మరణించడం కూడా అత్యధికంగా చూస్తున్నాం.' అని ఆమె వివరించారు.

ఆయుర్వేద ధరలు అత్యధికం వ్యాపార దోష చేస్తున్నారని ప్రశ్నించగా డాక్టర్ మదుల సమాధానమిస్తూ.. ఆయుర్వేదంలో సహజసిద్ధమైన కషాయాలు తయారు చేస్తారని దాని ప్రాసెస్ కూడా ఆ విధంగా ఉంటుందన్నారు. అలోపతిలో అవేవీ ఉండదని తీసుకోవాల్సిన ఫార్మట్ ప్రకారం పూర్తి చేస్తారనీ దానికి దీనికి చాలా తేడా ఉందని తెలిపారు. అడవులు అంతరించిపోవడం ఒక భాగమైతే ఆ చెట్లను పెంచి దాని ద్వారా రసాయనాలు తయారు చేసి అందించడం వలన ధరలు నిర్దిష్టంగా ఉంటాయని, అలోపతివలె డిస్కౌంట్ ఇచ్చే విధానం కూడా ఇందులో ఉండదన్నారు. ఫార్మాట్ల వారీగా చూసుకుంటే చాలా మార్పులు ఉంటాయన్నారు.

శారీరక శ్రమ ఎంతవరకు..?

చాలామందికి శారీరక శ్రమపై అసలు అవగాహన ఉండదని వ్యవసాయం ఇతర పనులు చేసేవారు నిర్దిష్ట సమయాన్ని పాటిస్తూ భోజనాలు చేస్తూ నిరదిష్ట సమయంలో నిద్రపోతారని డాక్టర్ మదుల చెప్పారు. అందుకే వారికి వ్యాధులు ఎక్కువగా రావని కొన్ని జబ్బులు కుటుంబ పర్యపరంగా లేదా వంశపరంగా ఉంటాయని అవి 50 నుంచి 40 వరకు ఉంటాయన్నారు. ప్రస్తు తం ఫ్రిజ్‌లో నిల్వ ఉంచిన పదార్థాలు తీసుకోవడం, వేడి నీళ్ల కోసం హీటర్లు వాడడం, ఆకలి వేస్తున్న సమయంలో ఆకలిని ఆపుకో వడం, నిద్ర వస్తున్న సమయంలో నిద్రపోకపోవడం, ఒకే దగ్గర కూర్చుని పనిచేయడం వంటి వాటి వలన తొందరగా అనారోగ్యాలకు గురవుతారని హెచ్చరించారు.

ఆరోగ్యానికి పంచ సూత్రాలు..

ఆకలి వేసే సమయంలో తినడం, సరైన సమయంలో నిద్రపోవడం, సమయపాలనను తప్పకుండా పాటించడం, ప్రాణామయ యోగా ద్వారా ఆలోచన శైలి మంచి విధంగా లేదా మనసుని ఆధీనంలో ఉంచుకోవడం వలన, కుండనీరు, మజ్జిగ, నాన్ వెజ్ కంటే వెజ్ ఆహారాన్ని తీసుకోవడం మంచిదని తెలిపారు.ప్రతి ఒక్క విధానాన్ని సంపూర్ణంగా నమ్మి ఎన్నారైలు సైతం ఆయుర్వేదను మొగ్గు చూపుతున్నారని విషయాన్ని గుర్తించి యోగ, సూర్య నమస్కారం, అష్టంగయోగ, ప్రత్యహర, యోగాలతో శరీరాన్ని నిలకడగా ఉంచితే అనారోగ్యాల బారిన పడకుండా ఉంటారన్నారు.

ఆయుర్వేద పై అవగాహన తీసుకురావడానికి ప్రతి నెల ఒకసారి ఉచితంగా అవగాహన శిబిరం ఆరోగ్య సమస్యలు ఏమైనా ఉంటే చికిత్స అందించే ప్రత్యేక ప్రయత్నాలు పంజాగుట్టలోని తమ ఆయుర్వేద సెంటర్లో ప్రారంభించామని దీని కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అందరూ భాగస్వాములు కావచ్చు అన్నారు. సోమాజిగూడ రాజభవన్ రోడ్ లోని యశోద హాస్పిటల్ లైన్ లో ఉన్న ఆస్పత్రి కేరళ ఆయుర్వేద లిమిటెడ్‌కు నేరుగా లేదా మొబైల్ నెంబర్లు 998090334/04023378813 ద్వారా సంప్రదించాలని కోరారు.

ఇందిరానగర్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి

నవతెలంగాణ-బాలానగర్



కూకట్‌పల్లి సర్కిల్ బాలానగర్ డివిజన్ పరిధిలోని ఇందిరానగర్‌లో డ్రయినేజీ, తాగు నీటి పైప్ లైన్ల సమస్య కోసం కాలనీవాసులు ఎమ్మెల్యే మాధవరం కృష్ణా రావు దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ఆయన సోమవారం స్థానిక కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డితో కలిసి ఇందిరానగర్ లోని ఆయా ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు కాలనీలో డ్రయినేజీ సమస్యను పరిశీలించి మంచినీటి సమస్య తలెత్తకుండా పైపులైన్ల నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేసి సమస్యను తక్షణమే పరిష్కరించాలని వాటర్ వర్క్ మేనేజర్ వెంకటేశ్వరరావుకు ఆదేశాలు జారీ చేశారు. ఎంతోమంది నిరుపేదలు ఉండే ఈ కాలనీలో రోడ్లు పూర్తి చేసుకున్నామనీ, త్వరలోనే డ్రయినేజీ, తాగునీటి సమస్యలను కూడా పరిష్కరిస్తామని బస్తీవాసులకు హామీనిచ్చారు.

క్యాన్సర్ విద్యార్థికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-కూకట్ పల్లి



క్యాన్సర్‌తో బాధపడుతున్న సాటి విద్యార్థికి ఆర్థిక సాయం అందించి తమ అభిమానాన్ని ప్రేమను చాటి చెప్పారు తోటి విద్యార్థులు. కూకట్ పల్లి డివిజన్, దీనబంధు కాలనీకి చెందిన గ్లోబల్ మోడల్ హైస్కూల్‌లో యూకేజీ చదువుతున్న ఆశ్రీత్ క్యాన్సర్ తో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న గ్లోబల్ మోడల్ హై స్కూల్ కరస్పాండెంట్ సీహెచ్ వెంకటస్వామి, ప్రిన్సిపాల్ నాగరాజులు ఆ విద్యార్థికి ఆర్థిక సాయం చేయాలని పాఠశాల విద్యార్థులకు సూచించారు. దీంతో విద్యార్థులు తమ తోటి విద్యార్థి మరికొన్ని రోజులు బతకాలని ఆశతో తమ వంతు సహాయంగా, ప్రతి విద్యార్థి తమకు తోచినంత ఆర్థిక సాయం అందజేశారు.

ఈ సారైనా మెట్రోకు నిధులు విడుదలయ్యేనా..?

- మొత్తం రూ.2500 కోట్లు కేటాయింపు
- పాతబస్తీ మెట్రో విస్తరణకు, ఎయిర్‌పోర్టు మెట్రో ఎక్స్‌ప్రెస్‌కు రూ.500 కోట్ల చొప్పున కేటాయింపు

నవతెలంగాణ-సిటీబ్యూరో



రాష్ట్ర బడ్జెట్‌లో మెట్రో రైల్ ప్రాజెక్టులకు రూ.2500 కోట్లు కేటాయించారు. గతేడాది బడ్జెట్‌లోనూ ఇంచుమించుగా ఇంతే స్థాయిలో నిధులు ప్రతిపాదించారు. కానీ సంబంధిత పనుల కోసం సర్కారు ఒక్క రూపాయి కూడా మంజూరు చేయలేదు. తాజా బడ్జెట్‌లో హైదరాబాద్ రైలు ప్రాజెక్టుకు రూ.1500 కోట్లతో పాటు అదనంగా పాతబస్తీ మెట్రోకు రూ.500 కోట్లు, రెండో దశ మెట్రో రాయదుర్గం నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు 31 కి.మీ మెట్రో ఎక్స్‌ప్రెస్‌కు రూ.500 కోట్లు కేటాయించారు.

ఈ పైసలతో ముందుకు పడేనా?

రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ మెట్రో రెండో దశ ప్రాజెక్టును సాంకేతికంగా, అత్యాధునిక టెక్నాలజీతో ఎయిర్‌పోర్టు మెట్రో ఎక్స్‌ప్రెస్‌ను తీసుకురావాలని నిర్ణయించింది. ఇందుకు డిసెంబర్ 9న రాయదుర్గం టు శంషాబాద్ మెట్రో కారిడార్‌ను సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేశారు. ఇప్పటికే మెట్రో నిర్మాణ పనుల కోసం ఐదు కన్సార్షియంలను ఏర్పాటు చేయగా.. ప్రస్తుతం అలైన్‌మెంట్ ఖరారు చేసే యోచనలో కసరత్తు చేస్తున్నారు. రాయదుర్గం నుంచి విమానాశ్రయం వరకు నిర్మించనున్న మొత్తం 31 కి.మీ ఈ మెట్రో కారిడార్‌కు రూ.6250 కోట్లు ఖర్చవుతుందని అంచనా. ఆ ఖర్చును పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని ప్రకటించిన విషయం తెలిసిందే. కానీ సోమవారం శాసనసభలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఎయిర్‌పోర్టు మెట్రో ఎక్స్‌ప్రెస్‌కు కేవలం రూ.500 కోట్లు మాత్రమే ప్రతిపాదించింది. ఈ ప్రాజెక్టుకు రూ.6,250 కోట్ల వ్యయం అవుతుంది. కానీ రూ.500 కోట్లు మాత్రమే కేటాయించడంతో ఈ పైసలతో పనులు ముందుకు ఎలా పడుతాయో అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పాతబస్తీకి మెట్రో కలేనా..?

మెట్రో నిర్మాణం పనులు ప్రారంభమై ఆరేండ్లు గడించింది. మొదటి దశ ప్రతిపాదిత కారిడార్‌లో 72 కిలో మీటర్లకు 69 కి.మీ. మేర రైళ్లు పరుగులు పెడుతున్నాయి. కానీ, పాతబస్తీలో 5.5 కి.మీ మార్గం పనులు ఆరేండ్లు గడిచినా అడుగు ముందుకు పడడం లేదు. 2022-23 బడ్జెట్‌లో పాతబస్తీ మెట్రో విస్తరణ పనుల కోసం సర్కారు రూ.500 కోట్లు ప్రతిపాదించింది. కానీ నిధులు మంజూరు చేయలేదు. తాజా బడ్జెట్‌లో మళ్లీ (2023-24) రూ.500 కోట్లు కేటాయించారు. దీంతో పాతబస్తీలో మెట్రో రైల్ పనులు పూర్తవుతాయని అందరూ భావిస్తున్నారు. ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు 5.5 కి.మీ మార్గం ఏర్పాటు ప్రక్రియకు అవాంతరాలు ఏర్పడి పనులు నిలిచిపోయాయి. వాస్తవానికి చిన్న మార్గమే అయినా వెయ్యికిపైగా ఆస్తులు సేకరించాల్సి ఉంది. ఇందుకు రూ.వంద కోట్లకుపైగా నష్టపరిహారం చెల్లించాల్సి ఉంటుంది. మరో 69 వరకు ప్రార్థనా స్థలాలు దెబ్బతినకుండా మార్గాన్ని రూపొందించడం, మెట్రో పనులు చేపట్టేందుకు అవసరమైన రైట్ ఆఫ్‌వే స్థలాన్ని సేకరించడం వంటి పనులు ఇబ్బందికరంగా మారాయి. ఏండ్ల తరబడి పనులు పెండింగ్ పడుతుండటంతో నిర్మాణ వ్యయం కూడా భారీగా పెరిగే అవకాశం ఉంది. ఎంజీబీఎస్ టు ఫలక్‌నుమా మధ్య మిగిలిన మెట్రో పనులు పూర్తి చేయాలంటే దాదాపు రూ.2వేల కోట్ల వరకు ఖర్చు అవుతుందని అంచనా. మరోవైపు ప్రభుత్వం స్వల్ప కేటాయింపులతో సరిపెడుతోంది. గత బడ్జెట్‌లో రూ.500 కోట్లు కేటాయించినా మంజూరు చేయలేదు. తాజా బడ్జెట్‌లోనూ రూ.500 కోట్లు కేటాయించింది. మరి ఈసారైనా నిధులు మంజూరు చేస్తుందా? లేదా అదే సీన్ రీపిట్ అవుతుందా? అనేది వేచి చూడాల్సిందే.

వైజ్ఞానిక ప్రదర్శనలతో పెరుగనున్న మేధాశక్తి



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

చిన్ననాటి నుంచే వైజ్ఞానిక ప్రదర్శనలు తయారు చేయడం ద్వారా విద్యార్థుల్లో మేధాశక్తి పెంపొందుతుందని కుత్బుల్లాపూర్ మండల విద్యాధికారి వి. ఆంజనేయులు పేర్కొన్నారు . సోమవారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి మగ్దుమ్ నగర్ సమీపంలోని భగత్ సింగ్ మార్గ్‌లో గల శ్రీ సాయి విద్యానికేతన్ స్కూల్లో పాఠశాల చైర్మన్, కరస్పాండెంట్, మేడ్చల్ జిల్లా ట్రస్మా ఉపాధ్యక్షులు బీరు ఆంజనేయులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన(ఎడ్యుకేషనల్ ఫెస్ట్ -2023)వైజ్ఞానిక ప్రదర్శనను మేడ్చల్ జిల్లా ట్రస్మా అధ్యక్షులు కే.రామేశ్వర్ రెడ్డి, పలువురు కరస్పాండెంట్లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసి ఉన్నతులుగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులు చదువుకున్న చదువును ప్రయోగాత్మకంగా ప్రాజెక్టులను తయారు చేయడంలో ప్రతిభ చూపిస్తే భవిష్యత్తులో సత్ఫలితాలు సాధిస్తారని పునరుద్ఘాటించారు. ఇలాంటి ప్రాజెక్టులు భవిష్యత్తులో ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రస్తుతం విద్యా వ్యవస్థలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అన్ని విధాలుగా ప్రోత్సహించాలనీ, అప్పుడే అనుకున్న గమ్యాన్ని సాధిస్తారన్నారు. విద్యతోపాటు శాస్త్ర సాంకేతిక రంగంలో రాణించి దేశ ప్రతిష్టను ఇనుమడింపజేయాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన పలు నమూనాలను విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో కలిసి తిలకించారు. ప్రదర్శనలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రశంసించారు. పాఠశాల యాజమాన్యాన్ని, అధ్యాపక బృందాన్ని, మండల విద్యాధికారి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బీరు శోభారాణి, పలు పాఠశాలల కరస్పాండెంట్లు వినోద్ జాదవ్, ప్రవీణ్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు చంద్రయ్య, ఉపాధ్యాయులు భాగ్యరేఖ, కృష్ణవేణి, మల్లేశ్వరి, కే.రజిత, రత్న కుమారి, అన్నే ఫాతిమా, ప్రశాంతి, సుభాషిని, లక్ష్మీ ప్రసన్న, సాజిత పాల్గొన్నారు.

డివిజన్ సమస్యలపై జోనల్ కమిషనర్‌కు నివేదిక

నవతెలంగాణ-కూకట్ పల్లి



కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మమతను వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆల్విన్ కాలనీ డివిజన్ పాదయాత్ర సందర్భంగా తమ దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించాలని గజ్జల యోగానంద్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని ఆల్విన్ కాలనీ డివిజన్‌లో జనవరి 23వ తేది నుంచి ఫిబ్రవరి 5 వ తేదీ వరకు నిర్వహించిన పాదయాత్రలో ప్రజా సమస్యలైన, రోడ్లు సరిగ్గా లేకపోవడం, డ్రైనేజ్ సమస్య, నీటి కొరత, వీధి దీపాల కొరత, ఎక్కడి చెత్త అక్కడే నిలువ ఉండడం, మొదలగు సమస్యలను ప్రజలు మా దృష్టికి తీసుకువచ్చారనీ. ఈ సమస్యల నివేదికను జోనల్ కమిషనర్‌కు అందించి త్వరలోనే వీటిని పరిష్కరించాలని కోరినట్టు తెలిపారు.ఈ కార్యక్రమంలో విజిత్ వర్మ, రామరాజు, కేశవ రావు, రమేష్, రామకృష్ణ, కమలాకర్, గణేష్, ఉపేందర్, పాల్గొన్నారు.

హాత్ సే హాత్ జోడో యాత్ర అడ్డగింపు



నవతెలంగాణ-బాలానగర్

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ అధికార పార్టీ నాయకులు అప్రజాస్వామికంగా వ్యవహరించడం హేయ మైన చర్య అని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జ్యోత్స్న శివారెడ్డి అన్నారు. సోమవారం భారత్ జోడో యాత్రకు కొనసాగింపుగా హత్ సే హాత్ జోడో యాత్రను కొంపల్లి లోని ఉమామహేశ్వర కాలనీలో ప్రారంభించారు. కాలనీ లో ముందుకు సాగుతున్న యాత్రను బీఆర్ఎస్ కార్యక ర్తలు అడ్డుకుని తీవ్ర వాగ్వాదానికి దిగారు. దీంతో ఆగ్రహానికి గురైన జ్యోత్స్న శివారెడ్డి దేశ ఐక్యత, ప్రగతి కోసం, బడుగు, బలహీన, పీడిత వర్గాలు, పేద ప్రజల సంక్షేమం కోసం భారత్ జోడో యాత్రకు కొనసాగింపుగా ప్రారంభమైన ఈ యాత్రను బీఆర్ఎస్ కార్యకర్తలు అడ్డుకోవడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే అన్నారు. ప్రతి వర్షా కాలంలో వరదలతో ఆర్థికంగా, మానసికంగా, ఆరోగ్యపరంగా సతమతమవుతున్న కొంపల్లి, ఉమామహే శ్వర కాలనీ ప్రజల సమస్యలు తెలుసుకుంటూ, రాహుల్ గాంధీ ఐక్య సందేశాన్ని ప్రజలకు చేరువ చేస్తుంటే దిగజారుడు తనంతో ప్రజాస్వామ్యాన్ని అవహేళన చేస్తూ, అమాయక ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా హత్ సే హాత్ జోడో యాత్రను అడ్డుకోవడం పై ప్రజలే సరైన సమాధానం చెబుతారన్నారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ కార్యకర్తలపై పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రతినిధి కొలన్ హనుమంత్ రెడ్డి, శివ కుమార్ గౌడ్, బైరి ప్రశాంత్ గౌడ్, ఉపేందర్ రెడ్డి, కావలి గోపాల్, వెంకటయ్య, కందాడి సుదర్శన్ రెడ్డి, ఉమామహేశ్వర కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

అంబులెన్స్ ప్రారంభం

నవతెలంగాణ-కూకట్‌పల్లి



టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి చేపట్టిన హత్ సే హత్ జోడో అభియాన్ యాత్ర ప్రారంభం సందర్భంగా కూకట్ పల్లి 121 డివిజన్ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిముక్కల విశ్వ తేజేశ్వర్ రావు ఆధ్వర్యంలో అంబులెన్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ అంబులెన్స్‌ను కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకులు, టీటీపీసీసీ డెలిగేట్ సభ్యులు గొట్టిముక్కల వెంగళరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బషీర్ భాయ్, గుడేపు నాగార్జున, సునీల్ యాదవ్, అరవింద్ రెడ్డి, నాగార్జున, గురు మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్ కేటాయింపుల వరకే పరిమితమైన ప్రభుత్వం

నవతెలంగాణ-దుండిగల్



2014 నుంచి నుండి నేటి వరకు దళిత సంక్షేమానికి కేటాయిస్తున్న బడ్జెట్ కాగితాల్లో అంకెలు పెరుగుతున్నాయి కానీ పెరిగిన అంకెల్లో సగం కూడా ఖర్చు చేయట్లేదనీ, సగం కూడా ఖర్చుకానీ సంకెలు పెరిగితే దళితులకు ఒరిగేదేంటని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) జిల్లా కమిటీ విమర్శించింది. దళితుల మౌలిక ప్రయోజనాల కోసం ప్రతి పైసా ఖర్చు చేయాలని కేవీపీఎస్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. బడ్జెట్‌లో నిధుల కేటాయింపు పెంపుదలను బట్టి హర్షం వ్యక్తం చేయాల్సిందే తప్ప అది ఖర్చు చేయని వైనాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగనిగళల బాలపీరు తెలిపారు. ఎస్సీ ప్రత్యేక అభివృద్ధి నిధి కింద గతేడాది రూ.33,907కోట్లు కేటాయిచగా.. ఈసారి రూ.36,750 కోట్లు కేటాయించారని తెలిపారు. నిధులను ఖర్చు చేయకుండా దళిత సాధికారత ఎలా సాధ్యం అన్నారు. ప్రత్యేక నోడల్ అధికారిని నియమించి ప్రత్యేక అభివృద్ధి నిధులు ఖర్చు చేయాలన్నారు. ఆ నిధులు ఖర్చు చేయకపోతే దళితుల బడ్జెట్ కాగితాల్లోనే నిధులు కన్పిస్తాయన్నారు. దళితుల ఇండ్లు, విద్య ఉపాధి, వైద్యం, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక సమస్యలు ఎలా పరిష్కరిస్తారని చెప్పారు. దళిత బంధు కోసం గతేడాది కేటాయించిన రూ.17,700కోట్లు, ఈ ఏడాది కూడా నియోజకవర్గానికి 1100 మందికి దళిత బంధు ఇస్తామన్నారనీ, గత నిధులు కూడా విడుదల కాక దళితబంధు నత్తనడకలో ఉందన్నారు. మూడెకరాల భూమి ఊసేలేదన్నారు. దళిత సంక్షేమం కింద 40శాఖలకు కేటాయిస్తున్న సక్రమంగా ఖర్చు చేయడం లేదన్నారు. దళితుల ఉచిత విద్యుత్ 200 యూనిట్లకు పెంచి దాని కోసం నిధులు కూడా పెంచాలన్నారు. అంబేద్కర్ ఓవర్సీస్ ఉన్నత విద్య కోసం ఏటా కనీసం 2000 మందిని విదేశాలకు పంపాలన్నారు.

కేపీహెచ్‌బీ డివిజన్ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

కేపీహెచ్‌బీ డివిజన్ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళున్నామని స్థానిక డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాస్ రావు అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని 6వ ఫేస్‌లోని మల్టీపర్పస్ క్రీడా ప్రాంగణాన్ని, మోడల్ మార్కెట్ ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడున్న క్రీడాకారులను మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు నాయకత్వంలో కేపీహెచ్‌బీ డివిజన్‌లో ఎక్కడ ఎలాంటి సమస్య లేకుండా అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళుతున్నామన్నారు. ఎక్కడ ఖాళీ స్థలాలు ఉన్నా ప్రజలకు ఉపయోగపడే విధంగా కమ్యూనిటీ హాళ్లు, పార్కులు క్రీడా మైదానాలుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. భవిష్యత్ తరాలకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. యువత వీటిని సద్వినియోగం చేసుకుని క్రీడల్లో రాణించి దేశానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వాల వ్యతిరేక విధానాలను ప్రజలకు తెలియజేస్తాం

నవతెలంగాణ-బాలానగర్



హాథ్ సే హాథ్ జోడో అభియాన్ కార్యక్రమాన్ని సోమవారం కూకట్ పల్లి నియోజకవర్గంలో పీసీసీ సభ్యులు డా.సత్యం శ్రీరంగం ప్రారంభించారు. బాలానగర్ డివిజన్ పరిధిలోని ఫిరోజ్ గూడలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ముందు నాయకులతో బైఠాయించి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డా.సత్యం శ్రీరంగం మాట్లాడుతూ రాహుల్ గాంధీ సందేశాన్ని కూకట్ పల్లి నియోజక వర్గ ప్రజలకి ఇంటింటికీ వెళ్లి తెలియజేస్తామన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండింటి మీద చార్జి షీట్ విడుదల చేసిందనీ, అనేక అబద్ధపు వాగ్దానాలు చెప్పి అధికారంలో వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం నేటికీ అవి నిర్వహించలేదనీ, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, నిరుద్యోగ భృతి వంటి హామీలు అమలు చేయలేదనీ, దేశంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థల్ని తెగనమ్ముకుంటూ, కేవలం మతం ఆధారంగా దేశాన్ని విచ్ఛిన్నం చేసే విధంగా ప్రయత్నం చేస్తుందన్నారు. ఆ ప్రయాత్నాల్లో ప్రజలను చైతన్య వంతం చేసే దిశగా భారత్ జోడో యాత్ర, హాథ్ సే హాథ్ జోడో అభియాన్ ఒక ప్రధాన లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి పుష్పారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు దుర్గారాణి, ఏ బ్లాక్ అధ్యక్షులు పి.నాగిరెడ్డి, నల్లోల రాజేందర్, మధు మోహన్, జావీద్ ఆలీ, విట్టల్ రెడ్డి, కొన్నింటి శామ్యూల్, బంధిగ బాల నర్సింహా, నరసింహ యాదవ్, జ్యోతి, మొయినోద్దీన్, చిటుకోరు కృష్ణ, క్రిష్ణ రాజ్ పుత్, మట్టే ప్రసన్న కుమార్, మధు గౌడ్, మహేందర్, ముఖేందర్, హేమంత్, జల్లా శివ, సూర్య, శేఖర్ గజానంద్, మాదరి శ్రీను, భరత్, పుట్టపాక మధు, చంటి సింగ్ పాల్గొన్నారు.



మన ఊరు-మనబడి

అమలుకు నిధులేవీ?

గత బడ్జెట్ వివరాలే మళ్లీ ప్రస్తావన

- విద్యకు రూ.19,051 కోట్లు కేటాయింపు
- గతేదాది కంటే 0.32 శాతం పెరుగుదల



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

విద్యారంగానికి స్వల్పంగా ఊరట లభించింది. 2023-24 బడ్జెట్‌లో విద్యకు రూ.190,51.25 (6.56 శాతం) కోట్లు కేటాయించింది. ప్రస్తుత (2022-23) బడ్జెట్‌లో ఆ రంగానికి రూ.16,043 (6.24 శాతం) కోట్లు ప్రతిపాదించింది. అంటే గత బడ్జెట్ కంటే ఇప్పుడు రూ.3,008 (0.32 శాతం) నిధులు పెరగడం గమనార్హం. అయితే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన మన ఊరు-మనబడి పథకానికి నిధుల కేటాయింపే చేయలేదు. గతేడాది బడ్జెట్‌లో చెప్పిన అంకెలనే మళ్లీ ప్రస్తావించడం గమనార్హం. 'రాష్ట్రవ్యాప్తంగా 26,065 పాఠశాలల్లో మూడు దశల్లో మౌలిక సదుపాయాలను కల్పించడం కోసం రూ.7,289 కోట్లు కేటాయించింది. మొదటి దశలో భాగంగా 9,123 పాఠశాలల్లో రూ.3,497 కోట్లతో మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నది. వీటిలో ఇప్పటికే చాలా స్కూళ్లలో పనులు పూర్తయ్యాయి. ఊరూరా ఉత్సవంలా సంబురంగా ప్రారంభోత్సవాలు జరుపుకుంటున్నారు.'అంటూ ప్రభుత్వం ప్రకటించింది. కానీ 2023-24 విద్యాసంవత్సరం రెండోదశలో ఎన్ని పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఎన్ని నిధులు కేటాయిస్తున్నారో స్పష్టత ఇవ్వలేదు. ఆ పథకం వచ్చే ఆర్థిక సంవత్సరంలో అమలు చేసేందుకు నిధులను కేటాయించకపోవడం గమనార్హం. కొఠారి కమిషన్ సిఫారసుల ప్రకారం విద్యారంగానికి రాష్ట్ర బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయించాలి. ఆ లెక్కన రూ.87,118.8 కోట్లు ప్రతిపాదించాలి. విద్యకు 24 శాతం, వైద్యానికి 12 శాతం నిధులు కేటాయించాలంటూ తెలంగాణ పౌర స్పందన వేదిక (టీపీఎస్వీ) విశ్వవిద్యాలయాలు, పలు విద్యాసంస్థల్లో సంతకాల సేకరణ చేపట్టింది. దీని ప్రకారం చూసినా రూ.69,695.04 కోట్లు కేటాయించాలి. విద్యకు కనీసం 20 శాతం నిధులు కేటాయించాలంటూ ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ లెక్కన అయినా రూ.58,079.2 కోట్లు ప్రతిపాదించాలి. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఇవేవీ పట్టించుకోలేదు. మొత్తం బడ్జెట్ రూ.2,90,396 కోట్లలో విద్యకు కేవలం రూ.19,051 (6.56 శాతం) నిధులు మాత్రమే కేటాయించింది. ఇందులో పాఠశాల విద్యకు రూ.16,050.4 కోట్లు, ఉన్నత విద్యకు రూ.2,541.74 కోట్లు, సాంకేతిక విద్యకు రూ.459.25 కోట్లు ప్రతిపాదించింది. 2014-15లో మొత్తం బడ్జెట్ రూ.1,00,637 ప్రతిపాదించగా, విద్యారంగానికి రూ.10,956 (10.88 శాతం) కేటాయించింది. ఈ లెక్కన చూసినా 2023-24 బడ్జెట్‌లో రూ.31,595.08 కోట్లు కేటాయించాల్సి ఉంటుంది. కానీ ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించలేదు. ఏటా విద్యారంగానికి నిధుల కేటాయింపులను తగ్గిస్తూ వస్తున్నది. ఈసారి మాత్రం స్వల్ప ఊరటనిస్తూ గతేడాది కంటే 0.32 శాతం నిధులను పెంచింది. 2014-15లో 10.88 శాతం, 2015-16లో 9.69 శాతం, 2016-17లో 8.23 శాతం, 2017-18లో 8.49 శాతం, 2018-19లో 7.61 శాతం, 2019-20లో 6.76 శాతం, 2020-21లో 6.63 శాతం, 2021-22లో 6.76 శాతం, 2022-23లో 6.24 శాతం, ఇప్పుడు 2023-24లో 6.56 శాతం నిధులను కేటాయించింది.

2023-24 బడ్జెట్‌లో విద్యకు కేటాయింపులు (రూ.కోట్లలో...)

విభాగం	నిర్వహణ పద్దు	ప్రగతి పద్దు	మొత్తం
పాఠశాల విద్య	రూ.14,166.59	రూ.1,883.81	రూ.16,050.4
ఉన్నత విద్య	రూ.1,886.26	రూ.655.48	రూ.2,541.74
సాంకేతిక విద్య	రూ.421.93	రూ.37.32	రూ.459.25
మొత్తం	రూ.16,474.78	రూ.2,576.61	రూ.19,051.39

విద్యారంగానికి ఏటా బడ్జెట్ కేటాయింపులు (కోట్లలో...)

ఆర్థిక సంవత్సరం	మొత్తం బడ్జెట్	విద్యకు కేటాయింపు	శాతం
2023-24	రూ.2,90,296	రూ.19,051	6.56
2022-23	రూ.2,56,958	రూ.16,043	6.24
2021-22	రూ.2,30,825	రూ.13,564	5.88
2020-21	రూ.1,82,914	రూ.12,127	6.63
2019-20	రూ.1,46,492	రూ.9,899	6.76
2018-19	రూ.1,74,453	రూ.13,278	7.61
2017-18	రూ.1,49,646	రూ.12,705	8.49
2016-17	రూ.1,30,415	రూ.10,738	8.23
2015-16	రూ.1,15,689	రూ.11,216	9.69
2014-15	రూ.1,00,637	రూ.10,956	10.88

రుణమాఫీకి కేటాయింపులు సరిపోవు

అవసరం రూ.19,700 కోట్లు...ఇచ్చింది రూ.6,325 కోట్లు

- 90వేల లోపు రుణాలు మాఫీ
- రైతు నెత్తిన వడ్డీ భారం



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం జంబో బడ్జెట్ ప్రవేశ పెట్టింది. అందులో వ్యవసాయానికి 9.2 శాతం మాత్రమే. 2021-22 వార్షిక బడ్జెట్‌తో పోల్చుకుంటే 2022-23తో రూ 700 కోట్లమేరకు తగ్గించింది. ఈసారి బడ్జెట్‌లో రూ కొంత పెంచినా, అందులో రైతురుణమాఫీకి కేటాయించిన నిధులు వారిని రుణవిముక్తులను చేయలేవు. రాష్ట్రంలో 38 లక్షల మంది రైతులు వివిధ బ్యాంకుల్లో రుణం తీసుకున్నారు. గత ఎన్నికల్లో లక్ష లోపు రుణమాఫీ చేస్తామని సర్కారు హామీ ఇచ్చింది. కానీ విడతల వారీగా రుణమాఫీ చేయడంతో వడ్డీ మిగిలిపోయింది. వడ్డీకి వడ్డీకి వేసి బ్యాంకులు కుప్ప చేశాయి. గతేడాది రూ 35వేల లోపు రుణమాఫీ చేసింది. కానీ ఆ రుణాలకు వడ్డీ చెల్లించలేదు. రుణమాఫీ కాకపోవడం, వడ్డీ రెట్టింపు కావడం, భారం పెరిగిపోవడం, రైతులు అప్పులు చెల్లించకపోవడంతో బ్యాంకులు రుణాలు ఇవ్వలేదు. లక్షలోపు రుణమాఫీ చేయాలంటే రూ 19,700 కోట్లు అవసరం. కానీ ప్రభుత్వం రూ. 90వేల లోపు రుణాలను మాఫీ చేస్తున్నట్టు ప్రకటించింది. అందుకు రూ 6,385 కోట్లు కేటాయించింది. ఈ క్రమంలో లక్షలోపు రుణమాఫీ చేస్తుందన్న ఆశలు ఆడియాలయ్యాయి. గత అసెంబ్లీ సమావేశాల్లో సీఎం కేసీఆర్ వడ్డీ ప్రభుత్వమే చెల్లిస్తుందని ప్రకటించారు. కానీ ఇంత వరకు అమలు కాలేదు. దీంతో రైతులు ప్రయివేటు అప్పులబారిన పడి ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే అనేక జిల్లాల్లో రైతులు డిఫాల్టర్లుగా మారారు. ఈ పరిస్థితుల నుంచి గట్టెక్కించాలని రైతులు కోరుతున్నారు.

వ్యవసాయ బడ్జెట్ ఆశాజనకంగా లేదు

వ్యవసాయానికి బడ్జెట్ కేటాయింపులు ఆశాజనకంగా లేవని వ్యవసాయ విధాన విశ్లేషకులు దొంతి నర్సింహారెడ్డి పేర్కొన్నారు. ఈమేరకు సోమవారం ఆయన నవతెలంగాణతో మాట్లాడారు. ఎన్నికల నేపథ్యంలో రైతుల కోసం మంచి పథకాన్ని ప్రకటిస్తారని ఆశించామని తెలిపారు. బడ్జెట్ కేటాయింపులు కూడా ప్రాధాన్యత పద్దతిలో లేవని గుర్తు చేశారు. వానాకాలం, యాసంగి సీజన్లలో రైతులు ఎంతో నష్టపోయారనీ, వారిని ఆదుకునేందుకు బడ్జెట్ దారి చూపలేదని చెప్పారు. పత్తి, మిరప, పసుపు రైతులు నష్టపోతున్నా...వారిని ఆదుకునేందుకు చర్యలు తీసుకోలేదన్నారు.

వ్యవసాయవిధాన విశ్లేషకులు దొంతి నర్సింహారెడ్డి

బడ్జెట్ లో ఏకకాలంలో రుణమాఫీకి నిధులు పెంచాలి

ఏకకాలంలో రుణమాఫీకి నిధులు పెంచాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోతినేని సుదర్శన్, టి సాగర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర బడ్జెట్‌లో రైతు రుణమాఫీకి రూ.6,385 కోట్లు మాత్రమే ఈ ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. లక్షలోపు రుణాలు మాఫీ చేస్తామన్న హామీ ఇప్పటికీ నెరవేరలేదని పేర్కొన్నారు. అందువల్ల ఏకకాలంలో రుణమాఫీ నిధులు పెంచాలని కోరారు. బడ్జెట్‌లో పరిశోధనలకు, ప్రకృతి వైపరీత్యాల పరిహారానికి, ఉద్యానవన శాఖకు పెద్దగా నిధులు కేటాయించలేదని విమర్శించారు. ఆయిల్ పామ్ సాగుకు అధిక ప్రాధాన్యత ఇచ్చిందనీ, అందుకు తగిన నిధులు కేటాయించలేదని పేర్కొన్నారు. కౌలు రైతులకు ఏ పథకం ప్రకటించలేదని గుర్తు చేశారు. కోతులు, పందులు, ఎలుకలు, అడవి జంతువుల బెడద వలన లక్షలాది ఎకరాలలో పంటలు దెబ్బతింటున్నాయనీ, వాటి నివారణకు బడ్జెట్ కేటాయించలేదని తెలిపారు. పంటల బీమాను రాష్ట్ర ప్రభుత్వం రూపొందించాలనీ, ఈ క్రమంలో వ్యవసాయ బడ్జెట్‌ను రెట్టింపు చేయాలని కోరారు.

తెలంగాణ రైతు సంఘం

వర్సిటీల్లో వసతులకు రూ.500 కోట్లు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల్లో మౌలిక వసతుల కల్పన, హాస్టల్ భవనాల ఆధునీకరణ, కొత్త భవనాల నిర్మాణం కోసం రూ.500 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. విశ్వవిద్యాలయాల్లో మౌలిక వసతుల కల్పన కోసం ఇంత పెద్దఎత్తున నిధులు కేటాయించడం రాష్ట్ర చరిత్రలో ఇదే తొలిసారి అంటూ ప్రకటించింది. రాష్ట్ర ఆవిర్భావం నుంచి విశ్వవిద్యాలయాలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదు. నిధుల కేటాయింపులో వివక్షతను ప్రదర్శించింది. వర్సిటీల ప్రగతి కోసం ఒక్క రూపాయి కేటాయించక పోవడమే ఇందుకు నిదర్శనం. కానీ ఈ బడ్జెట్‌లో అన్ని విశ్వవిద్యాలయాలకూ కలిపి మౌలిక వసతుల కల్పన కోసం ప్రగతి పద్దు కింద రూ.500 కోట్లు కేటాయించడం గమనార్హం. మహిళా విశ్వవిద్యాలయానికి ప్రగతి పద్దు కింద మరో రూ.వంద కోట్లు ప్రతిపాదించింది. రాజీవ్ గాంధీ యూనివర్సిటీ నాలెడ్జ్ టెక్నాలజీ (ఆర్జీయూకేటీ)కి రూ.20 కోట్లు కేటాయించింది. ఈ బడ్జెట్‌లో విశ్వవిద్యాలయాలకు ప్రగతి పద్దు కింద రూ.620 కోట్లు ప్రతిపాదించింది. 2022-23 బడ్జెట్‌లో రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాలయాలకు నిర్వహణ పద్దు కింద రూ.759.37 కోట్లు కేటాయించింది. 2023-24 బడ్జెట్‌లో నిర్వహణ పద్దు కింద రూ.849.67 కోట్లు ప్రతిపాదించింది. ప్రగతి పద్దు, నిర్వహణ పద్దు కలిపి విశ్వవిద్యాలయాలకు మొత్తం రూ.969.67 కోట్లు కేటాయించింది. విశ్వవిద్యాలయాల్లో అధ్యాపక, బోధనేతర సిబ్బంది పోస్టులు ఖాళీలు వెక్కిరిస్తున్నాయి. వాటి భర్తీ కోసం 'తెలంగాణ యూనివర్సిటీల కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డు'ను ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం బిల్లును ఆమోదించింది. అది గవర్నర్ ఆమోదం కోసం రాజ్‌భవన్‌లో పెండింగ్‌లో ఉన్నది. దాని గురించి బడ్జెట్‌లో ప్రభుత్వం ప్రస్తావించకపోవడం గమనార్హం.

విశ్వవిద్యాలయాల వారీగా (2023-24) నిధుల కేటాయింపు (కోట్లలో)

విశ్వవిద్యాలయం	నిర్వహణ పద్దు	ప్రగతి పద్దు	మొత్తం
ఉస్మానియా	రూ.457.10	రూ00	రూ.457.10
కాకతీయ	రూ.127.55	రూ.00	రూ.127.55
అంబేద్కర్	రూ.18.96	రూ.00	రూ.18.96
పొట్టి శ్రీరాములు	రూ.45.01	రూ.00	రూ.45.01
తెలంగాణ	రూ.39.10	రూ.00	రూ.39.10
మహాత్మాగాంధీ	రూ.28.58	రూ.00	రూ.28.58
శాతవాహన	రూ.13.70	రూ.00	రూ.13.70
పాలమూరు	రూ.10.91	రూ.00	రూ.10.91
మహిళ	రూ.00	రూ.100.00	రూ.100.00
జేఎన్‌టీయూహెచ్	రూ.48.94	రూ.00	రూ.48.94
జేఎన్‌ఏఎఫ్‌ఏయూ	రూ.26.71	రూ.00	రూ.26.71
ఆర్జీయూకేటీ	రూ.33.11	రూ.20.00	రూ.53.11
మొత్తం	రూ.849.67	రూ.120.00	రూ.969.67

నవచిత్రం

వసంత కోకిల రిలీజ్‌కి రెడీ



బాబీ సింహా, చిరంజీవి

మధుర ఫిలిమ్ ఫ్యాక్టరీ, ఎస్ఆర్‌టీ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై బాబీ సింహా హీరోగా రమణన్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'వసంత కోకిల'. కాశ్మీర హీరోయిన్‌గా నటిస్తుంది. 40 ఏళ్ల క్రితం కమల్ హాసన్, శ్రీదేవి నటించిన సూపర్ హిట్ టైటిల్ 'వసంతకోకిల'తో ఈ సినిమా రూపొందుతుండటంతో అందరిలోనూ ఆసక్తి నెలకొంది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్‌లుక్, సాంగ్స్ ఆడియెన్స్‌ని బాగా ఆకట్టుకున్నాయి. ఈ సినిమాను తెలుగులో రామ్ తాళ్లూరి నిర్మిస్తున్నారు. తెలుగు, తమిళం, కన్నడలో రూపొందుతున్న ఈ చిత్ర ట్రైలర్‌ను అధికారికంగా విడుదల చేసారు. ఈ సినిమా ట్రైలర్‌ను చిరంజీవి రిలీజ్ చేయగా, కన్నడ ట్రైలర్‌ను స్టార్ హీరో శివరాజ్ కుమార్ లాంచ్ చేశారు.

ట్రైలర్‌ను మొదటి నుండి చివరివరకు మంచి ఆసక్తికరంగా కట్ చేసారు. బాబీ సింహా-కశ్మీర పరదేశీ లవ్ ట్రాక్‌తో పాటు వారి చుట్టూ జరిగే సస్పెన్స్ ఎలిమెంట్స్‌తో సినిమా సాగనున్నట్టు ట్రైలర్‌తో అర్థమవుతుంది.

మిస్టరీ థ్రిల్లర్ జోనర్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో బాబీ సింహా రుద్ర పాత్రలో కనిపించనున్నాడు. ప్రముఖ నటుడు ఆర్య కూడా ఈ సినిమాలో కీలక పాత్ర పోషించారు. ట్రైలర్‌లో రాజేష్ మురుగేషన్ అద్భుతమైన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌తో ఆసక్తిని పెంచాడు. రమణన్ పురుషోత్తమ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని రేష్మి సిన్హా, రజనీ తల్లూరి, రామ్ తాళ్లూరి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం తెలుగు, తమిళం, కన్నడ భాషల్లో ఈనెల 10న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది.

విద్యా వ్యవస్థలోని లోపాలతో యూనివర్శిటీ



బ్రహ్మానందం, ఆర్.నారాయణమూర్తి

నటుడు, రచయిత, దర్శకుడు, నిర్మాత ఆర్.నారాయణమూర్తి తాజాగా తీసిన చిత్రం 'యూనివర్శిటీ'. ఈ సినిమా గురించి ఆయన మాట్లాడుతూ,' '40 ఏళ్ళ సినిమా కెరీర్‌లో ఇది నా 30వ సినిమా. విద్యా వ్యవస్థ మీద ఈ సినిమా ఉంటుంది. విజయనగరం పార్లకిమిడి పరిసర ప్రాంతాల్లో షూటింగ్ చేశాను. అక్కడ నాకు సహకరించిన మంత్రి బొత్స సత్యనారాయణకి థ్యాంక్స్. ధన్యవాదములు. వైజాగ్ సత్యానంద్ ఆధ్వర్యంలో శిక్షణ తీసుకున్న స్టూడెంట్స్ ఈ సినిమాలో నటించారు. భారతదేశంలో విద్యా వ్యవస్థ, వైద్య సంస్థలు రెండు సేవా రంగాలు అని రాజ్యాంగం చెపుతుంది. అందుకు అనుగుణంగా ప్రభుత్వాలు ఈ రెండు రంగాలను ప్రైవేటు పరంగా కాకుండా ప్రభుత్వమే నిర్వహించేలా ఉండాలి. విద్యార్థులు జాతి సంపద వారిని కుల, మత భేదం లేకుండా ప్రోత్సహించాలి. విద్య ఇప్పుడు ప్రైవేటు పరం అయిపోతుంది. భారత దేశంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలతో తీసాను. ప్రధాని నరేంద్రమోడీ సంవత్సరానికి రెండు కోట్లు ఉద్యోగాలు ఇస్తామన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేయకుండా మీరిచ్చిన హామీలు నెరవేర్చాలని విజ్ఞప్తి చేస్తున్నాను' అని తెలిపారు.

'ఆర్ నారాయణమూర్తి స్నేహచిత్ర పిక్చర్స్ బ్యానర్ పెట్టి ఎన్నో అద్భుతమైన సినిమాలు నిర్మించారు. కళా దర్శకులు ఉన్నారు, వ్యాపారాత్మక దర్శకులు ఉన్నారు. కానీ ప్రజా దర్శకుడు ఆర్.నారాయణ మూర్తి ఒక్కడే. చలన చిత్రం అనే సముద్రం వంక అందరూ చూస్తే, ఆ సముద్రం చూసే అరుదైన వ్యక్తి ఆర్ నారాయణ మూర్తి. నమ్ముకున్న సిద్ధాంతం కోసం పాటు పడే వ్యక్తి. విద్యా వ్యవస్థ బ్యాక్ డ్రాప్‌లో ఈ సినిమా తీశారు. అప్పటిలో ఉన్న చదువు ఇప్పుడు లేదు. అప్పుడున్న గౌరవం ఇప్పుడు లేదు. ఇప్పటి గురుశిష్యుల సంబంధం ఏ బార్‌లోనో ఎక్కడో చూడవచ్చు. ఇపుడు చదువుకొనే రోజులొచ్చాయి. కొన్ని యూనివర్సిటీలు విద్యను వ్యాపారంగా మార్చేశాయి. విద్యావ్యవస్థ మాఫియా కథాంశంతో తీశారు. విద్యా వ్యవస్థ ఉన్న లోపాలు తెలుసుకోవాలి అంటే ఈ సినిమా తప్పకుండా చూడండి' అని బ్రహ్మానందం చెప్పారు.

సందేశాత్మకంగా సిరిమల్లెపువ్వు



శ్రావణి నిక్కీ, శ్రీకర్ కృష్ణ

షకీరా మూవీస్ పతాకంపై శ్రీకర్ కృష్ణ, శ్రావణి నిక్కీ, అజయ్ ఘోష్, జయ నాయుడు, అమ్మ రమేష్, షఫీ క్వాద్రి నటీనటులుగా గౌతమ్ మైలవరం దర్శకత్వంలో కౌసర్ జహాన్ నిర్మించిన చిత్రం 'సిరిమల్లె పువ్వా'.

అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని ఈనెల10న గ్రాండ్‌గా థియేటర్స్‌లో విడుదల అవుతున్న నేపథ్యంలో ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్ సినీ పెద్దల సమక్షంలో గ్రాండ్‌గా జరిగింది. ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన డైరెక్టర్‌లు చంద్రమహేష్, సముద్ర, ప్రొడ్యూసర్ కౌన్సిల్ సెక్రటరీ తుమ్మల ప్రసన్నకుమార్ ఈ చిత్రంలోని పాటలను, టీజర్‌ను విడుదల చేశారు.

ఈ సందర్భంగా నిర్మాత కౌశర్ జహాన్ మాట్లాడుతూ, 'దర్శకులు గౌతమ్ సమాజానికి మంచి మెసేజ్ ఇవ్వాలనే ఆలోచనతో, ఆశయంతో ఈ సినిమా తీశారు. ఒక ట్రైబల్ అమ్మాయి ఒక అబ్బాయిని స్వచ్ఛంగా ప్రేమిస్తే ఎన్ని ఇబ్బందులు పడింది?, అలాగే అణగారిన వర్గాలకు జరుగుతున్న అన్యాయం ఏమిటి అనేది చూపిస్తూ ఈ సినిమాలో ఒక మంచి సందేశం ఇచ్చాం' అని చెప్పారు.

'ఓ మంచి కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాం. సినిమాలపై నాకు ఉన్న అభిరుచిని గుర్తించి అవకాశం ఇచ్చిన నిర్మాత కౌసర్ జహాన్‌కి థ్యాంక్స్' అని దర్శకుడు గౌతమ్ అన్నారు. హీరో శ్రీకర్ కృష్ణ మాట్లాడుతూ, 'ఇలాంటి మంచి కథకి నన్ను సెలెక్ట్ చేసిన దర్శక, నిర్మాతలకు ధన్యవాదాలు' అని చెప్పారు. హీరోయిన్ నిక్కీ శ్రావణి మాట్లాడుతూ,'గిరిజన నేపథ్యంలో వస్తున్న భిన్న సినిమా ఇది' అని తెలిపారు.

ఆటలు

క్రీడా పద్దు రూ.134.80 కోట్లు

నవతెలంగాణ-హైదరాబాద్

రాష్ట్ర బడ్జెట్‌లో క్రీడా రంగానికి మరోసారి నిరాశే ఎదురైంది. స్పోర్ట్స్ సిటీ నిర్మాణం, ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇవ్వగల స్థాయిలో ప్రపంచశ్రేణి మౌళిక సదుపాయాల కల్పనపై తరచుగా హామీలిచ్చినా.. ఆచరణలో అందుకు భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. తాజాగా 2023-24 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో క్రీడలకు రూ.134.80 కోట్లు మాత్రమే కేటాయింపులు చేశారు. 2022-23 రాష్ట్ర బడ్జెట్‌లో క్రీడలకు రూ.81.01 కోట్లు కేటాయింపులు చేయగా..ఈ ఏడాది బడ్జెట్ కేటాయింపుల్లో రూ.53.79 కోట్లు అదనంగా ఇచ్చారు. అయితే, వీటిలో అత్యధికంగా రూ.45 కోట్లు తెలంగాణ క్రీడా ప్రాంగణాలకు కేటాయించారు. రాష్ట్రంలో నూతన క్రీడా సదుపాయాలు, మౌళిక వసతులు కల్పించే దిశగా ఎటువంటి పురోగతి లేదు. స్టేడియాల నిర్మాణం, ఆధునీకరణ, సదుపాయల కోసం రూ.30 కోట్లు, రాష్ట్ర క్రీడా సంఘాలకు నిధులు, క్రీడాకారుల నగదు ప్రోత్సాహకాల నిమిత్తం రూ.15 కోట్లు, తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాట్స్)కు రూ.20.74 కోట్లు, వరంగల్-కరీంనగర్ క్రీడా పాఠశాలలకు రూ.16.53 కోట్లు, తెలంగాణ క్రీడా ప్రాంగణాలకు రూ. 45 కోట్లు, తెలంగాణ రాష్ట్ర క్రీడా పాఠశాలకు రూ.7.3 కోట్లు కేటాయింపులు చేశారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల నిర్వహణకు అనుగుణంగా ప్రపంచ శ్రేణి సౌకర్యాల కల్పన దిశగా బడ్జెట్‌లో ప్రాధాన్యత దక్కలేదు.


బడ్జెట్ ప్రసంగంలో దక్కని చోటు
తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ 2023-24

ప్రసంగంలో లేని ప్రస్తావన : ఇదిలా ఉండగా, రాష్ట్ర ప్రభుత్వ కీలక బడ్జెట్ ప్రసంగంలో సైతం క్రీడా రంగానికి చోటు లభించలేదు. 89 పేజీల ప్రసంగ పాఠంలో రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ ప్రాధాన్యతల గురించి ఆర్థిక శాఖ మంత్రి టి. హరీశ్‌రావు ప్రస్తావించారు. కానీ ఎక్కడా క్రీడల ఊసెత్తలేదు. బడ్జెట్ ప్రసంగంలో క్రీడలను విస్మరించటంతోనే క్రీడా రంగం అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధి తేటతెల్లమైంది.



ఇక్కడ నెగ్గితే..యాషెస్ కంటే గొప్ప!

భారత్‌లో టెస్టు సిరీస్‌పై స్మిత్, వార్నర్



నవతెలంగాణ-బెంగళూర్

భారత్, ఆస్ట్రేలియా బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ పోరు ప్రపంచ క్రికెట్‌లో ప్రతిష్టాత్మక సిరీస్‌ల్లో ఒకటి. గత దశాబ్దానికి పైగా ఈ రెండు జట్లు టెస్టుల్లో తలపడిన ప్రతిసారి నరాలు తెగే ఉత్కంఠతో పాటు ఇరు జట్ల డ్రెస్సింగ్‌రూమ్ వాతావరణం వేడెక్కేలా చేస్తుంది. గత రెండు బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలను టీమ్ ఇండియా గెల్చుకోగా.. 2016-17 తర్వాత తొలిసారి భారత్‌లో బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో ఆడనున్న ఆస్ట్రేలియా.. ఇక్కడ సిరీస్ విజయం సాధిస్తే అది యాషెస్ కంటే గొప్పగా ఉంటుందని అభివర్ణించారు. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో తొలి టెస్టు ఫిబ్రవరి 9న నాగ్‌పూర్‌లో ఆరంభం కానుంది.

' సిరీస్ విజయం పక్కనపెడితే.. భారత్‌లో ఓ టెస్టు మ్యాచ్ నెగ్గటం సైతం అత్యంత క్లిష్టమైన పని. మేము (ఆస్ట్రేలియా) ఆ పని చేయగలిగితే ఆ ప్రభావం చాలా పెద్దగా ఉంటుంది. భారత్‌లో టెస్టు సిరీస్ విజయం.. యాషెస్ సిరీస్ కంటే పెద్దదని నా అభిప్రాయం' అని కీలక బ్యాటర్, మాజీ కెప్టెన్ స్టీవ్ స్మిత్ అన్నాడు. ' యాషెస్ సిరీస్ విజయంలో భాగం కావటం అమోఘమైన భావన. కానీ టెస్టు క్రికెట్‌లో భారత్‌లో భారత్‌ను ఓడించటమనే సవాల్ మాకు అత్యంత కఠినం. భారత పర్యటన పట్ల ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. ప్రపంచంలోని అత్యుత్తమ స్పిన్నర్లను ఎదుర్కొనేందుకు నాకు నేను ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను' అని డ్యాషింగ్ ఓపెన్ డెవిడ్ వార్నర్ అన్నాడు. గాయాలతో తొలి టెస్టుకు దూరమైన జోశ్ హాజెల్‌వుడ్, మిచెల్ స్టార్క్ సైతం భారత్‌లో టెస్టు విజయంపై ఆసక్తికర వ్యాఖ్య చేశారు. 'భారత్‌లో భారత్‌పై టెస్టు విజయం సాధించి చాలా కాలమైంది. ప్రపంచ క్రికెట్‌లో అందరి లక్ష్యం ఒక్కటే.. భారత్‌లో టెస్టు సిరీస్ విజయం అందుకోవటం. భారత్‌లో బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ సాధిస్తే అది ఆస్ట్రేలియా క్రికెట్ కీర్తి కిరీటంలో విలువైన వజ్రంగా నిలిచిపోనుంది. ఇక్కడ పర్యటించటం అత్యంత కఠినం. ఈ పరిస్థితుల్లో భారత్ అత్యంత బలమైన జట్టు. ఆ సంగతి అందరికీ తెలిసిందే. ఎన్నో ఆస్ట్రేలియా పర్యాటక జట్లకు అందని ద్రాక్ష భారత్‌లో టెస్టు సిరీస్ విజయమని' హాజెల్‌వుడ్, స్టార్క్‌లు అన్నారు. ఇక ఆస్ట్రేలియా కెప్టెన్ పాట్ కమిన్స్ సైతం సహచరుల అభిప్రాయాలు ప్రతిధ్వనించేలా మాట్లాడారు. ' భారత్‌లో టెస్టు సిరీస్ విజయం సాధించటం యాషెస్ సిరీస్, అంతకంటే ఎక్కువ విలువైనది. ఇక్కడ నెగ్గితే అది కెరీర్ హైలైట్‌గా నిలిచిపోతుంది. ఆస్ట్రేలియా క్రికెట్‌లో ఓ శకాన్ని ప్రతిబింబించే విజయంగా ఉంటుంది' అని పాట్ కమిన్స్ అన్నాడు. భారత్‌తో బోర్డర్-గవాస్కర్ టెస్టు సిరీస్ కోసం ఆస్ట్రేలియా ఆటగాళ్లు బెంగళూర్‌లో నాలుగు రోజుల పాటు సాధన చేస్తున్నారు. నేడు బెంగళూర్ నుంచి నాగ్‌పూర్‌కు ఆసీస్ క్రికెటర్లు బయల్దేరనున్నారు. ఈ నేపథ్యంలో ఆస్ట్రేలియా క్రికెటర్లు సీఏ వెబ్‌సైట్‌కు ఇచ్చిన వీడియో ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు.



దంత వైద్యుల ధమాకా

హెచ్‌ఓటీఏ టోర్నీలో డబుల్స్ టైటిల్ కైవసం

హైదరాబాద్: హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్‌లో దంత వైద్యులు దూకుడు చూపించారు. 2021 హెచ్‌ఓటీఏ టోర్నీ రన్నరప్‌గా నిలిచిన దంత వైద్యుల జోడీ ప్రదీప్ వల్లూరిపల్లి, చిరుమామిల్ల శ్రీరామ్.. రెండేండ్ల విరామం అనంతరం అదే వేదికపై చాంపియన్స్‌గా నిలిచారు. ఎల్బీ స్టేడియంలో జరిగిన 12వ హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్ పురుషుల డబుల్స్ (40 ప్లస్ విభాగం)లో ప్రదీప్, శ్రీరామ్ టైటిల్ సాధించారు. ఫైనల్లో లగ్గని శ్రీనివాస్, శివ రామరాజు జోడీపై 10-7తో మెరుపు విజయం సాధించారు. 2021లో శ్రీనివాస్, శివరామరాజులకు టైటిల్ కోల్పోయిన ప్రదీప్, శ్రీరామ్.. ఈ ఏడాది వారిని ఓడించి విజేతలుగా నిలిచారు. ఇక మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో ఎం. గాయత్రి, ఏ. చక్రధర్ జోడీ టైటిల్ ఎగరేసు కుపోయింది. ఫైనల్లో శశికళ, కష్టా రెడ్డి జోడీపై 8-4తో అలవోక విజయం సాధించారు. ప్రదీప్, శ్రీరామ్ సహా గాయత్రి, చక్రధర్‌లు వసంత్‌నగర్ క్లబ్‌కు చెందిన క్రీడాకారులు కావటం విశేషం.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

ప్రధాని మోడీ సమాధానం చెప్పాలి

వాయిదాల పర్వంలో ఉభయ సభలు



న్యూఢిల్లీ : అదానీ అంశంపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సమాధానం చెప్పాలని ప్రతిపక్ష పార్టీల నేతలు డిమాండ్ చేశారు. హిండెన్‌బర్గ్ సంస్థ నివేదిక, అదానీ కంపెనీల షేర్ల భారీ పతనం అంశాలపై చర్చ జరపాల్సిందేనని ప్రతిపక్షాలు పట్టుబట్టడంతో వరుసగా మూడో రోజు పార్లమెంట్ స్తంభించింది. ఉభయ సభలు వాయిదాల పర్వం తొక్కాయి. ప్రతిపక్షాల ఆందోళనలతో ఎలాంటి చర్చ జరగకుండానే ఉభయ సభలు మంగళ వారానికి వాయిదా పడ్డాయి. సోమవారం ఉదయం 11 గంటలకు లోక్‌సభ ప్రారంభం కాగానే అదానీ కంపెనీ స్టాక్ మానిప్యులేషన్, దానివల్ల ఎల్‌ఐసీకి జరిగిన నష్టంపై చర్చించాలంటూ ప్రతిపక్ష సభ్యులు పట్టుబట్టారు. అందుకోసం వాయిదా తీర్మానాలు ఇవ్వగా లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా తిరస్కరించారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ జరిపేందుకు ప్రతిపక్షాలు సహకరించాలని కోరారు. దేశ ప్రయోజనాల కోసం కాదనీ, ప్రజలు తమ సమస్యలను లేవనెత్తడానికి ఎంపీలను ఎన్నుకున్నారని అన్నారు. దీంతో ప్రతిపక్ష ఎంపీలు ఆందోళనకు దిగారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో సభ ప్రారంభమైన ఐదు నిమిషాలకే మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా పడింది. తిరిగి ప్రారంభమైన సభలో అదే గందరగోళం నెలకొంది. దీంతో సభ ఏడు నిమిషాల్లోనే మంగళవారానికి వాయిదా పడింది. రాజ్యసభలోనూ సభ ప్రారంభం కాగానే అదానీ కంపెనీ వల్ల ఎల్‌ఐసీ నష్టాలపై చర్చించాలంటూ ప్రతిపక్ష సభ్యులు పట్టుబట్టారు. వరుసగా మూడో రోజూ పార్లమెంట్‌లో ఎలాంటి కార్యకలాపాలు సాగలేదు.

అదానీ సర్కార్ డౌన్ డౌన్

హిండెన్‌బర్గ్ రీసెర్చ్ ఇచ్చిన నివేదిక మొత్తం వ్యవహారంపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ), సుప్రీంకోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేస్తూ పార్లమెంట్ ఆవరణంలో మహాత్మా గాంధీ విగ్రహం వద్ద 16 ప్రతిపక్షాలు సోమవారం ఆందోళన చేపట్టాయి. కాంగ్రెస్, డీఎంకే, టీఎంసీ, సీపీఐ(ఎం), సీపీఐ, ఆర్జేడీ, బీఆర్‌ఎస్, ఎస్పీ, శివసేన, ఐయూఎంఎల్, కేరళ కాంగ్రెస్, ఆర్‌ఎస్పీ, తదితర పార్టీల నేతలు ప్లకార్డులు చేబూని నినాదాల హెూరెత్తించారు. ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని ప్రభుత్వానికి, బిలియనీర్‌కు మధ్య "యారీ" (స్నేహం) అని నినాదాలు చేశారు. "ఎస్‌బీఐ, ఎల్‌ఐసీ వల్ల పెద్దమొత్తంలో ప్రజాధనం అదానీ గ్రూప్‌లో లాక్ చేయబడింది" అని ప్రతిపక్ష నేతలు విమర్శించారు. అంతకు ముందు పార్లమెంట్‌లో ప్రతిపక్ష నేత కార్యాలయంలో ప్రతిపక్షాల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కాంగ్రెస్, డీఎంకే, ఎన్‌సీడిఎంకె, ఎన్‌సిపి, బిఆర్‌ఎస్, జెడియు, ఎస్‌పి, సిపిఎం, సిపిఐ, కేరళ కాంగ్రెస్ (జోస్ మణి), జెఎంఎం, ఆర్‌ఎల్‌డి, ఆర్‌ఎస్‌పి, ఆప్, ఐయుఎంఎల్, ఆర్‌జెడి, శివసేన నేతలు పాల్గొన్నారు.

'రాష్ట్రపతి ప్రసంగం చర్చకు తగిన ప్రాముఖ్యత ఉంది, కానీ...': అదానీ సమస్యపై ఖర్గే

రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గే అదానీ సమస్యపై చర్చ గురించి మాట్లాడుతూ "మేము మా నోటీసులపై (పార్లమెంటులో) చర్చకు డిమాండ్ చేస్తున్నాం. మేము వివరమైన చర్చకు సిద్ధంగా ఉన్నాం. ముందుగా దానిని చేపట్టాలని మేము కోరుతున్నాం. మాట్లాడటానికి సిద్ధంగా ఉన్నాం. రాష్ట్రపతి ప్రసంగంపై మేము దానికి తగిన ప్రాముఖ్యతనిస్తాము. అయితే ఈ సమస్యపై ప్రధాని మోడీ సమాధానం ఇవ్వడమే మొదటి ప్రాధాన్యత" అని పేర్కొన్నారు.

'ప్రతిపక్షాలన్నీ ఒక్కతాటిపైకి వస్తాయి'

అదానీ సమస్యపై పార్లమెంట్‌లో ప్రతిపక్షాల వ్యూహాన్ని లోక్‌సభలో కాంగ్రెస్ పక్షనేత అదిర్ రంజన్ చౌదరి ప్రస్తావిస్తూ "మేము ఇప్పుడు సమావేశం అయ్యాం, మొత్తం ప్రతిపక్షాలు కలిసి, చర్చించి నిర్ణయం తీసుకుంటాం. ఇది కాంగ్రెస్ సమస్య కాదు. దేశంలోని సాధారణ ప్రజల సొమ్ముకు సంబంధించినది" అని అన్నారు.

ఆదానీపై దర్యాప్తు జరిపించాలి-ఎమ్మెల్సీ కవిత

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

అదానీ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని ఎమ్మెల్సీ కే కవిత డిమాండ్ చేశారు. దీనిపై ప్రధాని మౌనంగా ఎందుకు ఉంటున్నారో చెప్పాలన్నారు. రూ. 10 లక్షల కోట్ల దేశ ప్రజల సంపద ఆవిరయితే, అంతా బాగేనే ఉందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి ఎలా అంటారని ప్రశ్నించారు. ఏ ప్రభుత్వ మద్దతుతో ఆదానీ రూ. 60 వేల కోట్ల నుంచి రూ. 10 లక్షల కోట్లకు వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించారో ప్రజలందరికీ తెలుసన్నారు. శాసనమండలి ఆవరణలో సోమవారంనాడామె మీడియాతో మాట్లాడారు. అదానీ వ్యవహారంపై ప్రధాని ప్రజల ముందుకొచ్చి వివరణ ఇవ్వాలనీ, దీనిపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ బడ్జెట్ దేశానికి స్పూర్తిదాయకమని చెప్పారు. ప్రధాన మంత్రి మోడీ మద్దతుతో ఆదానీ అపారమైన సంపదను కూడబెట్టిన విషయం ప్రపంచమంతా తెలుసునని అన్నారు. దామాషా ప్రకారం సామాజిక రంగంలో ఆయా వర్గాల జనాభాకు అనుగుణంగా కేటాయింపులు ఉన్నాయన్నారు.

అన్ని వర్గాలకు ప్రాధాన్యం

- రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ బోయినపల్లి వినోద్‌కుమార్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కేంద్ర ప్రభుత్వం ఎలాంటి సహకారం అందించకుండా ఆర్థిక దిగ్బంధనం చేసినా రాష్ట్ర ప్రభుత్వం తన సొంత రాబడి నుంచి గణనీయంగా ఆదాయాన్ని సమకూర్చుకుంటున్నదనిరాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ బోయినపల్లి వినోద్‌కుమార్ తెలిపారు. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ దీన్ని ప్రతిబింబిస్తున్నదని ప్రసంశించారు. అభివృద్ధి, సంక్షేమ రంగాలకు సమ ప్రాధాన్యత ఇచ్చారన్నారు. రెవెన్యూ రాబడి గణనీయంగా పెరిగిందనీ. ముఖ్యంగా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ విభాగంలో రూ. 18,500 కోట్లు, ఎక్సైజ్ లో రూ. 20,000 కోట్లు, రోడ్ ట్రాన్స్ పోర్ట్ లో రూ. 7,512 కోట్లు, మైనింగ్ లో రూ. 5,917 కోట్ల రాష్ట్ర ఆదాయం సమకూరిందని వివరించారు.

ఏదీ లేదు - టీజేఎస్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రజా సమస్యలకు ఎలాంటి పరిష్కారాన్ని చూపలేకపోయిందనితెలంగాణా జన సమితి (టీజేఎస్) అభిప్రాయపడింది. రైతులు, నిరుద్యోగులు, దళితులు, వెనుకబడిన తరగతులు సహా ఎవరికీ న్యాయం జరగలేదన్నారు. తలసరి ఆదాయం కేవలం హైదరాబాద్‌లో మాత్రమే పెరిగిందనీ, మిగిలిన జిల్లాల్లో చాలా తక్కువగా ఉన్నదని ఆపార్టీ సోమవారంనాటి ప్రకటనలో తెలిపింది.

మూడు నిర్మాణ సంస్థలు నల్లడబ్బును పోగు చేశాయి

- తమ దాడుల్లో తేల్చిన ఐటీ అధికారులు ?
- ఎమ్మెల్సీ వెంకట్రామరెడ్డి నివాసంతో పాటు మరో రెండు నిర్మాణ సంస్థల్లో ముగిసిన ఐటీ సోదాలు

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి : రాష్ట్రంలో గత ఆరు రోజులుగా ప్రముఖ నిర్మాణ సంస్థలపై కొనసాగిన ఐటీ దాడులు సోమవారం ముగిశాయి. ముఖ్యంగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ వెంకట్రామరెడ్డి కి చెందిన రాజ్ పుష్ప బిల్డర్స్‌తో పాటు ముప్పా, వర్టెక్స్ బిల్డర్స్‌పైనా గత ఆరు రోజులుగా ఐటీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. కోట్లాది రూపాయల వ్యయంతో ఈ సంస్థలు విల్లాలను నిర్మించడంతో పాటు అనేక నూతన భవనాలు, ఇండ్లను కూడా నిర్మించినట్టు ఐటీ సోదాలలో వెల్లడైనట్టు తెలిసింది. ముఖ్యంగా తాము నిర్మించిన విల్లాలు, ఇండ్లను విక్రయించే సమయంలో కొన్న వారి నుంచి భారీ మొత్తంలో నల్లధనాన్ని కూడా ఈ బిల్డర్లు సేకరించిన విషయం ఐటీ దాడుల్లో వెలుగు చూసినట్టు తెలిసింది. ముఖ్యంగా తమ నిర్మాణాలను విక్రయించడం ద్వారా పొందిన కోట్లాది రూపాయల లాభాలను నల్లధనంతో పాటు వేరే వ్యాపారాలలో పెట్టుబడులను పెట్టినట్టుగా సమాచారం. గత ఆరు రోజులుగా ఈ సంస్థల ఎండీలు, సీఈఓలు, ఇతర డైరెక్టర్లు, ఇతర అక్కౌంటెంట్ల ఇండ్లలోను ఐటీ అధికారులు సోదాలు జరిపారు. అలాగే గత ఆరు రోజులుగా ఎమెల్సీ వెంకట్రామరెడ్డి నివాసంలో వరుసబెట్టి సోదాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున వ్యాపార లావాదేవీలకు సంబంధించిన డాక్యుమెంట్లు, ఐటీ చెల్లింపులకు సంబంధించిన ఫైళ్లను ఐటీ అధికారులు స్వాధీనపర్చుకున్నారని తెలిసింది.

ప్రయివేటు స్కూళ్లలో 50.23 శాతం విద్యార్థులు

- సర్కారు బడుల్లో 49.77 శాతం చేరిక

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

రాష్ట్రంలో 2021-22 విద్యాసంవత్సరంలో 41,369 పాఠశాలల్లో 62,28,665 మంది విద్యనభ్యసించారు. అందులో 11,637 (26.5 శాతం) బడుల్లో 31,28,532 (50.23 శాతం) మంది విద్యార్థులున్నారు. 29,732 (73.5 శాతం) ప్రభుత్వ పాఠశాలల్లో 31,00,133 (49.77 శాతం) మంది విద్యార్థులు చేరారు. ఈ వివరాలను రాష్ట్ర ప్రభుత్వం సోషియో ఎకనామిక్ ఔట్‌లుక్‌లో వెల్లడించింది. 2014-15లో సర్కారు బడుల్లో 47.88 శాతం మంది చదివితే, ప్రయివేటు పాఠశాలల్లో 52.12 శాతం మంది విద్యార్థులు చదివేవారు. 2015-16లో సర్కారు పాఠశాలల్లో 46.95 శాతం, ప్రయివేటు స్కూళ్లలో 53.05 శాతం, 2016-17లో ప్రభుత్వ బడుల్లో 46.20 శాతం, ప్రయివేటు పాఠశాలల్లో 53.80 శాతం, 2017-18లో ప్రభుత్వ పాఠశాలల్లో 45.09 శాతం, ప్రయివేటు స్కూళ్లలో 54.01 శాతం, 2018-19లో సర్కారు బడుల్లో 44.30 శాతం, ప్రయివేటు స్కూళ్లలో 55.70 శాతం, 2019-20లో ప్రభుత్వ స్కూళ్లలో 42.91 శాతం, ప్రయివేటు పాఠశాలల్లో 57.09 శాతం, 2020-21లో సర్కారు పాఠశాలల్లో 43.47 శాతం, ప్రయివేటు స్కూళ్లలో 56.53 శాతం, 2021-22లో ప్రభుత్వ పాఠశాలల్లో 49.77 శాతం, ప్రయివేటు బడుల్లో 50.23 శాతం విద్యార్థులు చదివారు. కరోనా తర్వాత ప్రయివేటు బడుల నుంచి సర్కారు పాఠశాలల్లో విద్యార్థులు చేరుతుండడం గమనార్హం. ఇంకోవైపు మన ఊరు మనబడి, మన ఊరు మనబస్తీ పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో 12 రకాల మౌలిక వసతులను ప్రభుత్వం కల్పిస్తున్నది. మరోవైపు ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు సమాంతరంగా ఆంగ్ల మాధ్యమాన్ని ప్రారంభించడం గమనార్హం. రాష్ట్రంలో 35,700 అంగన్‌వాడీల్లో 6,09,922 మంది, 41,369 బడుల్లో 62,28,665 మంది, 2,963 జూనియర్ కాలేజీల్లో 9,48,321 మంది, 1,073 డిగ్రీ కాలేజీల్లో 3,84,021 మంది, 1,327 వృత్తి విద్యా కాలేజీల్లో 2,23,427 మంది కలిపి మొత్తం 82,432 విద్యాసంస్థల్లో 83,94,356 మంది విద్యార్థులు చదువుతున్నారు.

దేశంలోనే మొదటి మెబిలిటీ ఫోకస్డ్ క్లస్టర్

- తెలంగాణ మొబిలిటీ వ్యాలీని ఆవిష్కరించిన మంత్రి కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశంలోనే తొలి మొబిలిటీ ఫోకస్డ్ క్లస్టర్‌ను తెలంగాణ రాష్ట్రం ప్రకటించింది. సోమవారం హైదరాబాద్‌లో తెలంగాణ మొబిలిటీ వ్యాలీని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కె.తారక రామారావు ఆవిష్కరించి ప్రసంగించారు. ఈ రంగంలో రూ.50 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించి రాబోయే ఐదేండ్లలో నాలుగు లక్షల ఉద్యోగాలను సృష్టించడం తమ లక్ష్యమని తెలిపారు. ఈ వ్యాలీ దేశంలో తయారీ, పరిశోధన, అభివద్ధిలో సదుపాయాలు మెరుగుపరిచి రాష్ట్రాన్ని ఆకర్షణీయంగా మారుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. హైదరాబాద్ చుట్టుపక్కల నాలుగు మెగా క్లస్టర్లను అభివృద్ధి చేస్తుందన్నారు. జహీరాబాద్‌తో పాటు సీతారాంపూర్‌లో ఈవీ మ్యానుఫాక్చరింగ్ క్లస్టర్, దివిటిపల్లిలో ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ క్లస్టర్, యెంకతల వద్ద ఇన్నోవేషన్ క్లస్టర్‌ను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. మరో రూ.మూడు వేల కోట్ల పెట్టుబడులు రానున్నాయనీ, రెండు వారాల్లో వాటి వివరాలు వెల్లడిస్తామని చెప్పారు. ఎలక్ట్రిక్ 3 వీలర్, ఎలక్ట్రిక్ 2 వీలర్, ఛార్జింగ్ పరికరాల తయారీ ఎకో సిస్టమ్ ను ఆయా సంస్థలు మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వంతో ఏటీఎస్-టీయూవీ రైస్ ల్యాండ్ , బోష్ గ్లోబల్ సాఫ్ట్ వేర్ టెక్నాలజీస్ ఒప్పందం చేసుకున్నాయి. షెల్ తో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) అవగాహనా ఒప్పందాలను కుదుర్చుకున్నది. ఈ కార్యక్రమంలో అపోలో టైర్స్ లిమిటెడ్ చీఫ్ డిజిటల్ ఆఫీసర్ హిజ్మీ హాసెన్, వోక్స్ వ్యాగన్ గ్రూప్ ఇండియా, సేల్స్, మార్కెటింగ్, డిజిటల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ క్రిస్టియన్ కాహ్నా వాన్ సీలెన్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేల కొనుగోలు కేసును సీబీఐకి ఇవ్వడంపై సుప్రీంకు వెళ్లనున్న సిట్ అధికారులు

- కేసు దర్యాప్తునకు సిద్ధమవుతున్న సీబీఐ

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి : దేశంలో సంచలనం రేపిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల కొనుగోలు కేసును సీబీఐకి రాష్ట్ర హైకోర్టు ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టుకు వెళ్లాలని రాష్ట్ర సిట్ అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు సిట్ ఉన్నతాధికారులు సోమవారం చర్చించి నిర్ణయం తీసుకున్నారని తెలిసింది. అంతకముందు ఈ కేసును దర్యాప్తు కోసం సీబీఐకి ఇవ్వాలని రాష్ట్ర హైకోర్టు డివిజన్ బెంచ్ నిర్ణయించింది. అంతేగాక, తాము సుప్రీంకోర్టుకు వెళ్లడానికి గాను ఈ తీర్పును తాత్కాలికంగా సస్పెండ్ చేయాలనే రాష్ట్ర అడ్వకేటు జనరల్ (ఏజీ) చేసుకున్న విజ్ఞప్తిని కూడా హైకోర్టు డివిజన్ బెంచ్ తిరస్కరించింది. అయితే తమ వైపు నుంచి ఎట్టి పరిస్థితిల్లోనూ సుప్రీంకోర్టుకు వెళ్లాలని సిట్ అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పు కాపీ రాగానే సుప్రీంకోర్టుకు వెళ్లాలని అధికారులు భావిస్తున్నారు.

ఇదిలా ఉంటే ఎమ్మెల్యేల కొనుగోలు కేసును విచారించడానికి గాను సీబీఐ అధికారులు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఈ దిశగా హైకోర్టు సింగిల్ జడ్జి తీర్పు ఇచ్చినప్పుడే సీబీఐ అధికారులు చర్యలు చేపట్టినప్పటికీ.. సిట్ అధికారులు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించడంతో మిన్నకున్నారు. ఈ లోపల ఒకసారి ఈ కేసుకు సంబంధించిన దర్యాప్తు ఫైళ్లను తమకు సమర్పించాలని సిట్ అధికారులను కోరిన సీబీఐ అధికారులు దానికి సంబంధించిన లేఖను కూడా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి రాశారు. కాగా తాజాగా డివిజన్ బెంచ్ తమకు ఈ కేసును అప్పగించడంతో దర్యాప్తునకు అవసరమైన ఏర్పాట్లను సీబీఐ త్వరితగతిన చేసుకుంటున్నట్టు తెలిసింది. దీనికి సంబంధించి సీబీఐలో పొలిటికల్ లీడర్ల కేసును విచారించే సీబీఐ అధికారుల బృందం.. ఈ కేసునూ విచారించడానికి వచ్చే అవకాశాలున్నట్టు తెలిసింది.

యాద్రాద్రిలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం

- ప్రారంభించిన హైకోర్టు చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్



నవతెలంగాణ-భువనగిరి

యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్‌ను వర్చువల్ విధానంలో తెలంగాణ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 16 జిల్లాల్లో ఈ సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. జిల్లా కోర్టు ఆవరణలో నూతన కార్యాలయాన్ని యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, అధ్యక్షులు, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ వి.బాలభాస్కర్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. న్యాయ సేవా సలహా కేంద్రం ప్రత్యేకంగా జిల్లాలో ఏర్పాటు చేసినట్టు చెప్పారు. దీనికి డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్‌గా గాదెపాక శంకర్ నియామకమైనట్టు తెలిపారు. ఈ కార్యాలయం ద్వారా న్యాయ సేవలు, సలహాలు ఉచితంగా పొందొచ్చని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ అధ్యక్షులు, హైకోర్టు జడ్జి జస్టిస్ పి.నవీన్‌రావు, యాదాద్రి భువనగిరి జిల్లా పరిపాలన న్యాయమూర్తి, హైకోర్ట్ జడ్జి జస్టిస్ పి.మాధవిదేవి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.దశరథరామయ్య, జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి కె.మారుతీదేవి, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి డి.నాగేశ్వరరావు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కవిత, జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీసీపీ రాజేష్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందు మున్సిపల్ చైర్మెన్‌పై అవిశ్వాస తీర్మానం

- కలెక్టర్ అనుదీప్‌కు పత్రాలు అందజేత
- తిరస్కరించడంతో 18 మహిళా కౌన్సిలర్లు ఆందోళన
- కలెక్టర్ కార్యాలయం ఎదుట బైటాయింపు



నవతెలంగాణ-పాల్వంచ

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు మున్సిపాలిటీ చైర్మెన్‌పై మెజార్టీ మహిళా కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానాన్ని ప్రకటించారు. కౌన్సిలర్ల సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు అందజేయగా, ఆయన తిరస్కరించారు. కలెక్టర్ తీరుపై కౌన్సిలర్లు నిరసన వ్యక్తం చేస్తూ కార్యాలయం ఎదుట బైటాయించారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. పోలీసులు చేరుకొని వారికి నచ్చచెప్పారు. అధికార పార్టీ కౌన్సిలర్లమైన తమను కలెక్టర్ అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. అవిశ్వాస తీర్మానం ఇచ్చే హక్కు మెజార్టీ కౌన్సిలర్లకు ఉందని, కాపీలు కలెక్టర్ తీసుకోకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ సీసీ వినతిపత్రాన్ని తీసుకున్నారు. ఈ సందర్భంగా మహిళా కౌన్సిలర్లు విలేకరులతో మాట్లాడుతూ.. ఇల్లందు మున్సిపాలిటీ చైర్మెన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు వ్యవహార శైలి బాలేదని, మహిళా కౌన్సిలర్ల పట్ల హేళనగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. 24 మంది కౌన్సిలర్లు ఉండగా 18 మంది అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇచ్చారని తెలిపారు. ఎన్నికల సమయంలో పట్టణ అభివృద్ధికి సహకరిస్తామని చెప్పి అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నాడని వాపోయారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి ముందు రోజు అభివృద్ధిపై ఎజెండా గాని జరగబోయే అభివృద్ధిపై తమ కౌన్సిలర్లకు ఎవరికి తెలియపరచకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటూ ప్రశ్నించిన వారిని బెదిరిస్తూ బిల్లులను నెగ్గించుకుంటున్నారని చెప్పారు. అంతేకాకుండా మున్సిపల్ అధికారులను భయపెడుతూ బినామీ కాంట్రాక్టులతో టెండర్లు వేస్తూ పనులు జరిపించుకుంటూ కమీషన్లు దండుకుంటున్నారని ఆరోపించారు. ఇలాంటి అన్యాయాలు, అక్రమాలను ఎన్నో సార్లు చైర్మెన్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. అందుకే మెజార్టీ కౌన్సిలర్లందరం అవిశ్వాస తీర్మానం చేయాలని నిర్ణయించుకున్నామని చెప్పారు. అవిశ్వాస తీర్మానం ఇచ్చిన వారిలో.. కౌన్సిలర్లు సిలివేరు అనిత, వాంకుడోత్ తార, చెరుపల్లి శ్రీనివాస్, తోట లలిత శారద, పత్తి స్వప్న, పాబోలు స్వాతి, వార్డు చీమల సుజాత, సామల మాధవి, సంద బిందు ఉన్నారు.

పక్కా ఇండ్లు మంజూరు చేయాలంటూ.. కలెక్టరేట్ ఎదుట ధర్నా



నవతెలంగాణ-పాల్వంచ

నిరుపేదలమైన తమకు పక్క ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం భద్రాద్రి జిల్లా పాల్వంచలోని జిల్లా కలెక్టరేట్ ఎదుట మహిళలు ఆందోళన చేపట్టారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అశ్వారావుపేట మండలం గుర్రాల చెరువు వద్ద ఉండే తాము రోజువారి కూలీ పనులు చేసుకుంటూ బతుకుతున్నామని తెలిపారు, తమకు ఎలాంటి సొంత స్థలం ఇల్లు లేక అద్దె గదుల్లో ఉంటూ దుర్భరమైన జీవితాలు గడుపుతూ ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. తామంతా ఎస్సీ మాదిగ, బీసీ గొల్ల కులాలకు చెందిన వారమని, ఇప్పటికైనా తమపై దయవుంచి పక్కా ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో మహిళలు కే.పుష్ప, కె.సునీత, కే.లక్ష్మి, ఆర్.మరియమ్మ, చిలకమ్మ, మహాలక్ష్మి, సొరకాయ లక్ష్మి, కె.రాజా రాణి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇండ్ల స్థలాల పట్టాలివ్వాలి

నెల్లుట్లలో గుడిసె వాసులకు కనీస సౌకర్యాలు కల్పించాలి

- ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జనగామ జిల్లా కలెక్టరేట్ ఎదుట పెద్దఎత్తున ధర్నా



నవతెలంగాణ-జనగామ

నెల్లుట్లలోని గుడిసె వాసులకు, నిరుపేదలకు ఇండ్ల స్థలాలకు పట్టాలిచ్చి, కనీస సౌకర్యాలు కల్పిం చాలని డిమాండ్ చేస్తూ జనగామ కలెక్టరేట్ ఎదుట ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గుడిసె వాసులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘాల ఆధ్వర్యంలో ఇండ్లు లేని నిరుపేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని, ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న వారికి ఇళ్ల స్థలాల పట్టాలిచ్చి వారికి మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ సుమారు 1500 మందికి పైగా నిరుపేద ప్రజలు కలెక్టరేట్ ఎదుట బైటాయించారు. ధర్నాకి సింగార రమేష్ అధ్యక్షత వహించగా రైతు సంఘం నాయకులు మోకు కనకా రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఏదునూరి వెంకటరాజం, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి బొట్ల శేఖర్ పాల్గొని మాట్లాడారు. జిల్లాలోని లింగాల ఘన్‌పూర్ మండలం నెల్లుట్ల శివారులో పేదల స్వాధీనంలో ఉన్న ఇంటి స్థలాలకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పట్టాలతో పాటు రూ.5 లక్షలిచ్చి ఇంటి నిర్మాణానికి సహకరించాలని కోరారు. గుడిసె వాసులకు మౌలిక సదుపాయాలైన మంచినీరు, కరెంటు కల్పించాలన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల కోసం ఎంతో ఆశతో ఎదురు చూసిన ప్రజలకు నిరాశే ఎదురయిందని తెలిపారు. భారత రాజ్యాంగం ప్రతి మనిషికి జీవించే హక్కును ఇచ్చిందని, ప్రస్తుత పాల కులు ఆ జీవించే హక్కును సైతం లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

విసిగి వేసారిన ప్రజలు నిలువ నీడ కోసం ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకుని అత్యంత దయనీయమైన పరిస్థితుల్లో కాలం వెల్లబు చుతు న్నారని అన్నారు. వారికి సౌకర్యాలు కల్పించి పట్టాలు ఇవ్వాల్సింది పోయి వేధింపులకు గురి చేస్తూ దాడులు చేస్తున్నారని ఆరోపించారు.

పేదలు తలుచుకుంటే ఎంత గొప్ప ప్రభుత్వాలైన తలవంచక తప్ప లేదని, పేదల స్వాధీనంలోని ఇండ్ల స్థలాలకు పట్టాలిచ్చి, ఇల్లు నిర్మించి ఇవ్వని పక్షంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నా అనంతరం నాయకులు జిల్లా అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయికి డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు, గుడిసె వాసులు, వందలాది మంది పేదలు పాల్గొన్నారు.

అదానీపై చర్యలు తీసుకోవాలంటూ దేశవ్యాప్తంగా కాంగ్రెస్ ఆందోళనలు

న్యూఢిల్లీ : అదానీ ఆర్థిక కుంభకోణాలకు పాల్పడినట్లు హిండెన్‌బర్గ్ నివేదిక ఇచ్చిన నేపథ్యంలో జెపిసి ఏర్పాటు చేయాలని, కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా కాంగ్రెస్ ఆధ్వర్యాన సోమవారం ఆందోళనలు నిర్వహించారు. ఢిల్లీలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యాన జంతర్‌మంతర్ వద్ద ఆందోళన చేశారు. జమ్మూలో వందలాదిమంది కార్యకర్తలు బారికేడ్లు తోసుకుంటూ ఆందోళన చేశారు. ప్రతిపక్షాలపై దాడులకు వినియోగిస్తున్న సిబిఐ, ఇడి, ఐటి, సెబీ ఎక్కడున్నాయి? అదానీ ఆస్తులపై దాడులెందుకు చేయరు? అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. మణిపూర్, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లోనూ కాంగ్రెస్ కార్యకర్తలు పెద్దఎత్తున ఆందోళనలు చేశారు.

మద్రాస్ హైకోర్టు జడ్జి నియామకంపై అభ్యంతరాలు వెల్లువ..

ఢిల్లీ : మద్రాస్ హైకోర్టు జడ్జిగా విక్టోరియా గౌరి నియమిస్తూ కేంద్రం నోటిఫై చేయడంపై వివాదం చెలరేగింది. ఆమెను జడ్జిగా సిఫారసు చేసిన కొలీజియం నిర్ణయంపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. దీంతో గౌరి నియామకాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలైంది. దీనిపై విచారణ జరిపేందుకు సర్వోన్నత న్యాయస్థానం అంగీకరించింది. మొదట వచ్చేవారం విచారణ చేపడతామన్న సీజేఐ జస్టిస్ చంద్రచూడ్.. ఆ తర్వాత ఈ పిటిషన్‌పై మంగళవారమే విచారణ జరుపుతామని చెప్పారు. విక్టోరియా గౌరి గతంలో బీజేపీ మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ముస్లింలు, క్రైస్తవులపై వివాదాస్పద వ్యాఖ్యలు కూడా చేశారు. విక్టోరియా గౌరికి హైకోర్టు జడ్జిగా పదోన్నతి కల్పించడాన్ని కొంతమంది మద్రాస్ హైకోర్టు లాయర్లు ఇప్పటికే వ్యతిరేకించారు. ఆమెను జడ్జిగా నియమించవద్దని రాష్ట్రపతి ద్రౌపది ముర్మ, సుప్రీంకోర్టు కొలీజియాన్ని కోరారు. ఈమె జడ్జి అయితే ముస్లింలు, క్రైస్తవులకు తమకు న్యాయం దక్కుతుంది అనే నమ్మకం ఉంటుందా? అని ప్రశ్నించారు.